www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 23-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 218 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 7.57 తదుపరి నవమి; నక్షత్రం: మఖ రా. 7.27 తదుపరి పుబ్బ; వర్జ్యం: తె. 4. 8.03 వరకు, తె. 4.23-6.10, దుర్ముహూర్తం: ఉ. 6.28-7.57, అమృతఘడియలు: సా. 4.49-6.34; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.28, సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేడే మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఫలితాలు



రాంచీలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూం వద్ద పోలీసు భద్రత

మహారాష్ట్రలో 26తో ముగియనున్న ప్రస్తుత సర్కారు కాల పరిమితి

హంగ్ ఏర్పడితే కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు చాలని వ్యవధి

రాష్ట్రపతి పాలనకు చాన్స్?.. హోటళ్లను రిజర్వ్ చేసిన శివసేన

కొనుగోలుదార్ల నుంచి రక్షణకే: రౌత్.. కూటముల్లో 'సీఎం సీటు' కుస్తీలు

మళ్లీ ఝార్ఖండ్ సీఎం అవుతాననే ధీమాలో హేమంత్ సోరెన్

అధికారం తమదేనంటున్న బీజేపీ.. బరిలో సీఎం సతీమణి కల్పన కూడా

2

అదానీ నుంచి జగన్ తీసుకున్న లంచం రూ.1750 కోట్లు! ఇది అమెరికా దర్యాప్తు సంస్థలు నిర్ధారించిన లెక్క. కానీ.. దీనివల్ల రాష్ట్ర ప్రజలపై పడిన భారం ఎంతో తెలుసా? దాదాపు రూ.72,000 కోట్లు!

పేరుకే సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం! కానీ.. అదానీ సంస్థ ఆ విద్యుత్ సరఫరా చేయనేలేదు. దీంతో 2021 నుంచి 2024 వరకు మార్కెట్‌లో భారీ ధరకు విద్యుత్ కొనుగోలు చేశారు. ఆ భారం రూ.42వేల కోట్లు! దీనిని ట్రూ అప్ చార్జీల రూపంలో ప్రజల నెత్తినే వేశారు. 2021లో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజీఈసీఎల్) పిలిచిన టెండర్లను రద్దు చేయకుంటే.. సోలార్ విద్యుదుత్పత్తి సంస్థలు వెంటనే విద్యుత్ సరఫరా చేసేవి. దీనివల్ల మార్కెట్‌లో అధిక ధరలకు విద్యుత్ కొనాల్సిన అవసరం ఉండేది కాదు. జనం నడ్డివిరిగేలా తొమ్మిదిసార్లు ట్రూఅప్ చార్జీల భారం వేయాల్సిన అవసరం వచ్చేదికాదు.

అదానీ గ్రీన్ ఎనర్జీ ఎక్కడో రాజస్థాన్‌లో ఉత్పత్తయిన విద్యుత్తును ఏపీకి సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. యూనిట్ విలువ రూ.2.49. దీనికి అదనంగా పవర్ గ్రిడ్‌కు యూనిట్‌కు 80 పైసల చొప్పున ట్రాన్స్‌మిషన్ చార్జీలు చెల్లించాలి. దీని భారం.. రూ.30,600 కోట్లు. ఏపీజీఈసీఎల్ టెండర్ల ద్వారా స్థానికంగానే సౌర విద్యుదుత్పత్తి జరిగితే ఈ భారం పడేదే కాదు.

ఆ లంచం ఖరీదు 72 వేల కోట్లు!



1750 కోట్ల ముడుపుల కోసం జనంపై జగన్ భారం

ఒప్పందం మేరకు విద్యుత్తు సరఫరా చేయని 'అదానీ'

2021-24 మధ్య మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు

ఆ భారం 42 వేల కోట్లు.. ట్రూఅప్ చార్జీల పేరుతో బాదుడు

ట్రాన్స్‌మిషన్ చార్జీల భారం రూ.30,660 కోట్లు

ఏపీజీఈసీఎల్ టెండర్లు ఓకే చేసుంటే ఈ భారం తప్పేది

అదానీ కోసమే ఆ టెండర్లను రద్దు చేసిన జగన్ సర్కార్

సెకీ నుంచి గుజరాత్ కొన్నది యూనిట్ రూ.1.99 మాత్రమే

2.49 చెల్లించేందుకు సిద్ధపడి ఒప్పందం చేసుకున్న జగన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకరి అవినీతి... మరొకరి అత్యాశ! ఈ రెండూ కలిపి ఆంధ్రప్రదేశ్ ప్రజలను వేల కోట్లకు ముంచేశాయి. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కోసం అదానీ గ్రూప్ జగన్‌కు సమర్పించిన ముడుపులు రూ.1750 కోట్లని అమెరికా నిగ్గు తేల్చింది. అయితే.. ఇది కేవలం 1750 కోట్లకు సంబంధించిన

మిగతా 12వ పేజీలో...

అదానీ.. దారెటు?

నేరం రుజువైతే అమెరికాలో పాతికేళ్లు జైలు శిక్ష

భారీగా జరిమానాలు కూడా..

అప్పగించాలని కోరవచ్చు!

అది సుదీర్ఘ చట్టపర ప్రక్రియ

న్యాయ నిపుణుల విశ్లేషణ

2

రాష్ట్ర ప్రతిష్ఠకు జగన్ ముడుపుల మసక!



ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టేది లేదు

జగన్ ప్రాసిక్యూషన్‌పై న్యాయ సలహా

వారి అభిప్రాయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం

'సెకీ'తో ఒప్పందంపై ప్రజల కోణంలో నిర్ణయం

'అదానీ-జగన్' వ్యవహారంపై సీఎం వెల్లడి

జగన్ అవినీతిని పార్లమెంటులో ఎండగట్టాలి

టీడీపీ ఎంపీలకు చంద్రబాబు సూచన

అమరావతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముడుపుల మసకతో వైఎస్ జగన్ రాష్ట్ర ప్రతిష్ఠను మంటగలిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఎవరు తప్పుచేసినా వదిలే ప్రసక్తి లేదన్నారు. వదిలేస్తే మరొకరు తప్పు చేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. అంతకుముందు టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలోనూ ఆయన పాల్గొన్నారు. 'జగన్-అదానీ... లంచాల కహానీ'పై చంద్రబాబు స్పందించారు. సౌర విద్యుత్ టెండర్ల వ్యవహారంలో గత జగన్ ప్రభుత్వానికి రూ.1,750 కోట్ల మేర ముడుపులు అందాయని అమెరికా కోర్టులో అక్కడి ప్రభుత్వ సంస్థలు చార్జిషీటు దాఖలు చేసిన నేపథ్యంలో జగన్‌ను ఇక్కడ ప్రాసిక్యూట్ చేస్తారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... "అన్ని కోణాల నుంచీ పరిశీలిస్తున్నాం. ఏం చేయగలమన్నదానిపై న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్నాం. ఇక్కడ మన పరిధి ఎంతవరకూ ఉంది.. చట్టపరంగా ఏం చేయగలమో.. నిపుణుల అభిప్రాయం తెలుసుకున్నాక నిర్ణయానికి వస్తాం' అని చంద్రబాబు బదులిచ్చారు. అదే సమయంలో తప్పు చేసింది ఎవరైనా వదిలేది లేదని స్పష్టం చేశారు. జగన్

మిగతా 12వ పేజీలో...



అదానీతో ఒక్క డీల్‌లోనే 1,750 కోట్లు

ఐదేళ్లలో జగన్‌కు ఇంకెంత లంచం ముట్టిందో?

రాష్ట్రాన్ని అదానీకి బ్లాంక్ చెక్‌లా రాసిచ్చారు

ఇది రాష్ట్రానికి, వైఎస్ కుటుంబానికీ అవమానం

అదానీతో జగన్ ఒప్పందాలన్నిటినీ విచారించాలి

అదానీ దేశం పరువు తీస్తే.. జగన్ రాష్ట్రం పరువు తీశారు.. షర్మిల ధ్వజం

నీకా చెల్లెలిపై ప్రేమ ఉంది?

నీ సైతాన్ సైన్యంతో నా క్యారెక్టర్‌పై తప్పుడు ప్రచారం చేయించలేదా?

చెల్లితో పనులు చేయించుకుంటారు.. అమ్మపై కేసు పెడతారు..

నాన్న పేరును సీబీఐ చార్జిషీటులో పెట్టిస్తారు

మీకు మీరే సాటి సార్..: జగన్‌పై షర్మిల ఫైర్

12

విజన్‌తో ముందుకు

2047 నాటికి హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్

స్వర్ణాంధ్ర లక్ష్యానికి ఆ మూడూ ముఖ్యం

పేదలను పైకి తెచ్చే బాధ్యత సంపన్నులు తీసుకోవాలి

అప్పుడే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి

శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడిదారులు వస్తారు

మళ్లీ దుర్మార్గులు అధికారంలోకి వస్తే ఇక అంతే

నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్లు ఎమ్మెల్యేలు రూపొందించాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు

విజన్ డాక్యుమెంట్‌పై అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం

13

స్వర్ణాంధ్ర సాధనకు దశ సూత్రాలు

పేదరిక నిర్మూలనే ఎజెండాగా విజన్-2047

సుకుమా అడవుల్లో ఎన్‌కౌంటర్

10 మంది నక్సల్స్ మృతి.. 5 గంటలపాటు హోరాహోరీగా పోరు

మృతుల్లో ముగ్గురు మహిళలు.. ఆరుగురి వివరాలు గుర్తింపు

14

విజయవాడ, విశాఖ మెట్రో డీపీఆర్‌కు ఓకే

పూర్తి ఖర్చు కేంద్రమే భరించాలి



సర్కారు ప్రతిపాదన.. రాష్ట్రానికి 42 వేల కోట్ల ఉపశమనం

విభజన చట్టం కింద విజయవాడకు.. న్యూమెట్రో పాలసీ మేరకు విశాఖకు.. పూర్తిసాయం కోరిన మెట్రో కార్పొరేషన్

కేంద్రానికి పంపించిన రాష్ట్ర సర్కారు.. తొలి దశ మెట్రో కారిడార్ల ఏర్పాటుకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ సిద్ధం

9

ఢిల్లీకి ఆప్ ఆరు గ్యారంటీలు



న్యూఢిల్లీ, నవంబరు22: అతి త్వరలో ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటర్లకు ఆరు గ్యారంటీలిచ్చింది. ఉచిత్ విద్యుత్, ఉచిత నీరు, ఉచిత చదువు(ప్రభుత్వ పాఠశాలల్లో పది వరకు), ఉచిత వైద్యం(మొహల్లా క్లీనిక్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులు), మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు ప్రతినెలా వెయ్యి రూపాయలు, వృద్ధులకు ఉచిత తీర్థయాత్రల ఏర్పాట్లు చేస్తామని ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. 'రేవ్‌డీపే చర్చ' పేరిట పార్టీ ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి వస్తే తాము ఇస్తున్న ఉచిత పథకాలన్నీ ఆగిపోతాయన్నారు.

ఎమర్జెన్సీ నాటి నిర్ణయాలన్నీ తప్పని చెప్పలేం: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 22: ఎమర్జెన్సీ సమయంలో పార్లమెంటు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ చట్టవ్యతిరేకమని చెప్పలేమని శుక్రవారం సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అప్పటి నిర్ణయాలపై దర్యాప్తు చేస్తూ పోలేమని తెలిపింది. 1976లో రాజ్యాంగ సవరణ చేసి పీఠికలో 'సామ్యవాద', 'లౌకికవాద', 'సమగ్రత' అన్న పదాలను చేర్చడంపై ఇప్పటికే న్యాయ సమీక్షలు జరిగాయని గుర్తు చేసింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకికవాద అన్న పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్యస్వామి, బీజేపీ నాయకుడు అశ్వినీకుమార్ ఉపాధ్యాయ, న్యాయవాది విష్ణు శంకర్ జైన్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ పూర్తి చేసి తీర్పును 25వ తేదీకి వాయిదా వేసింది. అత్యయిక పరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో సామ్యవాద, లౌకిక, సమగ్రత అన్న పదాలను చేర్చారు. విచారణ సందర్భంగా న్యాయవాది జైన్ మాట్లాడుతూ 'సామ్యవాదం' అన్న పదానికి నిర్దిష్టమైన అర్థం లేదని చెప్పారు. పీఠికను సవరించే అధికారం రాజ్యాంగ పరిషత్‌కు తప్ప పార్లమెంటుకు లేదని వాదించారు. సుబ్రహ్మణ్య స్వామి తన పిటిషన్‌లో.. రాజ్యాంగం 1949 నవంబరు 26 నుంచి అమల్లోకి వస్తున్నట్టు పీఠికలో పేర్కొన్నారని, కానీ 1976లో లౌకికవాదం, సామ్యవాదం అన్న పదాలను చేర్చారని తెలిపారు. అమలు తేదీని మార్చకుండా కొత్తగా పదాలను చేర్చవచ్చా అని ప్రశ్నించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ..పీఠిక కూడా రాజ్యాంగంలో అంతర్భాగమేనని పేర్కొంది. 368 అధికరణం ద్వారా రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు దఖలు పడిందని, పీఠికను కూడా అది సవరించవచ్చని తెలిపింది.

బిస్మిల్లాఖాన్ పురస్కారం అందుకున్న రెడ్డి లక్ష్మి



న్యూఢిల్లీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరుగురు యువ కళాకారులకు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాలు దక్కాయి. శుక్రవారం ఇక్కడి డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 2022, 2023 సంవత్సరాలకు గానూ 82 మంది యువ కళాకారులకు ఈ పురస్కారాలను అందజేశారు. కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి అరుణిష్ చావ్లా వీటిని ప్రదానం చేశారు. 2002కు గానూ సంగీతంలో ఐ.శ్వేతప్రసాద్(కర్ణాటక సంగీతం), నృత్య విభాగంలో టి.రెడ్డిలక్ష్మీ (కూచిపూడి)కి అవార్డు వరించింది. 2023కు గానూ జానపద సంగీత విభాగంలో తెలంగాణకు చెందిన డప్పు కళాకారుడు అంగడి భాస్కర్, సంగీత విభాగంలో సత్యవతి ముడావత్ (సృజనాత్మక, ప్రయోగాత్మక సంగీతం), నృత్య విభాగంలో మురమల్ల సురేంద్రనాథ్(కూచిపూడి), థియేటర్ విభాగంలో టి.మల్లికార్జునరావుకు బిస్మిల్లాఖాన్ పురస్కారాలు లభించాయి.

దోహాలో ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు



ఖతార్ రాజధాని దోహాలో ప్రపంచ తెలుగు సాహితీ సదస్సును ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

విశాఖపట్నం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు ఖతార్ రాజధాని దోహా నగరం వేదికైంది. వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు దోహాలో శుక్రవారం ఘనంగా ఆరంభమైంది. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలుగు గడ్డకు దూరంగా నివసిస్తున్నప్పటికీ భాషాభిమానంతో వంగూరి ఫౌండేషన్ ఈ సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సౌరభాలు వెదజల్లేలా సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సులో దర్శక నిర్మాత వైవీఎస్ చౌదరి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ఆంధ్ర కళావేదిక అధ్యక్షులు భాగవతుల వెంకప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పొదుపు సంఘాలకు జాతీయ పురస్కారాలు

- తెలంగాణకు మొదటి, ఆంధ్రాకు రెండో బహుమతి
- స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం ఏపీమాస్ సీఈవో సీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశంలోని స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని ఏపీమహిళాభివృద్ధి సొసైటీ(ఏపీమాస్) సీఈవో, ఎండీ సీఎస్ రెడ్డి తెలిపారు. ఏపీమాస్ ఆధ్వర్యంలో యూసఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్(నిమ్ మే)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి సీఎస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, రుణాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సమాఖ్యలకు ఆయన సూచించారు. అనంతరం పొదుపులో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఉత్తమ సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు అందజేశారు. తెలంగాణలోని హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ఎల్కతుర్తి మండల సమాఖ్యకు తొలి బహుమతి, ఏపీలోని చిత్తూరు జిల్లా తవనంపల్లి మండల మహిళా సమాఖ్యకు రెండో బహుమతి, మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా హిర్‌కాని మహిళా ప్రభాగ్ సంఘ్‌కు మూడో బహుమతి లభించాయి.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం: ఎన్టీఆర్ ట్రస్ట్ ఈవీసీ సుధాకర్



అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ (ఈవీసీ)గా నియమితులైన సీతంరాజు సుధాకర్ అన్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్‌గా శుక్రవారం మంగళగిరిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ లక్ష్యాలను మరింత బలోపేతం చేస్తానని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఆయనకు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణ మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు. ట్రస్ట్ అదనపు సీఈవోలు కె.అప్పారావు, ప్రసాదరావు, ట్రస్ట్ అడ్మిన్ ఈవో సీహెచ్.వెంకట దీపక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నేడు అల్పపీడనం

విశాఖపట్నం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సుమత్రా తీరానికి ఆనుకుని దక్షిణ అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారంకల్లా వాయుగుండంగా బలపడనుంది. తర్వాత తుఫానుగా మారి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశిస్తుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తుఫాను ఈ నెల 26 లేదా 27న తమిళనాడు తీరం దిశగా వచ్చే క్రమంలో తీవ్ర వాయుగుండంగా బలహీనపడనుందని ఐఎండీ తెలిపింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు పెరుగుతాయని, కొన్నిచోట్ల భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, ఉత్తర గాలుల ప్రభావంతో కోస్తాలో శుక్రవారం పలుచోట్ల చలి తీవ్రత పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి.

మహా టెన్షన్!

నేడే ఎన్నికల ఫలితాలు

ముంబై, నవంబరు 22: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. 288 స్థానాలున్న శాసన సభకు ఈ నెల 20న ఒకే విడతలో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఫలితాల్లో ఏ కూటమి మెజారిటీ దక్కించుకున్నా కేవలం 72 గంటల్లోనే సర్కారును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ కాల పరిమితి ఈ నెల 26తో ముగియనున్న నేపథ్యంలో మెజారిటీ దక్కించుకునే పార్టీ లేదా కూటమి అదే సమయానికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. ఇది ఆయా పార్టీలను టెన్షన్ పెడుతోంది. ఒకవేళ ఓటరు తీర్పు ఎవరికీ అనుకూలంగా లేకపోతే హంగ్ ఏర్పడుతుంది. అప్పుడు కేవలం 3 రోజుల్లోనే సర్కారును ఏర్పాటు చేయడం మరింత సంక్లిష్టంగా మారనుంది. ఇదే జరిగితే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ఏర్పాటు చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే.. ఎన్నికల ఫలితాల్లో మెజారిటీ సీట్లు దక్కించుకున్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ పిలిచే అవకాశం ఉందని, తర్వాత బలపరీక్షకు ఆదేశించవచ్చని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. 1990ల నుంచి రాష్ట్రంలో ఏ పార్టీకీ పూర్తిస్థాయి మెజారిటీ దక్కకపోవడం గమనార్హం.

రాష్ట్రపతి పాలన ప్రశ్నే లేదు!

ఏ పార్టీకీ మేజిక్ ఫిగర్ రాకపోయినా వెనువెంటనే రాష్ట్రపతి పాలన పెట్టే అవకాశం లేదని సీనియర్ అడ్వొకేట్, మాజీ అడిషనల్ సొలిసిటర్ జనరల్ బిశ్వజిత్ తెలిపారు. తొలుత భారీ సంఖ్యలో సీట్లు దక్కించుకున్న పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు, తర్వాత కొంత గడువులోపల మెజారిటీని నిరూపించుకునేందుకు అవకాశం కల్పిస్తారని చెప్పారు. ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని మహాయుతి(శివసేన, ఎన్సీపీ) కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ(శివసేన-యూబీటీ, ఎన్సీపీ-శరద్‌పవార్) కూటములు బరిలో ఉన్నాయి. గత ఐదేళ్ల విషయాన్ని తీసుకుంటే రెండు కూటములు రాష్ట్రాన్ని పాలించాయి. 1985లో చివరిసారిగా కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా 161 స్థానాల్లో విజయం దక్కించుకుని



ఓట్ల లెక్కింపు కోసం ఓ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

అధికారం చేపట్టింది. ఇక, ఆ తర్వాత నుంచి ఏదుసార్లుగా కూటములే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నాయి.

సీఎం సీటు కోసం కుస్తీలు

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు రాకముందే రెండు కీలక కూటముల్లోనూ సీఎం సీటు కోసం నేతలు కుస్తీలు పడుతున్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకుని సీఎం సీటు తమకంటే తమకేనని పట్టుబడుతున్నారు. ఈ నెల 23న పోలింగ్ ముగిసిన తర్వాత ఈ రెండు కూటములు ప్రభుత్వ ఏర్పాటుపై ధీమా వ్యక్తం చేశాయి. ప్రజల తమవైపే మొగ్గు చూపారని ఇరు పక్షాలు ప్రకటించుకున్నాయి. కాంగ్రెస్ పీసీసీ చీఫ్ నానా పటోల్ స్పందిస్తూ.. మహా వికాస్ అఘాడీ అధికారం చేపట్టి తీరుతుందని చెప్పారు. కాంగ్రెస్ నేత సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. అయితే, పటోల్ వ్యాఖ్యలతో విభేదించిన శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్.. మహా వికాస్ అఘాడీ మెజారిటీ దక్కించుకున్న తర్వాత ముఖ్యమంత్రి పీఠం ఎవరికి ఇవ్వాలనే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇక, మహాయుతి కూటమిలో.. శివసేన అధికార ప్రతినిధి సంజయ్ షిర్సత్ మాట్లాడుతూ ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ శిండేనే తిరిగి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టనున్నారని చెప్పారు. అయితే.. బీజేపీ నేత ప్రవీణ్ దరేకర్ మాత్రం తమ నాయకుడు, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటారని తెలిపారు. ఇదే, మహాయుతి కూటమిలో ఉన్న ఎన్సీపీ కూడా సీఎం సీటుపై ఆశలు పెట్టుకుంది. అజిత్ పవార్‌కు ముఖ్యమంత్రి అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని.. ఎన్సీపీ కింగ్ మేకర్‌గా మారనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

శిబిరాలకు ఉద్ధవ్ సేన!

ఫలితాలు ఇంకా రాకుండానే గెలిచిన అభ్యర్థులను కాపాడుకునేందుకు శివసేన(యూబీటీ) పార్టీ జాగ్రత్త పడుతోంది. తమ ఎమ్మెల్యేలను ఎవరూ ప్రలోభపెట్టకముందే వారిని తరలించడం కోసం పలు హోటళ్లను ముందుగానే రిజర్వ్ చేసుకుంది. "బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది. మరి మా జాగ్రత్తలో మేం ఉంటే తప్పేముంది" అని ఆ పార్టీ నేత రౌత్ అన్నారు.

ఝార్ఖండ్‌లో గెలుపెవరిదో

న్యూఢిల్లీ, నవంబరు 22: ఝార్ఖండ్‌లోనూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ శనివారం ఉదయం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి శాసన సభ ఎన్నికల్లో హోరా హోరీ తలపడ్డాయి. ముఖ్యంగా ఇండియా కూటమిలోని ఝార్ఖండ్ ముక్తి మోర్చా మరోసారి అధికారం దక్కించుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అదేవిధంగా బీజేపీ కూటమి కూడా అధికారం కోసం కష్టించింది. దీంతో రెండు కూటములు అధికార పీఠంపై ఆశలు బాగానే పెట్టుకున్నాయి. మొత్తంగా జేఎంఎం 41 స్థానాల్లో పోటీ చేస్తుండగా.. మిగిలిన స్థానాల్లో మిత్రపక్షాలు బరిలో నిలిచాయి. ఇక, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ 68 స్థానాల్లో తలపడింది. మిగిలిన స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది. ఇక, కాంగ్రెస్ పార్టీ 30 స్థానాల్లోనే పోటీ చేసింది. అయితే.. కీలక నాయకులను పోటీలో నిలవడంతో గెలుపుపై ఆశలు భారీగానే పెట్టుకుంది. ఇదిలావుంటే, ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీ కూటమికే ప్రజలు పట్టం కట్టడం గమనార్హం. ఈ కూటమి 42-47 స్థానాల్లో గెలిచి సర్కారు ఏర్పాటు చేసే అవకాశం ఉందని పలు సర్వేలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, 13 రాష్ట్రాల్లోని 46 అసెంబ్లీ స్థానాలకు, రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా శనివారం వెలువడనున్నాయి. ఇందులో ప్రియాంక పోటీచేసిన వయనాడ్ స్థానంలో ఫలితంపై అంది దృష్టి ఉంది.

అబ్బే..మోదీ పాత్ర ఉందనలేదు

నిజ్జర్ హత్యపై కెనడా భద్రతా సలహాదారు



ఒటావా, నవంబరు 22: ఖలిస్థానీ వేర్పాటువాది నిజ్జర్ హత్యలో భారత ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పాత్ర ఉందని తమ దేశ దినపత్రిక 'ది గ్లోబ్ అండ్ మెయిల్' ప్రచురించిన కథనాన్ని కెనడా ప్రభుత్వం ఖండించింది. తమ దేశంలో తీవ్ర నేర కార్యకలాపాలతో మోదీకి, మిగతా ఇద్దరికీ లింకుందని తామెక్కడా చెప్పలేదని ప్రధాని జస్టిస్ ట్రూడో భద్రత-నిఘా సలహాదారు నథాలీ డ్రూయిన్ ప్రకటించారు. అయితే, నిజ్జర్ హత్యకోసం పన్నిన కుట్రకు భారత హోం మంత్రి అమిత్‌షా సారథ్యం వహించారని తాము నమ్ముతున్నట్టు కెనడా జాతీయ భద్రతా అధికారి ఒకరు తమకు సమాచారం ఇచ్చారని సదరు పత్రిక తెలిపింది. ఈ విషయం జైశంకర్, డోభాల్‌తో పాటు మోదీకి కూడా తెలుసని ఆయన చెప్పినట్టు వెల్లడించింది. దీనిపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ట్రూడో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. తమ దేశంలో తీవ్ర నేర కార్యకలాపాలతో మోదీ, జైశంకర్, డోభాల్‌కు సంబంధాలున్నట్టు తామెక్కడా చెప్పలేదని.. ఇందుకు ఆధారాలున్నాయన్న సంగతి కూడా తమకు తెలియదని నథాలీ గురువారం వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా, భారత్ నుంచి కెనడాకు విద్యార్థి వీసాతో వచ్చేవారిలో అత్యధిక శాతం నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చారని 'ది గ్లోబ్ అండ్ మెయిల్' తెలిపింది. 10 వేల మంది భారతీయ విద్యార్థులు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారని 'ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ సిటిషన్ కెనడా(ఐఆర్‌సీసీ)' గుర్తించినట్టు ఓ కథనం ప్రచురించింది. వీరిలో 80% మంది గుజరాత్, పంజాబ్ విద్యార్థులేనని పేర్కొంది.

లోకం తీరు



బేబీ సిటింగ్‌కూ సిద్ధం!

- ఖర్చుల కోసం అమెరికాలో భారతీయ విద్యార్థుల పాట్లు

న్యూఢిల్లీ, నవంబరు 22: అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత్ నుంచి వెళ్లినవారే అత్యధికం. వీరిలో చాలామంది తమ ఆర్థిక అవసరాల కోసం పార్ట్ టైం ఉద్యోగాలపై ఆధారపడుతుంటారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆ అవకాశాలు సన్నగిల్లుతుండటంతో బేబీసిటింగ్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఏపీ, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇప్పుడు పిల్లల సంరక్షణ ద్వారా ఆదాయం కోసం ప్రవాస భారతీయ కుటుంబాలను ఆశ్రయిస్తున్నారు. సురక్షిత పని వాతావరణంతో పాటు గంటకు 10 నుంచి 18 డాలర్ల వరకూ ఆదాయం లభించే ఈ బేబీసిటింగ్ మహిళా విద్యార్థులకు అనుకూలం. కొందరు యజమానులు భోజనం, వసతి సదుపాయాలు కూడా సమకూరుస్తుండటం వారికి ఊరటగా మారుతోంది. ఒహియోలో చదువుకుంటున్న హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని ఆరేళ్ల బాలుడిని సంరక్షించే పనిలో చేరింది. రోజుకు 8గంటలు పని చేసినందుకు గాను గంటకు 13 డాలర్లు చొప్పున సంపాదిస్తోంది. ఆ బాలుడి కుటుంబం తనకు భోజన సదుపాయం కూడా కల్పించిందని, డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పనిచేయడం కంటే ఈ ఉద్యోగమే బాగుందని పేర్కొంది. కనెక్టికట్‌లో నివసిస్తున్న మరో విద్యార్థిని మాట్లాడుతూ, తాను రెండున్నరేళ్ల చిన్నారిని వారానికి 6 రోజుల పాటు చూసుకుంటున్నట్టు తెలిపింది. అమెరికాలో విద్యార్థులు సగటున నెలకు 300 డాలర్లు అద్దె కోసం వెచ్చిస్తున్నారు. 'ఓపెన్ డోర్స్-2024' నివేదిక ప్రకారం టెక్సాస్‌లో 39వేల మంది, ఇల్లినాయిస్‌లో 20వేల మంది, ఒహియోలో 13,500 మంది, కనెక్టికట్‌లో 7వేల మంది భారతీయ విద్యార్థులు ఉండగా వీరిలో దాదాపు సగం మంది తెలుగువారే. ప్రవాస భారతీయ జనాభా ఎక్కువగా నివసించే కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీ, న్యూయార్క్, ఇల్లినాయిస్ రాష్ట్రాల్లో పెరిగిన పోటీతో బేబీసిటింగ్ వేతనాలు బాగా తక్కువగా ఉన్నాయి.

సెబీ దర్యాప్తు!

న్యూఢిల్లీ: అదానీపై అమెరికాలో లంచం కేసు నమోదైన నేపథ్యంలో భారత క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సైతం ఈ విషయంపై సూత్రప్రాయంగా దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. షేర్ల ధరలను ప్రభావితం చేయగలిగే సమాచారాన్ని తప్పనిసరిగా వెల్లడించాలన్న నిబంధనలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందా..? అన్న కోణంలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లంచం ఆరోపణలపై అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ దర్యాప్తు సమాచారాన్ని సమగ్రంగా వెల్లడించడంలో అదానీ గ్రీన్ ఎనర్జీ విఫలమైందా అని వాకబు చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజీ అధికారులను సెబీ కోరిందని వారు వెల్లడించారు. కాగా, స్టాక్ ఎక్స్ఛేంజీలు శుక్రవారం అదానీ కంపెనీలను ఈ విషయంపై వివరణ కోరాయి. అలాగే, అదానీ గ్రూప్‌తో ఎయిర్‌పోర్ట్ విస్తరణ, ఇంధన ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లు కెన్యా ప్రకటించింది. ఈ విషయంపైనా అదానీ గ్రూప్‌ను ఎక్స్ఛేంజీలు స్పష్టత కోరాయి. ఈ విషయంలో నిజానిజాలను నిగ్గుతేల్చే ప్రక్రియకు రెండు వారాలు పట్టవచ్చని.. స్టాక్ ఎక్స్ఛేంజీ అధికారుల విచారణలో తేలే విషయాల ఆధారంగా అదానీ గ్రూప్‌పై అధికారిక దర్యాప్తును ప్రారంభించాలా..? వద్దా..? అనే విషయంపై సెబీ నిర్ణయం తీసుకోనుందన్నారు.

ప్రశ్నార్థకంలో అదానీ గ్రూప్ నైతికత

అదానీపై అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూప్ నైతిక పాలన ప్రమాణాలపై మళ్లీ ప్రశ్నలు తలెత్తవచ్చని, గ్రూప్ ప్రతిష్ఠ దెబ్బతీయనుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్ అంటోంది. ముున్ముందు అదానీ కంపెనీలకు దేశీయంగా, అంతర్జాతీయంగా నిధుల సమీకరణ కష్టతరం కావచ్చని, ఇప్పటికే రుణాలిచ్చినవారి నుంచీ ఆందోళనలు వ్యక్తమవుతాయా అని పరిశీలించనున్నట్టు తన నోట్‌లో పేర్కొంది. తాజా వివాదం నేపథ్యంలో అదానీ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 60 కోట్ల డాలర్ల బాండ్ల జారీని సైతం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. మరోవైపు, అమెరికాలో నమోదైన అభియోగాలకు సంబంధించి అదానీ గ్రూప్‌పై దర్యాప్తు ప్రారంభించేందుకు ప్రస్తుతం మీడియాలో వస్తున్న కథనాలను పరిగణనలోకి తీసుకోమని మార్కెట్ పోటీ నియంత్రణ మండలి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్‌పర్సన్ రవనీత్ కౌర్ స్పష్టం చేశారు. కాగా, అమెరికాలో నమోదైన కేసులను అదానీ జరిమానాలు చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశాలున్నాయి.

అదానీ..దారెటు?

నేరం రుజువైతే పాతికేళ్లు జైలుశిక్ష!.. భారీగా జరిమానాలు కూడా

- అదానీని అప్పగించాలని కోరవచ్చు!
- అది సుదీర్ఘ చట్టపరమైన ప్రక్రియ
- న్యాయ నిపుణుల విశ్లేషణ



న్యూయార్క్, నవంబరు 22: లంచాలు, మోసం అభియోగాలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీని అప్పగించాలని అమెరికా కోరుతుందా? ఆయన అరెస్టు తప్పదా? నేరం రుజువైతే ఎన్నేళ్లు జైలు శిక్ష పడుతుంది? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు! సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రాష్ట్రాలకు అదానీ గ్రూప్ రూ.2029 కోట్ల లంచాలు వెదజల్లిందని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్, న్యాయ విభాగం, ఎఫ్‌బీఐ నిర్ధారించిన సంగతి తెలిసిందే. దీనిపై న్యూయార్క్ కోర్టులో అభియోగాలు కూడా నమోదయ్యాయి. ఆయనపై కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అదానీని తమకు అప్పగించాలని అమెరికా కోరే అవకాశాలు ఉన్నాయని భారతీయ అమెరికన్ న్యాయవాది రవి బాత్రా వెల్లడించారు. అమెరికాలో అదానీ సహా 8 మంది ఎదుర్కొంటున్న ఈ కేసు మరింత తీవ్రతరం కావచ్చని అభిప్రాయపడ్డారు. నేరగాళ్ల అప్పగింత ఒప్పందం కింద నిందితులను తమకు అప్పగించాల్సిందిగా కూడా అడగవచ్చని గురువారం ఓ వార్తాసంస్థకు చెప్పారు. 'భారత్‌లాగే అమెరికాతో ఈ ద్వైపాక్షిక ఒప్పందం ఉన్న దేశాలు.. అమెరికా అడిగిన వ్యక్తులను తప్పనిసరిగా అప్పగించాల్సి ఉంటుంది. అయితే అసాధారణ పరిస్థితుల్లోనే అప్పగింత జరుగుతుంది. మానవీయ కోణం ఆధారంగా చిలీ మాజీ అధ్యక్షుడు అగస్టో పినోచెట్‌ను అమెరికాకు అప్పగించేందుకు బ్రిటన్ నిరాకరించింది. అదానీ, ఇతరుల కేసులో ఇది వర్తించదు' అని బాత్రా స్పష్టం చేశారు. అమెరికాతో భారత్ 1997లో నేరగాళ్ల అప్పగింత ఒప్పందం కుదుర్చుకుంది. తమ కేపిటల్ మార్కెట్లో అవకతవకల విషయంలో అమెరికన్ చట్టాలు మరింత కఠినంగా ఉంటాయని బాత్రా చెప్పారు.

సుదీర్ఘ విచారణ ప్రక్రియ...

అదానీపై అమెరికాలో సుదీర్ఘకాలం విచారణ ప్రక్రియ జరిగే అవకాశముంది. అదానీ గ్రీన్ ఎనర్జీపై లంచం, మోసం, కుట్రలకు పాల్పడినట్టు అభియోగాలున్నాయి. రెండు దశాబ్దాల్లో 2 బిలియన్ డాలర్ల లాభం పొందగల సౌరశక్తి ఒప్పందాల కోసం ఆయన 250 మిలియన్ డాలర్లకు పైగా లంచం కింద ఇచ్చినట్టు ప్రాసిక్యూటర్లు ఆరోపిస్తున్నారు.

ఇకముందు ఏం జరగనుంది?

ఇప్పటి వరకూ అమెరికా కోర్టుకు అదానీ హాజరు కాలేదు. అక్కడ ఎలాంటి పిటిషన్ దాఖలు చేయలేదు. ఒకవేళ ఆయన్ను అమెరికాకు అప్పగించినా లేదా ఆయనే లొంగిపోయినా అదానీ తరఫు న్యాయవాదులు అభియోగాలను సవాలు చేయవచ్చు. మరోవైపు ఈ కేసు విచారణ ఇప్పట్లో ప్రారంభమయ్యే అవకాశం లేదు. సాక్ష్యాధారాల సేకరణలో సవాళ్లు, అదానీ సహ నిందితులకు వేర్వేరు ట్రయల్స్ సహా చట్టపరమైన చర్యలతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది.

రాజీ ప్రయత్నాలకు మొగ్గు

లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ బృందం... ఒప్పందాలు చేసుకోవడం, జరిమానాలు చెల్లించడం ద్వారా రాజీ చేసుకోవడానికి ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే దీనికి కాలపరిమితి ఉన్న నేపథ్యంలో తొలుత అప్పీలు వెళ్లడమే వీరి ముందున్న మొదటి మార్గం అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే పరిష్కార మార్గాలు అన్వేషించవచ్చని సూచిస్తున్నారు. 'ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)' కింద నమోదయ్యే లంచం కేసుల్లో రాజీకి రావడానికి అమెరికా చట్టాలు అనుమతిస్తాయి.

భారత్-అమెరికా సంబంధాలు బలంగానే ఉన్నాయి: వైట్‌హౌస్

అదానీ లంచాల వ్యవహారంపై అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ స్పందించింది. ఈ సంక్షోభాన్ని భారత్-అమెరికా అధిగమించగలవని ఆశాభావం వ్యక్తం చేసింది. వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరీన్ జీన్ పియర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అదానీపై ఆరోపణల విషయం మా దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సీఈసీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డీవోజే) మాత్రమే సరైన సమాధానం ఇవ్వగలవు. అయితే భారత్, అమెరికా మధ్య సంబంధాలు బలంగానే ఉన్నాయి. ఈ సంక్షోభాన్ని కూడా ఇరు దేశాలు అధిగమించగలవనే నమ్ముతున్నాం' అని చెప్పారు.

అదానీని అరెస్టు చేస్తారా?

ఒకవేళ అదానీ భారత్‌లో ఉంటే అతడిని అప్పగించాలని అమెరికా ప్రాసిక్యూటర్లు కోరవచ్చు. భారతీయ చట్టాల ప్రకారం ఈ అభియోగాలు వర్తిస్తాయో, లేదో ఇక్కడి కోర్టులు అంచనా వేస్తాయి. అలాగే రాజకీయ, మానవ హక్కుల పరమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటాయి. అయితే ఈ అప్పగింతను అదానీ సవాలు చేయవచ్చు. అలాగే దీనిపై వ్యాజ్యం దాఖలు చేయడం ద్వారా అప్పగింత ప్రక్రియను పొడిగించే అవకాశం కూడా ఉంటుంది.

ఎలాంటి శిక్షలు పడొచ్చు?

నేరం రుజువైతే లంచం ఇచ్చినందుకు ఐదేళ్లు, మోసం, కుట్ర అభియోగాల కింద 20 ఏళ్ల వరకూ అదానీకి జైలుశిక్షతో పాటు భారీగా జరిమానాలు కూడా విధించే అవకాశం ఉంది. ఏ శిక్ష అయినా అంతిమంగా న్యాయాధిపతి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అయితే ఏ శిక్ష విధించినా అదానీ తరఫు న్యాయవాదుల బృందం దానిపై అప్పీలు చేయవచ్చు. తద్వారా ఇదొక సుదీర్ఘ న్యాయపోరాటంగా మారే అవకాశం ఉంది.

అదానీ గ్రూపు ఏమందంటే..

సౌర విద్యుత్తు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు 'పెద్ద మొత్తంలో లంచం ఇవ్వజూపారంటూ తమ సంస్థపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేసిన ఆరోపణలను అదానీ గ్రూపు తోసిపుచ్చింది. ఈ ఆరోపణలన్నీ నిరాధారమైనవని, తమ సంస్థ చట్టాలకు లోబడి నడుచుకుంటుందని స్పష్టం చేసింది.

మూడో ప్రపంచయుద్ధం మొదలైంది!

- ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా, రష్యా తలపడటం దీనికి సూచిక
- ఉక్రెయిన్ మాజీ సైన్యాధిపతి వాలెరీ



న్యూయార్క్, నవంబరు 22: మూడో ప్రపంచ యుద్ధం మొదలైందని.. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో పలు ఇతర దేశాలు పాల్గొనటం దీనినే సూచిస్తోందని ఉక్రెయిన్ మాజీ సైన్యాధిపతి వాలెరీ జలుజ్నీ పేర్కొన్నారు. 'ఉక్రెయిన్ యుద్ధంలో అగ్రరాజ్యాలు అమెరికా-రష్యా ముఖాముఖి తలపడుతున్నాయి. ఉత్తర కొరియా సైనికులు పాల్గొంటున్నారు. చైనా ఆయుధాలను అందజేస్తోంది. ఇరాన్ సైనిక సాయంతోపాటు డ్రోన్ల వంటి వాటిని సమకూరుస్తోంది. ఎటువంటి సంశయం లేకుండా బహిరంగంగా ఉక్రెయిన్ సాధారణ పౌరులను చంపుతున్నారు. అంటే, ఉక్రెయిన్ కేవలం రష్యాను మాత్రమే ఎదుర్కోవటం లేదు' అని తెలిపారు. తన వద్ద ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగిస్తుండవచ్చుగానీ.. ఇతర దేశాల మద్దతు లేకుండా విజయం సాధ్యం కాదని వాలెరీ స్పష్టం చేశారు. రష్యాతో యుద్ధానికి సంబంధించిన వ్యూహరచన విషయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి వాలెరీ జలుజ్నీకి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తటంతో వాలెరీని ఈ ఏడాది ఫిబ్రవరిలో సైన్యాధిపతి పదవి నుంచి తొలగించారు. కాగా, రష్యాపైకి ఉక్రెయిన్ ఇటీవల అమెరికా, బ్రిటన్‌ల క్షిపణులను ప్రయోగించటంతో.. దానికి ప్రతిగా, రష్యా గురువారం ఉక్రెయిన్ మీదికి ఖండాంతర మధ్య శ్రేణి క్షిపణిని ప్రయోగించింది. ఉక్రెయిన్‌తో జట్టు కట్టే ఏ దేశ భూభాగం మీదికైనా ఈ క్షిపణులను ప్రయోగించగల సత్తా తమకుందని పుతిన్ హెచ్చరించారు.

పుతిన్‌కు సైన్యం.. కిమ్‌కు ఆయుధాలు

రష్యా, ఉత్తర కొరియాపై దక్షిణ కొరియా ఆరోపణలు

సియోల్, నవంబరు 22: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరఫున పోరాడేందుకు 10 వేల మంది సైనికులను పంపినందుకు గాను ఉత్తర కొరియాకు పుతిన్ వివిధ రూపాల్లో సహకారం అందిస్తున్నారని దక్షిణ కొరియా శుక్రవారం ఆరోపించింది. ఉత్తరకొరియాకు రష్యా అత్యాధునిక యాంటీ ఎయిర్ మిస్సైళ్లను ఇచ్చిందని దక్షిణ కొరియా అత్యున్నత భద్రతా సలహాదారు షిన్ వోన్సిక్ విలేకరులకు వెల్లడించారు. ఐక్యరాజ్య సమితి ఆంక్షలను అతిక్రమించి మరీ ఈ ఏడాది మార్చి నుంచి రష్యా సుమారు లక్ష బ్యారెళ్ల చమురును ఉత్తరకొరియాకు సరఫరా చేసిందని బీబీసీ ఓ కథనంలో పేర్కొంది. సైనిక సాయానికి బదులుగానే రష్యా చమురు సరఫరా చేసిందని వెల్లడించింది. ఇవేకాక, కొన్ని జంతువులు, పక్షులను ఉత్తరకొరియాకు రష్యా కానుకగా పంపిందని కథనాలు వెలువడ్డాయి.

ఆరోగ్య పరిరక్షణలో దంత వైద్యం కీలకం

» ఐపీఎస్ సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్



ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మంగళగిరి సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణలో దంత వైద్యం (ప్రోస్తోడాంటిక్స్) చాలా కీలకమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఇండియన్ ప్రోస్తోడాంటిక్ సొసైటీ (ఐపీఎస్) ఆధ్వర్యంలో 52వ జాతీయ స్థాయి సదస్సు గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఐపీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మహేశ్ లహోరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. గత 52 ఏళ్ల క్రితం ఒకరిద్దరితో ప్రారంభమైన సొసైటీ ఇప్పుడు దేశవ్యాప్తంగా 15 వేల మంది సభ్యులతో ఉన్నత స్థాయికి చేరి, దంత వైద్య రంగంలో విశేష సేవలందించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా దంత వైద్యంలో నూతన ఆవిష్కరణలు, అధునాతన సాంకేతిక పరికరాల గురించి చర్చించుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ప్రాణాంతక వ్యాధులకు సైతం ఖరీదైన వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఐపీఎస్ జాతీయ కార్యదర్శి డాక్టర్ జంగాల హరి మాట్లాడుతూ ఈ సదస్సులో అత్యాధునిక దంత వైద్య పరికరాలకు సంబంధించి 72 ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 700 మంది వివిధ అంశాలపై ప్రశ్నపత్రాలను సమర్పిస్తారని, 40 మంది సీనియర్ వైద్యులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు.

గుంటూరులో ప్రారంభమైన ఐఎంఏ రాష్ట్ర సదస్సు

గుంటూరు మెడికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేడు వైద్య రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆధునిక వైద్య విధానాల ద్వారా సమర్థ చికిత్సలు రోగులకు లభిస్తున్నాయని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర వార్షిక సదస్సు ప్రారంభమైంది. సదస్సుకు సైంటిఫిక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సీహెచ్.విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ.. వైద్యులంతా తప్పనిసరిగా నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు. ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి చికిత్స చేయడం ద్వారా హాస్పిటల్ అడ్మిషన్లు నిరోధించవచ్చని తెలిపారు. 16 ఏళ్ల తర్వాత ఐఎంఏ రాష్ట్ర సదస్సు గుంటూరులో నిర్వహించడం అభినందనీయమని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి అన్నారు.

తిరుమల పీఏసీ-3లో కేంద్రీయ లాకర్ కేటాయింపు కేంద్రం ప్రారంభం

తిరుమల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-3 (పీఏసీ)లో కేంద్రీయ లాకర్ కేటాయింపు కౌంటర్లను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఈవో శ్యామలరావు శుక్రవారం ప్రారంభించారు. పీఏసీ-3లో లాకర్ కేటాయింపునకు మూడు కౌంటర్లను ఏర్పాటు చేశారు. భక్తులు గందరగోళానికి గురికాకుండా ఇకపై ఒకే చోట లాకర్లను కేటాయిస్తారు. ఇక్కడ భక్తుల కోసం 1,420 లాకర్లు అందుబాటులో ఉంటాయి. గదులు లభించని భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు.

ఆ నియోజకవర్గానికి 8 మంది 'ఎమ్మెల్యేలు'!

» రైల్వేకోడూరులో అరాచకీయం
» అధికారికంగా అరవ శ్రీధర్ ఎన్నిక
» అనధికారికంగా మరో ఏడుగురి పెత్తనం
» ముక్కా రూపానందరెడ్డి కుటుంబం ఆయన బామ్మర్దులదే రాజ్యం
» ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు
» రికార్డుల పరిశీలన.. అధికారులకు ఆదేశాలు
» నియోజకవర్గంలో పనులు జరగాలన్నా.. బిల్లులు చేయాలన్నా అనుమతి ఉండాల్సిందే

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఎన్నికల్లో ఎందరు పోటీ చేసినా ఓ నియోజకవర్గానికి ఒక్కరే ఎమ్మెల్యే ఉంటారు. అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో మాత్రం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే ఒకరు అయితే.. అనధికారికంగా మరో ఏడుగురు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ఏడుగురు ఒకే కుటుంబానికి చెందినవారు, దగ్గరి బంధువులే. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే ఉత్సవ విగ్రహంలా ఉంటే.. అధికారిక హోదా లేనివారు ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ, రికార్డులను పరిశీలిస్తూ, అధికారులకు ఆదేశాలు కూడా ఇస్తున్నారు. ఓట్లు వేసి ఒకరిని గెలిపిస్తే.. ఇప్పుడు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు అయ్యారని, ఆ కుటుంబం పెత్తనం ఏంటని ఆ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఒకటే చర్చ. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన రైల్వేకోడూరుకు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ముక్కా రూపానందరెడ్డి ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో తన సొంత మనిషి అయిన అరవ శ్రీధర్‌కు జనసేన తరఫున ఎమ్మెల్యే టికెట్ ఇప్పించుకున్నారు. కూటమి ప్రభంజనంతో పాటు నియోజకవర్గ నాయకులు కలసికట్టుగా కృషి చేయడంతో అరవ శ్రీధర్ గెలుపొందారు. ఆయన తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. పేరుకే ఎమ్మెల్యే కానీ.. స్వతంత్రంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదని కూటమి నాయకులే బహిరంగంగా చెబుతున్నారు. నియోజకవర్గంలో పెత్తనమంతా రూపానందరెడ్డి కుటుంబానిదేనని వాపోతున్నారు.


ఓ కార్యక్రమంలో వేదికపై ఎమ్మెల్యే శ్రీధర్‌తో పాటు టీడీపీ నేత రూపానందరెడ్డి కుమారుడు సాయివికాస్‌రెడ్డి (కుడి పక్కన)

ఆ ఎనిమిది మంది వీరే..!

రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రజలు ఓటు వేసి గెలిపించిన అరవ శ్రీధర్ అధికారికంగా ఎమ్మెల్యే. అయితే ముక్కా రూపానందరెడ్డి, ఆయన భార్య వరలక్ష్మి, కొడుకులు విశాల్‌రెడ్డి, సాయివికాస్‌రెడ్డితో పాటు రూపానందరెడ్డి బావమరుదులు మల్లికార్జునరెడ్డి, విశ్వనాథరెడ్డి, మహేంద్రరెడ్డి.. ఈ ఏడుగురు అనధికారిక ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారనే ఆరోపణలున్నాయి.

పెత్తనమంతా ఆ కుటుంబానిదే

రూపానందరెడ్డికి ఇటీవలే అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నామినేటెడ్ పదవి ఇచ్చారు. ఆయన ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ చేస్తుంటారు. రికార్డులు కూడా పరిశీలిస్తారు. అదేవిధంగా ఆయన భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు బావమరుదులు అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. రికార్డులు పరిశీలించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు కూడా చేస్తున్నారు. ఇక రూపానందరెడ్డి భార్య ముక్కా వరలక్ష్మి ఆర్టీసీ బస్టాండు, ఆసుపత్రులు వంటి వాటిని తనిఖీ చేస్తుంటారు. 'నా మనిషికి టికెట్ తెచ్చుకున్నాను. కోట్లు ఖర్చు చేసి గెలిపించుకున్నాను. పెత్తనం నాకు, నా కుటుంబానికే ఉండాలి' అన్నట్టుగా ముక్కా కుటుంబం వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల వరకు నియోజకవర్గంలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు అందరూ కలిసి పనిచేశారు. ఎన్నికలు అయిపోగానే కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను పక్కకు పెట్టారనే విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గంలో జనసేనలో రెండు వర్గాలుగా, టీడీపీలోనూ గ్రూపులుగా విడిపోయారు. బీజేపీ శ్రేణులు అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి.

పనులు, పంచాయితీలు...

నియోజకవర్గంలో ఇసుక, భూములు, ఇతర పంచాయితీలు.. అన్నీ రూపానందరెడ్డి కుటుంబమే చేస్తోందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. రోడ్లు, తాగునీటి బోర్లు కూడా ఆ కుటుంబ సభ్యులే వేస్తున్నారని కూటమిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని పంచాయతీలలో ఎంత చిన్న అభివృద్ధి పని జరగాలన్నా, నిధులు మంజూరు చేయాలన్నా.. ఈ కుటుంబం అనుమతిని అధికారులు తీసుకోవాల్సిందే. చివరకు బిల్లులు చేయాలన్నా వీళ్ల అనుమతి తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు.

ఉత్సవ విగ్రహంలా ఎమ్మెల్యే!

నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు ఎలాంటి ప్రాధాన్యం ఉండడం లేదని.. ఏదైనా అధికారిక కార్యక్రమం అయితే సభావేదిక మీద ఉండడం.. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం వరకే ఆయన బాధ్యతగా చెబుతున్నారు. మిగిలిన అన్ని పనులూ రూపానందరెడ్డి కుటుంబమే చక్కబెడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సమావేశాల్లో ఎమ్మెల్యేను కనీసం ముందు వరుసలో కూడా కూర్చోబెట్టకుండా వాళ్లే రికార్డులు పరిశీలిస్తారనే ప్రచారం ఉంది. ఎమ్మెల్యే లెటర్ హెడ్‌పై ముందుగానే సంతకాలు చేయించుకుని పనుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు సమాచారం. చివరికి తిరుమల శ్రీవారి దర్శన టికెట్లు కూడా ఎమ్మెల్యే ఎవరికీ ఇచ్చుకోలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు.


మహిళకు చెక్కు పంపిణీ చేస్తున్న రూపానందరెడ్డి భార్య ముక్కా వరలక్ష్మి(ఫైల్)

'పునర్విభజన' వ్యూహం

2026లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందన్న వార్తల నేపథ్యంలో రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గాన్ని జనరల్ చేస్తారని ప్రచారంలో ఉంది. దీంతో రూపానందరెడ్డి కుటుంబం పోటీకి దిగేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతోందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికే రూపానందరెడ్డికి అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవి దక్కింది. గతంలో ఇక్కడ ఉన్న ఇతర సామాజిక వర్గాల ముఖ్యనాయకులను రాజకీయంగా పూర్తిగా తొక్కేసి.. తన సామాజికవర్గానికి చెందిన వైసీపీ నాయకులను రూపానందరెడ్డి కుటుంబం చేరదీసి పనులు చేసి పెడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 150 రోజులు కూడా పూర్తి కాకముందే.. నియోజకవర్గంలో రాజకీయ లుకలుకలు మొదలయ్యాయనే విమర్శలు వస్తున్నాయి.

సత్యసాయి విద్య.. అందరికీ ఆదర్శం

» యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్
» ఘనంగా సత్యసాయి యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవం


విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న సేతురామన్ పంచనాథన్

పుట్టపర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా అందిస్తున్న విలువలతో కూడిన విద్య మహోన్నతమైనదని, అందరికీ ఆదర్శమని యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో గల పూర్ణచంద్ర హాల్‌లో శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఉదయం అట్టహాసంగా నిర్వహించారు. మొదట 21 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 14 మందికి పీహెచ్‌డీలు, 461 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సేతురామన్, యూనివర్సిటీ చాన్సలర్ చక్రవర్తి వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సేతురామన్ పంచనాథన్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎన్నో యూనివర్సిటీలను సందర్శించానని, ఇటువంటి ప్రత్యేకత ఉన్న విశ్వవిద్యాలయం ఎక్కడా లేదన్నారు. సత్యసాయిబాబాను స్ఫూర్తిగా తీసుకుని, సామాజిక స్పృహతో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, వైస్ చాన్సలర్ రాఘవేంద్రప్రసాద్, ట్రస్టు సభ్యులు నాగానందం, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సేవాసంస్థ ప్రతినిధి నిమీష్ పాండే పాల్గొన్నారు.

నేడు సత్యసాయిబాబా జయంతి

సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించనున్నారు. దేశవిదేశాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఇప్పటికే పుట్టపర్తి చేరుకున్నారు. ప్రశాంతి నిలయం, సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై, భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం స్వర్ణరథంపై సత్యసాయి ఊరేగింపు నిర్వహిస్తారు.

యువతకు సమాజంపై బాధ్యత ఉండాలి


» కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
» రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పొడపాటి తేజస్విని


తేజస్వినిని అభినందిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్‌గా పొడపాటి తేజస్విని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ బెరంపార్క్‌లో జరిగిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ యువతకు సమాజంపై బాధ్యత ఉండాలన్నారు. ఈ సందర్భంగా తేజస్వినిని పెమ్మసాని అభినందించారు. కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వడంలో చంద్రబాబు ఆయనకు ఆయనే సాటి అని పేర్కొన్నారు. కాగా, ఐటీ నిపుణులను రాజకీయాల్లోకి తీసుకురావటానికి కృషి చేస్తానని ఐటీ రంగ నిపుణురాలు కూడా అయిన పొడపాటి తేజస్విని అన్నారు. అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి దుర్గేశ్ ఆమె చేత ప్రమాణం చేయించారు.

నూనె గింజల సాగును ప్రోత్సహిస్తా

» ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ


ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గండి బాబ్జీ, చిత్రంలో ఎంపీ ఎం.భరత్ తదితరులు

విజయవాడ(ఆటోనగర్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో నూనె గింజల సాగును ప్రోత్సహించి, ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్(ఏపీ నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ) చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం విజయవాడ ఆటోనగర్‌లోని కార్యాలయంలో గండి బాబ్జీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. విశాఖపట్నం ఎంపీ ఎం.భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వేర్ హౌసింగ్ చైర్మన్‌గా 'రావి' ప్రమాణ స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న రావి వెంకటేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ గురునానక్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి రావి కుటుంబం ఎనలేని కృషి చేసిందన్నారు.

మన మతవిశ్వాసాలకు విశ్వవ్యాప్త గౌరవం!

» విదేశీ దండయాత్రల వల్ల మన సంస్కృతి ధ్వంసమైంది
» ఏకత్వానికి భిన్నత్వంతో ఇంద్రధనస్సు లాంటి సౌందర్యం: ముర్ము
» లోక్‌మంథన్-2024ను ప్రారంభించిన రాష్ట్రపతి



లోక్‌మంథన్-2024 వేదికపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

హైదరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నుంచే భారతీయ సైద్ధాంతికత ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని, భారతీయుల మత విశ్వాసాలు, కళలు, సాంకేతిక పరిజ్ఞానం, భాష, సాహిత్యం విశ్వవ్యాప్తంగా గౌరవం పొందాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మన దేశంపై దండయాత్రలతో సామ్రాజ్యవాదులు, విదేశీ శక్తులు ఆర్థికం గా మనల్ని దోచుకోవడమే కాకుండా సామాజికంగా కూడా దెబ్బతీశారని తెలిపారు. మన సమాజాన్ని విడగొట్టేందుకు, ఐకమత్యాన్ని దెబ్బతీసేందుకు శతాబ్దాల పాటు ప్రయత్నించారని, మనలో బానిస మూలాల ను చొప్పించారన్నారు. ఈ బానిసత్వ ఆలోచనలను ఇప్పుడు మనం తొలగించుకుంటున్నామని... రాజ్‌పథ్ పేరు కర్తవ్యపథ్‌గా.. దర్బార్ హాల్ పేరు గణతంత్ర మండప్‌గా మారిందని గుర్తుచేశారు. శుక్రవారం, హైదరాబాద్ శిల్పకళావేదికలో లోక్‌మంథన్-2024 ఉత్సవాలను ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె, లోక్-అవలోకన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె ప్రసంగించారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశ బలమని.. మన మూల సిద్ధాంతమైన ఏకత్వానికి భిన్నత్వం ఇంద్రధనసు లాంటి సౌందర్యాన్ని ఇస్తుందన్నారు. ఐకమత్యం, సామరస్యమే మన సభ్యత, భవిష్యత్తు అని.. ఆ దిశగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రిటీష్‌వారి విభజించు-పాలించు వైఖరితో గిరిజనులకు, ఇతరులకు మధ్య విభేదాలు సృష్టించే కుట్రలు జరిగాయన్నారు. వీటిని రూపుమాపేందుకు మనమంతా ఒక్కటే అన్న భావనను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవశ్యకత ఉందన్నారు.

తొలిసారి ఒకేవేదికపై రాష్ట్రపతి, ఆరెస్సెస్ చీఫ్!

లోక్‌మంథన్-2024లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌లు ఒకే వేదికపై ఆసీనులయ్యారు. రాష్ట్రపతి, ఆరెస్సెస్ చీఫ్ ఒకే వేదిక పాలుపంచుకోవడం తొలిసారి అని సంఘ్ వర్గాలు తెలిపాయి. వందేళ్ల సంఘ్ చరిత్రలో తొలిసారి ఇలా జరిగిందన్నాయి.


హైకోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న న్యాయవాదులు

విజయవంతంగా హైకోర్టులో మెగా వైద్య శిబిరం

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాటూరి మెడికల్ కాలేజీ సహకారంతో ఏపీ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ (ఏపీహెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో హైకోర్టులో మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ చీమలపాటి రవి, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ గురువారం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు నిర్వహించిన శిబిరంలో హైకోర్టు న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది సుమారు 1100 మంది హాజరుకాగా, వారికి అత్యాధునిక వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన మందులను సిఫారసు చేశారు. శిబిరం నిర్వహణకు సహకారం అందించిన కాటూరి హాస్పిటల్ ఛైర్మన్ కాటూరి సుబ్బారావు, డైరెక్టర్లకు అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు కె.చిదంబరం, ఇతర కార్యవర్గం ధన్యవాదాలు తెలిపింది. మెడికల్ క్యాంప్ ఏర్పాటుకు సహకారం అందించిన న్యాయవాది నర్రా శ్రీనివాసరావును ఏపీహెచ్‌సీఏఏ కార్యవర్గం ప్రత్యేకంగా అభినందించింది.

న్యాయశాఖ కార్యదర్శిగా ప్రతిభాదేవి

అమరావతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా జడ్జి జి.ప్రతిభాదేవిని ప్రభుత్వం డిప్యుటేషన్‌పై నియమించింది. రెండు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగుతారు. శుక్రవారం ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం కర్నూలులోని ఫ్యామిలీ కోర్టు కమ్ పోర్త్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్‌కు ఏపీ నరెడ్కో రూ.75 లక్షల విరాళం


సీఎంఆర్ఎఫ్‌కు విరాళం అందిస్తున్న ఏపీ నరెడ్కో ప్రతినిధులు

తాడేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) ప్రతినిధులు అన్నారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి రూ.75 లక్షల చెక్ అందజేశారు. అంతకు ముందు రూ.25 లక్షలు అందజేయగా, మొత్తం రూ.కోటి విరాళం అందజేసినట్టయింది. ఈ సందర్భంగా నరెడ్కో ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో లాండ్ టైటిలింగ్ చట్టాన్ని ఉపసంహరించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేరస్థుడు నెతన్యాహూ!

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ మీద ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు–ఐసీసీ అరెస్టువారెంట్ జారీ చేసింది. ఆయనతోపాటు మాజీ రక్షణమంత్రి యోవ్ గల్లాంట్ మీద కూడా గాజాలో యుద్ధనేరాలకు, మానవహననానికీ పాల్పడినందుకు, మానవత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించినందుకు ఐసీసీ అరెస్టువారెంట్లు జారీ చేసింది. ఐసీసీ అరెస్టువారెంట్ల ప్రభావమెట్టిది, వీరిద్దరూ అరెస్టవుతారా, చేయగలవారెవ్వరు ఇత్యాది ప్రశ్నలను అటుంచితే, ఈ తీర్పు నెతన్యాహూకు నైతికంగా ఎదురుదెబ్బ. ఆయనకు నష్టం ఉన్నా లేకున్నా ఈ తీర్పు తరువాత ప్రపంచదేశాలు ఇజ్రాయెల్ తరఫున ఏకపక్షంగా, నిస్సిగ్గుగా నిలవకుండా కాస్తంతైనా వెనుకంజవేస్తాయని ఆశ.

గాజాలో హత్యలు, హింస ఇత్యాది అమానుష చర్యలతో పాటు, ఆకలిచావులకు వీరిద్దరు కారకులని ఐసీసీ ఆరోపించింది. అన్నం, నీళ్ళు, మందులు అందనివ్వకుండా చేసి, మానవ మనుగడనే ప్రశ్నార్థం చేసి, సంక్షోభం తీవ్రస్థాయికి చేర్చారని వ్యాఖ్యానించింది. పౌరులను, ప్రధానంగా చిన్నారులను లక్ష్యంగా చేసుకున్నారని నిర్ధారించడానికి నిర్దిష్టమైన ఆధారాలున్నందున అరెస్టు వారెంట్లు జారీ చేస్తున్నట్టు న్యాయస్థానం ప్రకటించింది. ఇవన్నీ తప్పుడు మాటలనీ, తిరస్కరిస్తున్నామని, ఆత్మరక్షణ కూడా పాపమైపోతే ఎలా అనీ ఇజ్రాయెల్ చాలా విమర్శలు చేసింది. దేశ రక్షణలో ఏమాత్రం రాజీపడననీ, ఏ శక్తితనను అడ్డుకోలేదనీ, ఇటువంటి కుట్రలు ఎన్నిచేసినా యుద్ధం ఆపేదిలేదని నెతన్యాహూ గొప్పలకు పోయారు. మానవాళి రక్షణకు కృషిచేయాల్సిన న్యాయస్థానం శత్రువుగా మారిందన్నారు.

నెతన్యాహూ, గల్లాంట్‌లతో పాటు ముగ్గురు కీలకమైన హమాస్‌నేతలపై కూడా అరెస్టువారెంట్లు జారీచేసిన విషయం తెలిసిందే. ఐసీసీ తీర్పు నెతన్యాహూ కంటే జోబైడెన్‌కు ఎక్కువ ఆశ్చర్యాన్ని, ఆగ్రహాన్ని కలిగించింది. ఒక నిరపరాధితో పోలీసులు బలవంతంగా నేరాన్ని ఒప్పించి నేరగాడుగా చిత్రీకరించినంత బాధ అమెరికాకు కలిగింది. నిజానికి, రోమ్ ఒప్పందంమీద సంతకాలు చేసిన 124 దేశాల్లో ఎక్కడ అడుగుపెట్టినా ఈ తీర్పుకు లోబడి సదరు దేశం నెతన్యాహూను అరెస్టుచేయాల్సి ఉంది. అమెరికా ఈ ఒప్పందంలో లేదన్నది వేరే విషయం. మరి, బ్రిటన్ అందుకు సిద్ధమేనా? అన్న ప్రశ్నకు ఆ దేశ హోంమంత్రి సమాధానం ఇవ్వనన్నారు. బ్రిటన్‌లో ప్రభుత్వం మారిన తరువాత, కొన్ని రకాల ఆయుధాల సరఫరాలు, వినియోగంమీద ఏవో పరిమితులు విధిస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా మాదిరిగా అప్పుడప్పుడు ఆగ్రహిస్తున్నట్టు, అలుగుతున్నట్టు కనబడటం వినా, ఇజ్రాయెల్‌కు ఆయుధాలు అమ్ముకుంటున్న పశ్చిమ దేశాలేవీ ఎన్ని ఉద్యమాలు జరిగినా, ప్రపంచవ్యాప్తంగా ఎంతటి వ్యతిరేకత చవిచూస్తున్నా ఆయుధ సరఫరాలను ఆపిందే లేదు. ఈ ఏడాది మే నెలలో ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీంఖాన్ ఇజ్రాయెల్‌మీద ఈ ఆరోపణలను సూచించడం, అదే నెలలో ఐసీజే తీవ్రంగా ఇజ్రాయెల్ రఫా ప్రవేశాన్ని వ్యతిరేకించడం, గాజాలోని వివిధ ఆస్పత్రులను ఇజ్రాయెల్ బలగాలు కుప్పకూల్చి, సజీవంగా ఉన్న రోగులను నిలువునా పాతిపెట్టినటువంటి అనేక నేరాలూ ఘోరాలు సైతం ఈ దేశాల మనసు మార్చలేకపోయాయి.

హమాస్ మీద యుద్ధం చేస్తున్నానని నెతన్యాహూ చెప్పుకోవచ్చును కానీ, గాజాలో ఆయన చేస్తున్నది సామాన్యులను ఊచకోతకోయడమని ఈ తీర్పు మరోమారు స్పష్టంచేస్తోంది. అన్నం నీళ్ళు మందులు లేకుండా చేయడం వంటి వ్యాఖ్యలు ఇజ్రాయెల్ నాయకుల నోటినుంచి ఈ ప్రపంచం విన్నది. ఆ రీతిన పాలస్తీనియన్లను చంపేయాలన్న కసి వారి మాటల్లోనూ, చేతల్లోనూ విస్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఇక విద్యాలయాలు, వైద్యాలయాలు సహా ప్రతీ చోటా హమాస్ ఉగ్రవాదులు ఉన్నారన్న వాదనతో వాటిని నేలమట్టం చేయడం, మారణాయుధాలు ప్రయోగించి వందలాదిమంది అమాయకులను హత్యచేయడం నిర్లజ్జగా సాగుతూనే వచ్చింది. నెతన్యాహూ పాల్పడుతున్న ఈ యుద్ధనేరాల్లో ఆయనకు ఆయుధాలు అమ్మిన దేశాలు కూడా భాగస్వాములే. ఆ పాపంలో వాటి వాటాయే అధికం. మారణాయుధాల సరఫరా సాగుతున్నంతకాలం ఏ యుద్ధమూ ఆగదు. నెతన్యాహూను ఎవరు అరెస్టు చేస్తారు, చేయగలరు అన్న ప్రశ్నలకంటే, ఐసీసీ ఆదేశాల్లో ఉన్న సారాంశానికి అనుగుణంగా ఆయాదేశాలు ఆయుధాల సరఫరాన్ని నిలుపుదల చేయడం ముఖ్యం. మానవాళిమీద అఘాయిత్యాలకు పాల్పడుతున్న నేరస్థులకు ఆయుధాలు అందించి, ఆ పాపంలో పాలుపంచుకోవడం ఆగిపోవాలి.

డార్విన్ ‘జీవపరిణామ’ విప్లవం

అది 1859, నవంబర్ 24. జీవపరిణామ సిద్ధాంతం వెలుగుచూసిన రోజు. ఛార్లెస్ డార్విన్ రాసిన ‘జాతుల పుట్టుక’ (The Origin of Species) గ్రంథం విడుదలైన సందర్భం. నాటి మేధో ప్రపంచాన్ని, శాస్త్ర కోవిదుల్నీ ఒక్క కుదుపు కుదిపేసిన అరుదైన సంఘటన. అది ఎంతటి సంచలనం సృష్టించిందంటే ఆ పుస్తకం వచ్చిన తొలినాడే 1250 కాపీలు అమ్ముడైనాయి. విజ్ఞానశాస్త్ర రంగంలో ఏ ఇతర ఆవిష్కరణ కలిగించనంతటి కదలికను డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం తీసుకొచ్చింది. జీవుల ఉనికిపై, అవి భూమిపై ఎలా అభివృద్ధిచెందాయో వివరించే సిద్ధాంతం కావటం అందుకు ఒక కారణం. అంతేకాదు, అప్పటి వరకూ నమ్ముతూ వస్తున్న జీవ సృష్టి సిద్ధాంతానికిది సవాల్ అవ్వడం. జీవ ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి కొత్త బాట వేసింది. ఇంతకు ముందు ఊహించనైనా ఊహించని కొత్త కోణాన్ని ఆధారాలతో ఆవిష్కరించింది. జీవుల పుట్టుకపై డార్విన్ వివరణ సరళంగా, సులభగ్రాహ్యంగా ఉంది. జీవులు ఇప్పుడు ఎలా ఉన్నాయో అలానే సృష్టించబడినాయన్న విశ్వాసాన్ని



వమ్ము చేసింది. జాతి అనేది దగ్గరి పోలికలున్న మరో జాతి నుండి పరిణామం చెందుతుందని చెప్పాడు. అంతటితో ఆగిపోలేదు డార్విన్. పరిణామం ఎలా చెందుతుందో కూడా చెప్పాడు. అదే ‘ప్రకృతి ఎంపిక’ లేదా Natural Selection. పరిణామాన్ని నడిపించే భౌతిక శక్తిగా ప్రకృతి పరిస్థితులు పని చేస్తాయనీ, ఆయా కాలాల్లో ఉన్న వాతావరణ పరిస్థితుల్ని తట్టుకుని నిలబడ్డ జీవులే ముందు తరాలకు తమ లక్షణాలను బదిలీ చేస్తాయన్నది దీని సారాంశం.

ఈ సిద్ధాంతం ఎదుర్కొన్న వ్యతిరేకత, విమర్శలు మున్నెన్నడూ కనీ వినీ ఎరుగనివి. ప్రకృతి ఎంపికను వివరించేందుకు సాధారణంగా పారిశ్రామికీకరణ కాలం నాటి బ్రిటన్‌ను ఉదహరిస్తారు. పారిశ్రామిక విప్లవానికి ముందు చెట్ల బోదెలపై తిరుగాడే సీతాకోక చిలుకలు తెల్లగా ఉండేవి. అదే 19వ శతాబ్దం ద్వితీయార్థంలో తెల్లటి సీతాకోక చిలుకల సంఖ్య తగ్గి నల్లటి సీతాకోక చిలుకలు ఎక్కువగావటం జరిగింది. కాలుష్యంతో చెట్ల బోదెలు నల్లబారటం తెల్లవాటిని శత్రువులు తేలిగ్గా గుర్తించేలా చేయటమే ఇందుకు కారణం. అదే సమయంలో నల్లటి సీతాకోక చిలుకలకు అది వరమైంది. శతాబ్దాంతానికి కాలుష్యం నివారించబడినపుడు ఈ పరిస్థితి తల్లక్రిందులు కావటం జరిగింది. జీవుల జనాభాపై వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని ఈ ఉదాహరణ తేటతెల్లం చేస్తున్నది. ఇది వాస్తవమే అయినప్పటికీ సీతాకోక చిలుకలు సీతాకోక చిలుకల్లానే ఉన్నాయి కదా! ఈ దృష్టాంతం జీవ పరిణామానికి సాక్ష్యం కానేరదని సృష్టివాదులు తిరస్కరించారు. వాతావరణ పరిస్థితులు స్వల్ప మార్పులను తీసుకరాగలవేమోగాని నూతన జాతులను సృష్టించలేవని వారి వాదన. దీనిలో కొంత హేతుబద్ధత లేకపోలేదు. డార్విన్ కాలానికి సహేతుకమైన సమాధానం లేదు. డార్విన్ మరణించిన ఒక దశాబ్దం తర్వాతగాని ఈ చిక్కుముడి వీడలేదు.

మన కళ్లెదుట అపరిమితమైన జీవవైవిధ్యం కనిపిస్తుంది. అంటే భిన్నజాతులు కలసిమెలసి జీవిస్తున్నాయి. భిన్న జాతులు అంటున్నామంటే వాటి మధ్య ప్రత్యుత్పత్తి సంబంధాలు ఉండవని అర్థం. పరస్పరం ప్రత్యుత్పత్తి జరపగలిగిన జీవులనే ఒక జాతిగా గుర్తిస్తారు. ఒక జాతి నుండి మరో కొత్త జాతి ఆవిర్భావం జరగటం సత్యమైతే వాటి రెండింటి మధ్య ఏ రకమైన ప్రత్యుత్పత్తి సంబంధం ఉండకూడదు. ఇదెంతవరకు సాధ్యం. ప్రకృతిలో అసలు జరుగుతుందా? ఇరవయ్యో శతాబ్దపు ఆరంభంలో ప్రిమిరోజ్ (పూల మొక్కలు) మొక్కల్లో వికసించిన హైబ్రిడ్ల రూపంలో దీనికి సమాధానం దొరికింది.

లండన్ రాయల్ బొటానికల్ గార్డెన్ నిర్వహించిన పుష్ప ప్రదర్శనలో ఒక మొక్క అందరి దృష్టిని ఆకర్షించి ప్రత్యేక బహుమతి అందుకుంది. ఈ ప్రిమిరోజ్ అసాధారణంగా పెద్ద ఆకులు, పూలతో ఉండటమే అందుకు కారణం. దీనికి క్యూ ప్రిమిరోజ్‌గా పేరు పెట్టారు. దీన్ని ఒక హైబ్రిడ్‌గా భావించి, ఏ మొక్కల కలయిక వలన ఇవి వచ్చి ఉంటాయో ఊహించి, వాటి మధ్య సంకరం చేశారు. కాని వచ్చిన మొక్కలు వంధ్య (గొడ్డుమోతు)గా మిగిలిపోయాయి. ఈ వంధ్య మొక్కల్లో 1905లో మరో అద్భుతం చోటుచేసుకుంది. ఏ కాయలూ కాయని ఒక వంధ్య మొక్కలో ఒక కొమ్మ మాత్రం పూలు పూయటం ఆ అద్భుతం. వీటి విత్తనాల నుండి వచ్చిన మొక్కలు పరస్పరం ప్రత్యుత్పత్తి జరపగలిగాయి. కాని హైబ్రిడ్‌కి జన్మనిచ్చిన వాటి తల్లిదండ్రులతో మాత్రం ప్రత్యుత్పత్తి విఫలమైంది. అంటే ఒక ‘కొత్త జాతి’ ప్రకృతి సహజంగా ఎవరి ప్రమేయం లేకుండానే ఆవిర్భవించిది. ఒరిజినల్ ప్రిమిరోజ్‌లు వంధ్యంగా ఎందుకున్నాయి? కొత్తగా వచ్చినవి ఎందువలన ఫలవంతమైనాయి? దీనికి లెటీస్ డిగ్బీ (Lettice Digby) పరిశోధనలు సమాధానమిచ్చాయి. క్రోమోజోముల సంఖ్య ఇందుకు కీలకం. వంధ్య ప్రిమిరోజ్‌లలో 18 క్రోమోజోములుంటే ఫలవంతమైన వాటిలో అందుకు రెట్టింపు 36 ఉండటమే కారణం. నూతన జాతులు ఆవిర్భవిస్తాయన్న డార్విన్ సూత్రీకరణను ఇది బలపరిచింది. ఇలాంటి అనేక రుజువులు గత శతాబ్ద కాలంలో కొల్లలుగా వచ్చి పరిణామ సిద్ధాంత విశిష్టతను చాటిచెప్పాయి. జాతుల పుట్టుక వెలువడిన నవంబర్ 24ను ప్రపంచం ‘జీవపరిణామ దినోత్సవం’గా జరుపుకుంటున్నది.

● ప్రొ. కట్టా సత్యప్రసాద్

విశ్వనాథ సాహిత్యపీఠం ద్విదశాబ్ది ఉత్సవాలు

విశ్వనాథ సాహిత్యపీఠం స్థాపించి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నవంబరు 24వ తేదీ ఆదివారం ‘ద్విదశాబ్ది ఉత్సవాలు’ నిర్వహిస్తున్నాం. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, అమీర్‌పేట్, హైదరాబాద్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులు. ఆవుల మంజులత, సి.మృణాళిని, ఎల్.వి. సుబ్రహ్మణ్యం, కె.వి.రమణాచారి, కె. రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, వెల్దండ నిత్యానందరావు, తనికెళ్ళ భరణి, మాడభూషి శ్రీధర్, టి. కిషన్‌రావు, నిఖిలేశ్వర్, అయినంపూడి శ్రీలక్ష్మి, ఓలేటి పార్వతీశం తదితరులు పాల్గొంటారు.

– వెల్చాల కొండలరావు (విశ్వనాథ సాహిత్యపీఠం)

ఈ దోస్తీ భారత్‌కు మేలు చేసేనా?

డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన నాయకుడు మాత్రమే. ఆయన అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టేందుకు ఇంకా ఏడు వారాల వ్యవధి ఉంది. అయితేనేం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి చోటా విద్యావంతుల మాటా మంతీ, సామాన్యుల పిచ్చా పాటీ అంతా ఆయన గురించే సుమా! మరీ ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రెండో రాకడ ప్రపంచం మీద, నిర్దిష్ట దేశం మీద, ఇంకా చెప్పాలంటే మీ పట్టణం మీద, మీ సొంత ఉద్యోగం మీద, మన జీవితాలతో సంబంధమున్న ప్రతి వ్యవహారం మీద ఎలాంటి ప్రభావం చూపనున్నదనేదే అందరి ఉత్కంఠ.



■ పి. చిదంబరం

‘పళని’ పలుకు

అమెరికా అధ్యక్ష ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత మార్కెట్ సూచీలు అధో ముఖంలో ఉన్నాయి. నవంబర్ 5న సెన్సెక్స్ 78, 782 పాయింట్లకు ఎగబాకింది. రూపాయి–డాలర్ మారకం రేటు రూ.84.11. ఈ వ్యాసాన్ని నేను రాస్తుండగా, సెన్సెక్స్ శుక్రవారం నాడు 77,156 పాయింట్లకు ఎగబాకింది. రూపాయి–డాలర్ మారకం రేటు రూ.84.50.

ఆర్థిక వ్యవహారాలలో డోనాల్డ్ ట్రంప్ ప్రధాన విశ్వాసాలు ఏమిటో చూద్దాం. ఆయన ఒక వ్యాపారవాది. అధిక సుంకాలు మాత్రమే అమెరికా ప్రయోజనాలను కాపాడగలుగుతాయని గట్టిగా నమ్మే వాణిజ్య దక్షుడు. దిగుమతి చేసుకునే సరుకులపై, ముఖ్యంగా చైనా ఉత్పత్తులపై గరిష్ఠ సుంకాలు విధిస్తానని ఆయన పదే పదే హెచ్చరించారు. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో చైనాతో అమెరికా వాణిజ్య లోటు: 2021లో 352 బిలియన్ డాలర్లు; 2022లో 382 బిలియన్ డాలర్లు, 2023లో 279 బిలియన్ డాలర్లు, 2024 (సెప్టెంబర్ వరకు)లో 217 బిలియన్ డాలర్లు. అమెరికాలోని సంపన్న వర్గాల వారికి చైనా సరుకులు, వస్త్రోత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, యంత్రాలు మొదలైనవి అవసరం. మరి రాబోయే ట్రంప్ ప్రభుత్వం చైనా నుంచి దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తే అమెరికన్ పరిశ్రమలు, వినియోగదారులకు ఖర్చులు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన వడ్డీ రేటు (మన ఆర్బీఐ విధించే రెపో రేటు లాంటిది)ను పెంచుతుంది. అమెరికా నిర్ణయాలు ఏవైనా చైనా తన కార్మిక శ్రేణుల ఉద్యోగాలను నిలబెట్టేందుకు సరుకుల ఉత్పత్తిని కొనసాగిస్తుంది. అమెరికా అధిక సుంకాల కారణంగా చైనా తన ఉత్పత్తులను ఇతర దేశాలకు తక్కువ ధరకు ఎగుమతి చేయడం అనివార్యమవుతుంది. మన ప్రభుత్వం ఇప్పటికే దేశంలోకి చైనా ఉత్పత్తుల వెల్లువను నిరోధించేందుకు రెండుసార్లు గరిష్ఠ స్థాయిలో యాంటీ డంపింగ్ సుంకాలను విధించింది. చర్యకు ప్రతి చర్య ఉంటుంది కదా. అమెరికా అధిక సుంకాలకు దీటుగా చైనా, ఇతర దేశాలు కూడా గరిష్ఠ సుంకాలు తప్పక విధిస్తాయి. ఇది ప్రపంచ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపడం ఖాయం.

ద్రవ్యలోటును అదుపు చేయడం గురించి భారత్ తదితర దేశాలలో హైరానా పడినంతగా అమెరికాలో ఎవరూ ఆందోళన చెందరు. కారణమేమిటి? అమెరికా తన ద్రవ్యలోటును సులభంగా భర్తీ చేసుకోగలుగుతుంది. చైనాతో సహా పలు దేశాలు అమెరికా ట్రెజరీ బాండ్స్ (అమెరికా ప్రభుత్వం జారీ చేసే కోశాగార పత్రాలు) కొనుగోలు చేస్తుండడం వల్ల అమెరికాకు అవసరమైన నిధులు సమృద్ధిగా లభిస్తాయి. అమెరికా జాతీయ రుణం (21,000 బిలియన్ డాలర్లు)లో చైనాకు 1170 బిలియన్ డాలర్లపై చైనాకు స్వామ్యం ఉన్నది. అమెరికా ద్రవ్యలోటు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. పర్యవసానంగా అధిక వడ్డీ రేట్లు పెట్టుబడి ప్రవాహాన్ని వెనక్కి మళ్లిస్తుంది. భారత్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచి పెట్టుబడులు తరలిపోతాయి. శక్తిమంతమైన డాలర్‌తో, రూపాయి విలువ పడిపోతుంది.

అమెరికా నుంచి తరలిపోయిన ఫ్యాక్టరీలను వెనక్కి తీసుకువస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను అమెరికాలోనే నెలకొల్పేందుకై ఆయన పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇచ్చే అవకాశం ఎంతైనా ఉన్నది. ఇది జరిగినప్పుడు అమెరికాకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మందగిస్తాయి. అయినా అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను విదేశాలలోనే ఉంచడం జరిగితే సాంకేతికతల ఎగుమతిపై ఆంక్షలు విధించేందుకు ట్రంప్ వెనుకాడరు. ట్రంప్ తన మొదటి పాలనా కాలంలో అమెరికా సరుకులపై భారత్ అధిక సుంకాలు విధిస్తుందని, ‘కరెన్సీ మేనిప్యులేటర్’ (రూపాయి విలువను కృత్రిమంగా తగ్గించేందుకు ద్రవ్య విధానాన్ని ఉపయోగించుకునే దేశం)గా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మరి డోనాల్డ్ ట్రంప్–నరేంద్ర మోదీ మధ్య ‘దోస్తీ’ ఇప్పుడు భారత్ పట్ల ట్రంప్ తన నిక్కచ్చి వైఖరిని సడలించేందుకు తోడ్పడుతుందా లేదా అనేది ఒక చర్చించాల్సిన ప్రశ్న.

మరొక విషమ సమస్య అక్రమ వలసలు. అమెరికా సమాజంలోని నిరుద్యోగిత, పెచ్చరిల్లుతున్న నేరాలు, మాదక ద్రవ్యాలు మొదలైన సమస్యలు అన్నిటికీ అక్రమ వలసలే కారణమని ట్రంప్ నిందిస్తున్నారు. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి 100 రోజుల్లో పది లక్షల మంది అక్రమ వలసదారులను బలవంతంగా వెనక్కి పంపించివేస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉంటున్న విదేశీయులను వెనక్కి పంపించే బాధ్యతను, వలసలను తీవ్రంగా వ్యతిరేకించే టామ్ హోమాన్‌కు అప్పగించారు. ఎంత మంది భారతీయులను భారత్‌కు పంపించివేస్తారనేది ఇంకా కచ్చితంగా తెలియదు. ఎంతో కొంత మందిని తప్పక బహిష్కరిస్తారు. అయితే ఆ చర్య భారత్–అమెరికా సంబంధాలను ఏదో ఒక మేరకు ప్రతి కూలంగా ప్రభావితం చేయడం ఖాయం. హెచ్ 1 బి1 వీసాల నిబంధనలను ట్రంప్ మరింత కఠినతరం చేసే అవకాశమున్నది. మెరుగైన వృత్తి నిపుణులయిన భారతీయులు మరింతగా అమెరికాకు రావాలని అంతిమంగా అమెరికా పౌరులు కావాలని అమెరికన్ విశ్వవిద్యాలయాలు, ఆరోగ్య భద్రతా వ్యవస్థలు ప్రగాఢంగా కోరుకుంటున్నాయి. అయినా ట్రంప్ తన విధానాలకు దృఢంగా కట్టుబడి ఉంటే, అలాగే అమెరికా యాజమాన్యాలు కూడా భారతీయ వృత్తి నిపుణులను స్వాగతించాలన్న దృఢ వైఖరిని కొనసాగిస్తే ఒక ప్రబల ప్రతిబంధకాన్ని ఒక మహాశక్తి ఎదుర్కోవడమే అవుతుంది.



ట్రంప్ తన మొదటి పాలనా కాలంలో అమెరికా సరుకులపై భారత్ అధిక సుంకాలు విధిస్తున్నదని, ‘కరెన్సీ మేనిప్యులేటర్’గా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. అక్రమంగా వలస వచ్చిన వారిని బలవంతంగా వెనక్కి పంపించేందుకు ట్రంప్ ఈ మారు కృతనిశ్చయంతో ఉన్న దృష్ట్యా ఎంతో కొంత మంది భారతీయులనూ తప్పక బహిష్కరిస్తారు. హెచ్1 బి1 వీసాల నిబంధనలను ట్రంప్ మరింత కఠినతరం చేసే అవకాశమున్నది.

చమురు, ఔషధోత్పత్తి రంగాలపై ట్రంప్ పాలన పెను ప్రభావాన్ని చూపడం ఖాయం. ఇంధన మంత్రిగా క్రిస్ రైట్‌ను ట్రంప్ ప్రతిపాదించారు. చమురు, సహజ వాయువు నిక్షేపాలను మరింతగా వినియోగించుకోవాలని రైట్ కోరుతున్నాడు. వాతావరణ మార్పు సంక్షోభం అనేది ఒక మిథ్య అని ఆయన ఎప్పుడో కొట్టిపారేశాడు. అజర్ బైజాన్‌లోని బాకు నగరంలో జరుగుతున్న కాప్ చర్చలు విఫలం కాకపోవచ్చు కానీ వాటిలో గణనీయమైన పురోగతి ఉండకపోవచ్చు. భూతాపాన్ని తగ్గించి తీరాలని, అయితే ఆ లక్ష్య సాధన నెమ్మదిగా జరగాలన్నదే భారత్ వైఖరి. బహుశా అంతిమంగా ఇదే జరగవచ్చు. ఫార్మాస్యూటికల్ రంగానికి వస్తే ట్రంప్ రాకతో నియంత్రణల సడలింపు, ధరల పెరుగుదలకు అవకాశాలు కన్పించడంతో ఫార్మా స్టాక్‌ల ధర బాగా పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఔషధాల ధరలు పెరుగుతాయి. ఆరోగ్య భద్రత సదుపాయాలు అందరికీ కల్పించే ప్రయత్నాలకు తీవ్ర విఘాత మేర్పడుతుంది.

పశ్చిమాసియాలోను, ఐరోపాలోను ఇప్పుడు రెండు భీకర యుద్ధాలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో అమాయక ప్రజలు హతమవుతున్నారు. పాఠశాలలు, ఆస్పత్రుల లాంటి కీలక సదుపాయాలు ధ్వంసమైపోతున్నాయి. మరి ఈ రెండు యుద్ధాల పట్ల డోనాల్డ్ ట్రంప్ వైఖరి ఏమిటి? తనను ఎన్నుకుంటే ఆ యుద్ధాలను నిలిపివేస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. అయితే అది ఎలా సాధించగలిగేది ఆయన వెల్లడించలేదు శాంతి సాధనకు ఆయన ఏమి చేయనున్నారు? గతంలో ఆయన అనుసరించిన విధానాలు, చేసిన ప్రకటనల ఆధారంగా చూస్తే పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు ఆయన గట్టి మద్దతు ఇస్తారని స్పష్టమవుతుంది. రష్యాతో ఒక ఒప్పందానికి రావలసిందిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ఒత్తిడి తెచ్చే అవకాశమున్నది. దూకుడుగా, అనాలోచితంగా నిర్ణయాలు తీసుకుంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అటు ఐరోపాలో గానీ, ఇటు పశ్చిమాసియాలో గానీ యుద్ధం నిలిచిపోదు. శాంతి నెలకొనదు. అందుకు విరుద్ధంగా ఆ యుద్ధాలు మరింతగా తీవ్రమయితే సప్లై చైన్స్ (ఉత్పత్తి, సరఫరా ప్రక్రియల పరంపర)కు తీవ్ర అంతరాయమేర్పడుతుంది. ఈ పరిణామం అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.

అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం అనేది ట్రంప్ నినాదం. అది ఆయన హామీ. అయితే ఆ వాగ్దాన పాలన ఈ ధరిత్రిని మరింత మెరుగైన, మరింత భద్రమైన, మరింత సంపద్వంతమైన ప్రదేశంగా మార్చగలుగుతుందా? మార్చలేకపోవచ్చు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా రూపొందించడమనేది అమెరికా స్వప్రయోజనాలను కాపాడేందుకేనన్నది ట్రంప్ సునిశ్చిత విశ్వాసం. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు కూడా ట్రంప్ స్వార్థపరత్వాన్ని రుజువు చేశాయి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,
కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

బాలలకు రాజ్యాంగ విలువలు

నేటి బాలలే రేపటి పౌరులు. 142 కోట్ల భారతదేశ జనాభాలో 15 ఏళ్లలోపు ఉన్న బాలలు 36 కోట్ల మంది ఉన్నారు. దేశ జనాభాలో వీరు 25.4శాతం. భావిభారతావని ముఖచిత్రాన్ని మార్చే మూల స్తంభాలే ఈ చిన్నారులు. కుల, మత భావోద్వేగాలను రాజకీయాలకు వాడుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత రాజ్యాంగ విలువలను నేటి బాలలకు నేర్పించడం అత్యావశ్యకం.

నవ భారత నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ చెప్పినట్లు ఆశయాలను ఆచరణలో పెడితే మానవుడే మహనీయుడు అవుతాడు. భారతదేశ ప్రజలందరి ఆశయాల కూర్పే మన రాజ్యాంగం. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 74 సంవత్సరాలు పూర్తయ్యాయి. జాతి జీవనంలో భిన్నత్వంలో ఏకత్వం కొనసాగడానికి రాజ్యాంగం ఎంతో దోహదపడింది. భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది.

భారత రాజ్యాంగం అత్యున్నత విలువలతో కూడుకున్నది. ప్రజలు, కుల, మత, భాష, లింగ, ప్రాంత, జాతి మొదలైన తారతమ్యాలు లేకుండా అందరూ సమానమేనని రాజ్యాంగం పునరుద్ఘాటించింది. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం, సమ న్యాయం, లౌకికవాదం సమగ్రత మొదలైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ఆచరించేలా రూపొందించారు. భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశ సూత్రాలతో దేశ ప్రజలందరూ ఒక్కటే అని చాటి చెప్పింది. నేటి బాలల్లో చిన్నప్పటి నుంచే భారత రాజ్యాంగ విలువలు పెంపొందించాలి. ప్రజలంతా ఒకటే అనే భావన వారి మనసుల్లో నాటేందుకు, సామాజిక, ఆర్థిక అంతరాలు మనుషులను దూరం చేయకూడదనే సమతా భావం పెంపొందించేందుకు బాలలకు భారత రాజ్యాంగ విలువలు బోధించాలి. బాలలకు భారత రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించుట కోసం బాల్యం నుంచే ప్రతిరోజు బడుల్లో ప్రార్థన సమయంలో విధిగా భారత రాజ్యాంగ ప్రవేశిక చదివించాలి. దీని ద్వారా భారత రాజ్యాంగంపై బాల్యం నుండే బాలలకు గౌరవం, అధ్యయనం చేయాలనే ఆలోచన పెరుగుతుంది.

బాలల్లో రాజ్యాంగ విలువలు, లక్ష్యాల మీద పూర్తి అవగాహన కల్పించడం వల్ల వారిని అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్ది భవిష్యత్ తరానికి అందించినవారమవుతాము. రాజ్యాంగ రచయితల ఆశయ సాధనకు కృషి చేసినవారమవుతాము. ఒక రాజ్యాంగం ఎంత మంచిదైనా, గొప్పదైనా కావచ్చు కానీ దానిని అమలు చేసే వాళ్ళు చెడ్డవాళ్ళు అయితే అది పని చేయదు అని డాక్టర్ అంబేద్కర్ చెప్పారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత భారతీయులందరిపైన ఉంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకొని బాలల్లో భారత రాజ్యాంగ విలువల పెంపుపై నిర్ణయం తీసుకొని రాజ్యాంగ మౌలిక లక్ష్య సాధన కోసం అన్ని విద్యా సంస్థల్లో ప్రార్థన సమయంలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించేలా చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగ మౌలిక లక్ష్యాలపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలి.

– పాకాల శంకర్‌గౌడ్

(నవంబర్ 26: భారత రాజ్యాంగ దినోత్సవం)

ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?

రాజకీయ పార్టీలు సమాజాన్ని విడగొడుతున్నాయన్నది ప్రస్తుతం దేశమంతటా తీవ్రస్థాయిలో చర్చింపబడుతున్న విషయం. ఎన్నికల సమయంలో ప్రధాన జాతీయ పార్టీలు రెండూ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. హిందూ సమాజాన్ని కులాలుగా విడగొట్టుతున్నారని ఒక పార్టీ ఆరోపణ. హిందువులు–ముస్లింలను విడగొడుతున్నారని మరొక పార్టీ ఆరోపణ. ఈ రెండు ఆరోపణల్లోనూ కొంత సత్యం ఉంది. అయినా దేశ సంరక్షణ, దేశ సమైక్యత దృష్ట్యా ఏ వాదం సరైనది అన్న విషయాన్ని పరిశీలించాలి.


హిందూ సమాజాన్ని కులాలుగా విడగొడుతున్నారు అనే ఆరోపణను చూద్దాం. హిందూ సమాజంలో 4 వర్ణాల వ్యవస్థ అనాదిగా ఉంది. అన్ని ప్రాచీన సంస్కృతుల్లో అలాగే ఉండేది. ఈ వ్యవస్థను వేదంలోని కొన్ని భాగాల్లోనూ, భగవద్గీతలోనూ చూడగలం. మత గ్రంథాలే ఈ విభజనకు మూలం అని అంగీకరించాలి. అయితే సమాజం అవసరాలను బట్టి, వృత్తుల ఆధారంగా ఏర్పడిన అనేక కులాలు – కమ్మరి, కుమ్మరి, నేతకారులు, స్వర్ణకారులు మొదలైనవి, వృత్తుల ఆధారం కాకుండా ఏర్పడిన కులాలు –రెడ్డి కమ్మ మొదలైన వేలాది కులాలకు హిందూమత గ్రంథాలు మూలం కాదు. అనేక సామాజిక కారణాల వల్ల ఏర్పడినవే ఆ కులాలు. అయినా సమాజంలో ఇదివరకు నాలుగు వర్ణాల మధ్య ఉన్న హెచ్చుతగ్గుల భావన ఈ వేలాది కులాలకు కూడా వర్తింపబడింది. మతంతో ప్రమేయం లేకుండా కేవలం సమాజంలోని వ్యక్తులు చేసిన విభజన ఇది.

వృత్తిని బట్టి ఏర్పడిన కులాలు యూరప్ లాంటి దేశాల్లో ఉన్నప్పటికీ పారిశ్రామిక విప్లవం తర్వాత అవి సమసిపోయాయి. బ్రిటిష్ పాలనలో ఉన్నందువల్ల మనదేశంలో పారిశ్రామిక విప్లవం రాలేదు, సమాజంలో మార్పు రాలేదు. దానికి భిన్నంగా బ్రిటిష్ ప్రభుత్వం కులాల లెక్కింపును చేపట్టి కులాల మధ్య హెచ్చుతగ్గుల్ని నిర్ణయించి, కొన్ని వర్గాలకు రాయితీలు ఇవ్వడం కొన్ని వర్గాలను దూరం ఉంచడం ద్వారా కులవ్యవస్థను మరింత పటిష్టం చేసింది. అంతేకాక కొన్ని వర్గాలపై పీడించబడ్డవారు, మరికొన్ని వర్గాలపై పీడించే వర్గాలు అనే ముద్రను వేసింది. దీని ద్వారా వలసపాలకుల వ్యూహంలో భాగమైన మతాంతరీకరణ సులభమయింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దురదృష్టవశాత్తు రాజకీయ కారణాలవల్ల కులాల పార్టీలు ఏర్పడడం, అలాగే సామాజిక న్యాయం పేరిట కొన్ని వర్గాలకు రాయితీలు ఇవ్వడం, వారిని ఓటు బ్యాంకులుగా తయారు చేయడం వల్ల సహజంగా సమసిపోవాల్సిన కులవ్యవస్థ మరింత పటిష్టంగా నిలిచింది.

ఇప్పుడు రెండవ ఆరోపణను పరిశీలిద్దాం. ఒక జాతీయ పార్టీ హిందువులను, ముస్లింలను విడదీస్తోందని ఆరోపణ. హైందవం, ఇస్లాం రెండూ మతాలే. వీటికి విభిన్న సిద్ధాంతాలున్నాయి. హిందూ సిద్ధాంతంలో ఇతర మతాలను నిర్మూలించాలన్న, ప్రపంచమంతా హిందూ మతాన్ని వ్యాపింపజేయాలన్న ఆదేశాలు లేవు. ఇస్లాంలో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అందువల్ల ఇస్లాంను నమ్మేవారు, నమ్మనివారు అంటూ ప్రపంచంలోని మనుషులందరూ రెండు వర్గాలుగా విభజింపబడ్డారు. తమ మతాన్ని నమ్మని వారిని క్రమక్రమంగా తమ మతంలోకి తీసుకురావడమే దేవుడిచ్చిన ఆదేశం. కాబట్టి ఈ రెండు వర్గాలను కలిపి ఉంచాలని ఒక వర్గం వారు చేస్తున్న వాదన ఎంతవరకు ఆచరణలో సాధ్యమవుతుందో తెలియదు.

మత గ్రంథం ఆధారంగా ఇదివరకే విడిపోయిన వారిని ఇప్పుడు ఎవరు విడదీస్తున్నట్లు? మన దేశానికి స్వతంత్రం రాకముందు నుండి ఒక వర్గం వారు మరొక వర్గంపై ఇదే ఆరోపణను చేస్తూ వచ్చారు. వీరు ఒక విధంగా ఆశావాదులు, అందరూ కలిసి ఉంటారు అనే భావన కలిగినవారు. ఈ వాదన అందరికీ ఉదారవాదంగాను, ఆమోదయోగ్యంగాను కనిపిస్తుంది. కానీ హిందువులు ముస్లింలు ఒకటిగా ఉండలేము అనే వాదనతోనే భారతదేశ విభజన జరిగింది. మేము హిందువులతో కలిసి ఉండలేమన్న వాదన ఇస్లాం నుండి వచ్చింది. ఇప్పుడు కూడా, భారతదేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చడం తమ లక్ష్యం అంటూ ఆ మత పెద్దలు అనేక మంది బాహాటంగా ప్రకటించడాన్ని చూస్తున్నాం. స్వాతంత్ర్య సాధన తర్వాత 70 ఏళ్లకు పైగా క్రమక్రమంగా ముస్లిం సమాజం ఒక పార్టీకి ఓటు బ్యాంకుగా మారింది. అలాగే క్రైస్తవ సమాజం కూడా. దీనికి తోడు మరిన్ని ఓటు బ్యాంకుల్ని పొందగలిగితే శాశ్వతంగా అధికారంలో ఉండగలమనే వ్యూహం ఒక జాతీయ పార్టీది. అందువల్ల ఈ రెండు వర్గాలను కలపడం అనే వాదన ఆశావాదమా లేక అవకాశవాదమా అని సందేహం కలుగుతుంది. అమెరికాలో ఇటీవలి పరిణామాల్ని గమనిస్తే సరిగ్గా ఇలాంటి వ్యూహాన్ని ఒక పార్టీ వారు అమలు చేశారు కానీ ఊహించిన ఫలితాలు రాలేదు.



మైనారిటీల సహాయంతో అధికారంలోకి వచ్చిన పార్టీలు మైనారిటీల డిమాండ్లకు లొంగాల్సి ఉంటుంది. ప్రభుత్వం క్రమక్రమంగా నిర్వీర్యమవుతుంది. ఈ పరిస్థితిని దేశంలోని అనేక రాష్ట్రాల్లో చూడగలం. సమాజంలో జరిగే పరిణామాలను పోలీసు గాని ఆర్మీ కాని నివారించలేని పరిస్థితులు ఏర్పడతాయి. సమాజంలోని అనేక వర్గాలకు న్యాయం చేకూరదు.

మనదేశంలో ఈ రెండు వర్గాలు చేస్తున్న ప్రయోగాల పరిణామాలు ఎలా ఉంటాయి? మొదటగా కులాల లెక్కింపును గమనిద్దాం. సామాజిక మార్పు, ఆధునికీకరణ వల్ల సహజంగా కనుమరుగవడానికి సిద్ధంగా ఉన్న కులాలను మళ్లీ లేవగొట్టి వారి మధ్య గోడల్ని పటిష్టం చేయడం వల్ల కులాల వారీగా ప్రాంతీయ పార్టీలు రావచ్చు. హిందూ మతానికి కులాలకు సంబంధం లేకపోయినా ఈ కులాలన్నిటికీ హిందూ మతమే కారణం అని హిందూ మతంపై నింద కూడా పడుతుంది. కులాల హెచ్చుతగ్గులపైన మరిన్ని వ్యాసాలు, కథనాలు (narratives) రావడం వల్ల తాము పీడింపబడినవారు అనే భావన కొన్ని వర్గాల్లో పెరగడం, ఇతర మతాల్లోకి వెళ్లడం సహజంగా జరుగుతుంది. రెండు అబ్రహామిక్ మతాలు బలపడినప్పుడు దేశాన్ని ఏ విధంగా విభజించగలం అని సుమారు 15 సంవత్సరాల క్రితం అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో చేసిన విశ్లేషణలను రాజీవ్ మల్హోత్రా ‘బ్రేకింగ్ ఇండియా’ అనే పుస్తకంలో ముఖచిత్రంగా చూపారు. భారతదేశం ఆ విధంగా మూడు, నాలుగు భాగాలుగా విభజింపబడే అవకాశం ఉంటుంది. భారతదేశం ప్రపంచంలో ఒక శక్తిగా ఎదుగుతున్నదని ఒకవైపు భావిస్తున్న సమయంలో ఇలాంటి పరిణామాలు దానికి వ్యతిరేక దిశలో దేశాన్ని లాక్కు వెళతాయి.

సంతృప్తీకరణ విధానంతో ఒక వర్గానికి పెద్దపీట వేయడం మరొక వర్గంలో అసంతృప్తినే నిలుపుతుంది. అందువల్ల రెండు వర్గాలను వీరు కూడా విడదీసినట్లే. అంతేగాక హిందూ సమాజంలో దానిపట్ల రియాక్షన్ (ప్రతిక్రియ) వచ్చి వారందరూ ఏకమయ్యే అవకాశం ఉంది. అలాంటి అవకాశం ఇవ్వకుండా వారిని కులాలుగా చీల్చడం అన్నది అధికారం పొందాలనే వ్యూహంలో ఒక ఎత్తుగడ కావచ్చు. సామాజిక న్యాయం కోసం ఇప్పుడు ఎవరూ ఆందోళన చేయడం లేదు. చాలా కులాలవారు వారి అస్తిత్వాన్ని మరిచిపోవాలనే భావనతో ఉన్నారు. అయినా మళ్లీ వారి నెత్తిన కులం స్టాంపు వేయడం ఎంతవరకు సబబు తెలియదు.

అలాగే అవకాశవాద పార్టీలు కొన్నాళ్లు అధికార పీఠంపై వెలగవచ్చు. కానీ ఒకానొక స్థాయిలో జనాభా నిష్పత్తులు మారినప్పుడు ఈ పార్టీలు కనుమరుగై అబ్రహామిక్ మతాల ప్రభావంలోకి వెళతాయి. ప్రపంచమంతా గౌరవాన్ని పొందిన ఉపనిషత్ సిద్ధాంతం కేవలం కులం అనే కళంకంతో నిర్మూలించబడవచ్చు.

ఇప్పుడు హిందువులు, ముస్లింలు అంటూ సమాజాన్ని విడగొడుతున్నారనే ఆరోపణను చూద్దాం. దీనిలో కొంతవరకు నిజం ఉంది. ఇన్నాళ్లు అందరికీ తోడు, అందరికీ ప్రగతి అంటూ మాట్లాడిన పార్టీ ఎలక్షన్ సమయంలో ముస్లిం వ్యతిరేకంగా మాట్లాడడం ప్రజలకు నచ్చినట్లు కనపడదు. ఇదివరకటి ప్రభుత్వాల కన్నా ఎక్కువగా ఇచ్చామని గణాంకాల్ని కూడా ఇదివరలో చూపించారు, కానీ ఎన్నికల సమయంలో దానికి విరుద్ధంగా మాట్లాడడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. దీనివల్ల ఆ పార్టీకి ఇదివరకే వ్యతిరేకంగా ఉన్న ఓటు బ్యాంకు మరింత పటిష్టమైంది. పోతే హిందూ సమాజం పూర్తిగా ఒకటి కాలేదు. మత ప్రాతిపదికపై సమాజాన్ని విడదీస్తున్నారనే ఆలోచనను హిందూ సమాజంలోని కొన్ని వర్గాలు హర్షించవు. ఈ ప్రయోగం ఫలితాలను సాధిస్తుందా లేదా చెప్పలేము కానీ ఆ పార్టీకి గౌరవప్రదంగా ఉందని చెప్పలేం.

మైనారిటీల సహాయంతో అధికారంలోకి వచ్చిన పార్టీలు మైనారిటీల డిమాండ్లకు లొంగాల్సి ఉంటుంది. ప్రభుత్వం క్రమక్రమంగా నిర్వీర్యమవుతుంది. ఈ పరిస్థితిని దేశంలోని అనేక రాష్ట్రాల్లో చూడగలం. అలాంటి వాతావరణం రాకుండా నివారించడం ప్రభుత్వం బాధ్యత. సమాజంలో జరిగే పరిణామాలను పోలీసు గాని ఆర్మీ కాని నివారించలేని పరిస్థితులు ఏర్పడతాయి. సమాజంలోని అనేక వర్గాలకు న్యాయం చేకూరదు.

పైన మనం గమనించినట్లు తమ మత గ్రంథం ఆదేశాల ప్రకారం ఇస్లాం మిగతా మతాలకు దూరంగా ఉంటుందని, వాటితో కలిసి ఉండలేదని చెప్పగలం. భారతదేశ చరిత్ర, ఇటీవల చరిత్ర కూడా ఇందుకు సాక్ష్యం. హిందూ సమాజాన్ని ఏకం చేయాలి అనే భావన మంచిదే కానీ దానికి మరేదో మార్గంలో ప్రయత్నించాలి. హిందూ మతాచార్యులు కూడా దానికి తోడ్పడాలి.

కులాల లెక్కింపు చేస్తున్న పార్టీ కూడా ఆత్మ విమర్శ చేసుకోవడం అవసరం. తమ ప్రయోగం నిజానికి సామాజిక న్యాయాన్ని ఉద్దేశించినదేనా లేదా ఏదో విధంగా ఓటు బ్యాంకుల కూడికలతో అధికారంలోకి వచ్చే ప్రయత్నమా అని ప్రశ్నించుకోవాలి. ఒకప్పుడు బ్రిటిష్ పాలకులు సమాజాన్ని విభజించే ఎజెండాతో ఆచరించిన విధానాన్ని తాము మళ్లీ ఆచరణలో పెడుతున్నామని, అది మరొకసారి దేశ విభజనకు కూడా దారి తీయవచ్చని ఆ పార్టీ గ్రహించాలి.



■ కె. అరవిందరావు
మాజీ డీజీపీ





తిరువీధుల మెరిసే దేవదేవుడు



ఏడదాగున్నాడో ఏడుకొండలవాడు.. ఎన్ని మెట్లెక్కినా కానరాడు.. అనుకుంటూ ఎన్నో మైళ్లు దాటి, రైళ్లు మారి తిరుమలకు వెళ్లి శ్రీవేంకటేశ్వర దివ్యమంగళ స్వరూపాన్ని దర్శిస్తాం. కానీ, రాజధాని అమరావతివాసుల వరమో ఏమో గానీ ఆ స్వామే కొండ దిగి ఇక్కడి వరకు వచ్చాడు. గతంలో టీడీపీ హయాంలో అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్డులో నిర్మితమైన శ్రీవారి ఆలయం నేడు తిరుమల శోభతో కళకళలాడుతోంది. మధ్యలో వైసీపీ హయాంలో అభివృద్ధిలో వెనుకబడినా తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వ రాకతో ఆనంద నిలయమై భక్తులతో నిత్యం కిటకిటలాడుతోంది.



ప్రమాణస్వీకారం చేస్తున్న రావి వెంకటేశ్వరరావు. చిత్రంలో మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే రాము, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, వర్ల

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతా

- మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు
- ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

8లో

ప్రాణం తీసిన ప్రసవం


- పసికందు సహా తల్లి దుర్మరణం
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దారుణం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

విద్యాధరపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పురిట్లోనే పసికందుకు జన్మనిచ్చి తల్లి కూడా మృతిచెందిన హృదయవిదారక ఘటన శుక్రవారం భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సమ్మక్క అలియాస్ భవానీకి తొలుత ప్రసాద్ అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. అయితే, మనస్పర్థల కారణంగా ఇద్దరూ విడిపోయారు. బాబును భవానీ గుంటూరులోని ఓ హాస్టల్‌లో ఉంచి చదివిస్తోంది. విద్యాధరపురం రావిచెట్టు సెంటర్‌లో ఉంటున్న నాగరాజు దుర్గాఘాట్‌లో స్వీపర్. ఇతనిది కర్నూలు జిల్లా నంద్యాల వద్ద నివాసం కాగా, భార్య విజయరాణి అనారోగ్యంతో 2017లో మృతిచెందింది. దీంతో నాగరాజు అక్కడి నుంచి విజయవాడ వచ్చేశాడు. ఈ క్రమంలో భవానీతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఇష్టపడి వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం భవానీ 8 నెలల గర్భవతి. ఈనెల 19వ తేదీ ఉదయం 5 గంటలకు నాగరాజు దుర్గాఘాట్‌లో పనికి వెళ్లాడు. భవానీ.. గుంటూరులో ఉంటున్న తన కుమారుడ్ని చూసి వస్తానని చెప్పింది. ఇంతలో ఏం జరిగిందో కానీ.. ఆమె ఇంట్లోనే పసికందును కని చనిపోయింది. శుక్రవారం చుట్టుపక్కల వారికి దుర్వాసన వస్తుండటంతో నాగరాజుకు సమాచారం అందించారు. అతను వెంటనే ఇంటికి రాగా, వంటగదిలో భవానీ, పసికందు మృతదేహాలు కనిపించాయి. వెంటనే భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెస్ట్ బైపాస్ పనులు పునరుద్ధరణ

6లో





రేషన్ మాఫియా

అధికారులు, పాలకుల అండతో రేషన్ బియ్యం మాఫియా చెలరేగిపోతోంది. పేదల కడుపు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్న పీడీఎస్ బియ్యం కొందరు పెద్దల ఆర్థిక ఆకలి తీరుస్తోంది. ఒక్క నందిగామ నియోజకవర్గంలోనే నెలకు రూ.2 కోట్ల వరకు ఆర్జిస్తున్నారు. షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో ఇద్దరు వ్యాపారులు ఈ దందా సాగిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నారు.

నందిగామ నియోజకవర్గంలో నెలకు రూ.2 కోట్ల ఆదాయం

షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో రేషన్ బియ్యం దందా

- నెలకు 1,200 టన్నుల పీడీఎస్ బియ్యం పక్కదారి
- ఇద్దరు వ్యాపారులకు మండలాలు కేటాయింపు
- స్థానిక వ్యాపారులెవరైనా అమ్ముకుంటే కేసులు
- ఇదేంటని ప్రశ్నించిన వారికి వేధింపులు
- మంత్రి నేరుగా దాడులు చేసినా ఆగని అక్రమాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల ఎంఎల్ఎస్ పాయింట్లకు నెలకు 1,700 టన్నుల బియ్యం దిగుమతి అవుతోంది. నందిగామకు వెయ్యి టన్నులు, కంచికచర్లకు 700 టన్నులు వస్తాయి. ఈ మొత్తాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో సుమారు 1,200 టన్నులు పక్కదారి పడుతోంది. ఇలా బియ్యం పక్కదారి పట్టడం కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నా ఇటీవల కాలంలో పెరిగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. దీంతో అక్రమార్కులకు రాచమార్గం పడింది. ఎండీయూ సిబ్బంది కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుని బియ్యానికి బదులు కేజీకి రూ.10 చెల్లిస్తున్నారు. ఆ బియ్యాన్ని రేషన్ మాఫియాకు రూ.13 నుంచి రూ.16కు విక్రయిస్తున్నారు.

ఈ ఇద్దరే కీలకం

నందిగామ నియోజకవర్గంలో కొన్ని దశాబ్దాలుగా రేషన్ మాఫియాను ఇద్దరు వ్యాపారులు నడిపిస్తున్నారు. వారు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాస్తూ పబ్బం గడుపుకొంటున్నారు. వీరిలో వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన వ్యాపారి ఒకరు కాగా, మరొకరు చందర్లపాడు మండలానికి చెందినవారు. వీరి కింద కొన్ని వందల మంది బియ్యం సేకరించే వారుంటారు. వీరికి ఈ వ్యాపారులే స్కూటీలు ఇచ్చి మరీ రేషన్ బియ్యాన్ని సేకరిస్తుంటారు. తమ దందాకు అధికారులు అడ్డు పడకుండా జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి అధికారుల వరకూ అందరికీ ప్రభుత్వ జీతాల కంటే ముందే మామూళ్లు అందజేస్తుంటారు. వైసీపీ హయాంలో వీరులపాడుకు చెందిన వ్యాపారి ఒక్కడే నియోజకవర్గం మొత్తం చక్రబెట్టేవాడు. ప్రభుత్వం మారాక ఈయన టీడీపీ పెద్దల పంచన చేరాడు. నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా పేరొందిన నాయకుడు రేషన్ దందాను మండలాల వారీగా విడగొట్టి ఇద్దరు వ్యాపారులకు పంచినట్లు సమాచారం. వీరులపాడుకు చెందిన వ్యాపారికి కంచికచర్ల, వీరులపాడు మండలాలు, చందర్లపాడుకు చెందిన వ్యాపారికి నందిగామ, చందర్లపాడు మండలాలను అప్పగించారని చెబుతున్నారు. ఎండీయూల నుంచి సేకరించిన బియ్యాన్ని రీసైకిల్ చేసి రూ.25 చొప్పున ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

కేసుల నుంచి మినహాయింపులు

కొందరు లబ్ధిదారులు బియ్యం తీసుకుని స్థానిక వ్యాపారులకు అమ్ముతుంటారు. ఎండీయూలు కేజీకి రూ.10 ఇస్తుండగా, స్థానిక వ్యాపారులు రూ.2 అదనంగా ఇస్తుండటమే ఇందుకు

మిగతా 8లో..

పోలవరం కాలువలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

ఫొటోషూట్‌కు వచ్చిన ఆరుగురు స్నేహితులు

- కొత్తూరు తాడేపల్లి సమీపంలో ఘటన
- అజిత్‌సింగ్‌నగర్ దాబాకొట్లు ప్రాంతానికి చెందినవారిగా గుర్తింపు



శివతేజ



మున్వర్

విజయవాడ రూరల్/విజయవాడ, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : సరదాగా ఫొటోషూట్‌కు వచ్చిన ఆరుగురు స్నేహితుల్లో ఇద్దరు పోలవరం కాలువలో గల్లంతైన ఘటన విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి సమీపంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. అజిత్‌సింగ్‌నగర్ దాబాకొట్లు ప్రాంతానికి చెందిన ఉప్పల శివతేజ(18), ఎండీ మున్వర్(18), రేకపల్లి సంతోష్, మన్యం కిరణ్, ఎండీ ఈసూబ్, రాయని దినేష్ స్నేహితులు. వీరంతా నగరంలోని వివిధ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నారు. స్నేహితులంతా శుక్రవారం సాయంత్రం జక్కంపూడి సమీపంలోని పోలవరం కాలువ ఒడ్డున ఫొటో షూట్‌కు వెళ్లారు. ఆరుగురిలో శివతేజ, మున్వర్‌లు సమీపంలోని కాలువలోకి ఈతకు దిగారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ఇద్దరు నీటిలో గల్లంతయ్యారు. దీంతో నలుగురు యువకులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ పోలీసులు వచ్చి వెలగలేరు వరకు గాలించారు. చీకటిపడడంతో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కాగా, కాలువలో దిగిన ఇద్దరు యువకులకు ఈత రాదు. ఒడ్డున దొరికిన తాడు సహాయంతో లోపలికి దిగినట్టు సమాచారం. నీటి ప్రవాహానికి తాడు తెగిపోవడంతో యువకులు ఇద్దరు గల్లంతైనట్టు తెలిసింది.



కస్టమ్స్ అధికారులు సీజ్ చేసిన చైనా వెల్లుల్లి బస్తాలు

వెల్లుల్లి.. కల్తీ లొల్లి

నిషేధం ఉన్నా.. నగరంలో చైనా వెల్లుల్లి అమ్మకాలు

బిహార్ నుంచి హోల్‌సేల్ మార్కెట్లకు దిగుమతి

- కస్టమ్స్ తనిఖీల్లో పట్టుబడిన చైనా వెల్లుల్లి
- రూ.21.97 లక్షల సరుకు సీజ్
- పొడి తెగులు లక్షణాలున్నట్లు నిర్ధారణ


వెల్లుల్లి.. ఇప్పుడు ప్రతి వంటలో తప్పనిసరైంది. పచ్చళ్ల నుంచి బిర్యానీలు, నాన్‌వెజ్ వంటకాల్లో వెల్లుల్లి లేకపోతే రుచే లేని పరిస్థితి ఏర్పడింది. మనం రోజూ ఇంత ఎక్కువగా వాడుతున్న వెల్లుల్లి అసలు నాణ్యమైనదేనా? సంవత్సరం కిందటి వరకు తక్కువ ధరకే లభించిన వెల్లుల్లి ఈ మధ్యకాలంలో ఎందుకు అంత పెరిగింది? గిట్టుబాటు ధర దక్కడం లేదని రైతులు పంట విరామం ప్రకటించడం వల్ల.. మన రాష్ట్రానికి, ముఖ్యంగా మన నగరానికి చైనా నుంచి పొడి తెగులు సోకే లక్షణాలున్న వెల్లుల్లి దిగుమతి అవుతోందా? అనే ప్రశ్నలు వేసుకుంటే.. అన్నింటికీ అవుననే సమాధానమే వస్తుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మార్కెట్‌లో ఉల్లితో పాటు వెల్లుల్లి ఘాటు తీవ్రంగా ఉంది. ఇది ఉల్లి ధరల కంటే ఎక్కువగా ఉంటోంది. దేశీయ వెల్లుల్లికి డిమాండ్ ఉండటం, పంట దిగుబడి తగ్గడంతో వ్యాపారులు చైనా వెల్లుల్లిని వినియోగదారులకు కట్టబెడుతున్నారు. నిషేధం ఉన్నా రాష్ట్రంలోకి అడుగుపెట్టిన చైనా వెల్లుల్లిని విజయవాడ కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ అధికారులు సీజ్ చేయడంతో ఇప్పటి వరకు బహిరంగంగా కనిపించిన సరుకు రహస్య ప్రదేశాలకు వెళ్తోంది.

ఏం జరుగుతోంది..?

ఉల్లి, వెల్లుల్లి సరఫరాకు విజయవాడ, గుంటూరు హోల్‌సేల్ మార్కెట్లు ప్రధాన కేంద్రాలు. ఉల్లిని రాష్ట్రంలోని అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పండిస్తారు. మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటారు. వెల్లుల్లిని మాత్రం పూర్తిగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి రప్పించుకుంటారు. వెల్లుల్లి పంటకు మధ్యప్రదేశ్ కేరాఫ్ అడ్రస్. ఇక్కడి ఇండోర్, మానేసూర్, పింప్లియాలో ఈ వెల్లుల్లి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. తర్వాత రాజస్థాన్‌లోని రాజ్‌కోట్ ప్రాంతంలో సాగు జరుగుతుంది. ఈ ప్రాంతాల నుంచి విజయవాడ, గుంటూరు

మిగతా 8లో..



మామిడి మాయం..!

తెగుళ్ల బెడద.. ప్రతికూల వాతావరణం.. మార్కెటింగ్ కష్టాలు

- గత ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యం
- జిల్లాలో 10 వేల ఎకరాల్లో తోటలు నరికివేత
- మామిడి సాగు అంటేనే భయపడుతున్న రైతులు

6లో



- **అదానీ అరెస్టు**


అదానీ, జగన్ చీకటి కుంభకోణంపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అదానీ మాస్క్ ధరించిన వ్యక్తికి సంకెళ్లు వేసి వినూత్నంగా నిరసన చేపట్టారు.

మామిడి.. మాయం!

నరికిన మామిడి చెట్టు



- తెగుళ్ల బెడద, ప్రతికూల వాతావరణం.. మార్కెటింగ్ కష్టాలు
- గత ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యం..
- ఎన్టీఆర్ జిల్లాలో 10 వేల ఎకరాల్లో తోటలు నరికివేత
- మామిడి సాగు అంటేనే భయపడుతున్న రైతులు



ఫలాల్లో రారాజు.. రుచిలో మేటి.. ఖండాతరాలు దాటిన ఖ్యాతి.. రవాణా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీగా ఆదాయం సమకూర్చిపెట్టే మధుర మామిడికి గడ్డు కాలం దాపురించింది. ఎన్టీఆర్ జిల్లా పరిసరప్రాంతాల్లో 56 వేలకు విస్తరించిన మామిడి సాగు నేడు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ వైఫల్యం ప్రతికూల వాతారణ పరిస్థితులు, తెగుళ్ల బెడద, మాసి మంగు, రాతి మంగు, పురుగులు పట్టి కుళ్లిపోవడం, పుచ్చులు రావడం మార్కెటింగ్ కష్టాలతో మామిడి రైతులకు తీవ్ర నష్టాలు వస్తున్నాయి. క్రమక్రమంగా మామిడి సాగు అంటేనే రైతులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. మామిడి రైతులు తోటలను నరికి వేస్తు ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.



విస్సన్నపేటలో మామిడి మార్కెట్ (ఫైల్‌ఫోటో)

(విస్సన్నపేట, ఆంధ్రజ్యోతి)

మామిడి సాగు ప్రస్తుతం జూదంలా తయారైంది. అదృష్టం కలిసి వస్తే మంచి పంట పండి పెట్టుబడులు అంతంత మాత్రం వస్తాయని. లేకుంటే దిగుబడి తగ్గి అప్పుల పాలవడం ఖాయమని రైతులు పేర్కొంటున్నారు. ఎరువులు, పురుగు మందులు, కోత కూలి, దమ్ము చేయడం, రవాణా ఖర్చులు మొత్తం కలిపి ఎకరాకు సుమారు రూ.50 వేలు పెట్టుబడి ఖర్చు అవుతోంది. లాభాలు రాకపోతే మళ్లీ అప్పుల పాలవడం రైతులకు ఆనవాయితీగా మారింది.

మసకబారిన ప్రతిష్ట

విస్సన్నపేట పరిసర ప్రాంతాల్లో మామిడికి ఢిల్లీ, ముంబాయి, కలకత్తా, గుజరాత్, హైదరాబాద్ వంటి జాతీయ మార్కెట్‌లో గొప్ప పేరుండేది. ప్రధానంగా బంగినపల్లి, రసాలు వంటి రకాలకు మార్కెట్‌లో మంచి ధర పలికేది. విస్సన్నపేట మ్యాంగో అని బోర్డులు పెట్టి మరీ విక్రయాలు జరిపేవారు. ఇదంతా గతం ప్రస్తుతం ఇక్కడ మామిడి పేరు చెబితేనే కొనేవారు ముందుకు రావడం లేదు. చెట్లకు పూత దశలోనే రైతులు పెద్ద మొత్తంలో నీరు పెట్టడం.. 10 నుంచి 12 సార్లు పురుగు మందులు పిచికారి చేయడం.. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో కాయ పక్వానికి రాకుండానే పుచ్చిపోతున్నది. దీంతో రైతులు కాయలను రోడ్డుపై పడేస్తూ పశువులకు మేతగా వేస్తున్నారు.



గేదెలు తింటున్న మామిడికాయలు (ఫైల్‌ఫోటో)

10 వేల ఎకరాల్లో తోటల నరికివేత

గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు ఎలాంటి రాయితీలు కల్పించకపోవడంతో విస్సన్నపేట, రెడ్డిగూడెం, జి.కొండూరు, మైలవరం, గంపలగూడెం, ఎ.కొండూరు, విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి తదితర చోట్ల సుమారు 56 వేలఎకరాల్లో మామిడి తోటలను రైతులు పెద్ద ఎత్తున నరికి వేశారు. దీంతో 46 వేల ఎకరాలకే తోటలు పరిమితం అయ్యాయి.



ఢిల్లీ శేఠ్‌ల మాయాజాలం

విస్సన్నపేట పరిసర ప్రాంతాల్లో మామిడి దుకాణాలకు వచ్చి కొనుగోలు చేసే ఢిల్లీ శేఠ్‌లు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు టోకరా వేస్తున్నారు. సేఠ్‌లు తమకు ఇష్టమైన రేట్లకు మాత్రమే మామిడి కొనుగోలు చేస్తున్నారు. వారు చెప్పిన ధరే ఫైనల్ అవుతోంది. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు.

నిలకడ లేని ధరలు

మార్కెట్లో మామిడి ధరలు వైకుంఠపాళిని గుర్తు చేస్తున్నాయి. సీజన్ ప్రారంభదశలో బంగినపల్లి, రసాలు టన్ను ధర రూ.60 వేల నుంచి 70 వేలు పలికితే, తోతాపురి (కలెక్టర్) టన్ను ధర రూ.40 నుంచి రూ.50 వేల వరకు పలుకుతుంది. ఆ ధర కేవలం 10రోజులు మాత్రమే ఉంటుంది. మార్కెట్‌లోకి మామిడి రావడం ప్రారంభం కాగానే టన్ను రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పడిపోతుంది. ఈలోగా ప్రతికూల వాతారణం రైతులను తీవ్రంగా దెబ్బతీస్తుంది. కోల్డ్ స్టోరేజ్‌లు లేకపోవడంతో మామిడిని తక్కువ ధరకే విక్రయించాల్సిన పరిస్థితి

కనుమరుగవుతున్న తోటలు

విస్సన్నపేట, రెడ్డిగూడెం, చాట్రాయి, పరిసర ప్రాంతాల్లో గత ఐదేళ్లుగా మామిడి తోటలు అంతరించిపోతున్నాయి. వేలాది ఎకరాల్లో తోటలను నరికి



రైతులు ఇతర పంటల వైపు మళ్లుతున్నారు. విస్సన్నపేట మండలంలోనే వెయ్యి ఎకరాల్లో మామిడి చెట్లు నరికివేశారు. దీంతో మామిడి పంట వేగంగా అంతరించిపోతోంది. ఇతర వాణిజ్య పంటలపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

వైసీపీ పాలనలో ఉద్యానశాఖ నిర్వీర్యం

2014-19వరకు మామిడి రైతులకు టీడీపీ హయాంలో కాయలకు కవర్లు, చిక్కాలు సబ్సిడీపై అందించే వారు. రైతు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించేవారు. వైసీపీ ప్రభుత్వం 2019-24వరకు ఉద్యానశాఖను పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో రైతులు కుదేలయ్యారు. మరలా ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంలో కాస్త ఊరట లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ విస్సన్నపేటలో ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. మామిడి అనుబంధ ఉత్పత్తులు తయారు చేస్తే మామిడి రైతులకు మేలు జరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది.

మండలాల వారీగా మామిడి విస్తీర్ణం

విస్సన్నపేట 12,990 ఎకరాలు, రెడ్డిగూడెం 11 వేలు, ఎ.కొండూరు 5,200, మైలవరం 6 వేలు, జి.కొండూరు 4 వేలు, గంపలగూడెం 3,950, తిరువూరు 4 వేలు, కొత్తూరు తాడేపల్లి 100 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.

ఖర్చులు కూడా రావడం లేదు



\- నందమూరి తిరుమలరావు, రైతు

గత 40 ఏళ్లుగా మామిడి సాగు చేస్తున్నా. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. తెగుళ్ల బెడద, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం పెట్టుబడులు అధికం కావడంతో ఖర్చులు కూడా రావడం లేదు. ఇటీవలే ఆరు ఎకరాల్లో మామిడి తోటలను తొలగించి ఇతర పంటలు సాగు చేయాలని భావిస్తున్నా.

పెట్టుబడులు దండగ



\- దేశిరెడ్డి ప్రతాప రెడ్డి, చేపూరివారిపాలెం

గత ఏడాది ఐదు ఎకరాలకు రూ.3 లక్షలు పెట్టుబడి పెడితే కేవలం రూ.20 వేలు వచ్చాయి. తీవ్రంగా నష్టపోయా. ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. ఐదెకరాల్లో పూర్తిగా తోటలను తొలగించి పామాయిల్ సాగు చేస్తా.

యాజమాన్య పద్ధతులు పాటించడం లేదు



\- నరేంద్రకుమార్, హెచ్‌వో

రైతులు తోటలను కౌలుకు ఇవ్వడంతో కౌలు రైతులు చెట్లకు పూత వచ్చేందుకు ఇష్టానుసారంగా నీరు పెడుతున్నారు. నాశిరకం మందులు వాడబట్టే నష్టాలు వస్తున్నాయి.

అసెంబ్లీ వేదికగా

అవినీతిలో జగన్‌ది అంతర్జాతీయ స్థాయి



* వసంత కృష్ణ ప్రసాద్

ఇబ్రహీంపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అవినీతి బాగోతం అంతర్జాతీయ స్థాయిలో ఉందని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఏపీలో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టేందుకు ప్రయివేటు సంస్థల నుంచి జగన్మోహన్ రెడ్డి రూ.1,750 కోట్లు లంచం తీసుకున్నారని సాక్షాత్తు అమెరికా దర్యాప్తు సంస్థ నిర్ధారణకు వచ్చిందన్నారు. ఎఫ్‌బీఐ తేల్చి చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. గతంలో ఆయనతో కలిసి పనిచేసినందుకు తెలుగు జాతికి క్షమాపణలు చెప్పారు. జాగ్రత్త పడి ముందుగానే వదిలించుకున్నానన్నారు. జగన్‌తో కొనసాగితే ఆయన చేసే దేశ ద్రోహంలో వైసీపీ నాయకులు భాగస్వాములు అవుతారన్నారు.

జలక్రీడల కేంద్రం ప్రారంభించండి



* మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ: జలక్రీడల కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వ హయాంలో నాగాయలంక కృష్ణానది బ్యాక్ వాటర్ పాయలో జలక్రీడల శిక్షణా కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేయగా ఇక్కడ శిక్షణ పొందిన బాలికలు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని గుర్తుచేశారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జలక్రీడల శిక్షణ కేంద్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి అకాడమీలో కార్యకలాపాలు పునరుద్ధరించాలని క్రీడామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు.

కిడ్నీ రోగులను ఆదుకోండి..



* కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు : కిడ్నీ రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతూ ఈ ప్రాంతం మరో ఉద్దానంలా మారే ప్రమాదం ఉందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 2.50 లక్షల మంది కిడ్నీ వ్యాధి బాధితులు ఉన్నట్లు తెలిపారు. ఎ.కొండూరులోని 13 గ్రామాల్లో, గంపలగూడెంలోని 4 గ్రామాల్లో, విస్సన్నపేటలోని 3 గ్రామాల్లో తాగునీటిలో ఫ్లోరైడ్ సిలికాన్ వల్ల ప్రజలు వ్యాధి బారిన పడుతున్నారన్నారు. డయాలసిస్ రోగులకు రూ.10 వేలనుంచి రూ.15 వేలు, మందులు వాడేవారికి రూ.10 వేలు వరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు అందించాలని ఎమ్మెల్యే ప్రస్తావించారు.

ఉపాధి హామీ అనుసంధానం చేయాలి



* శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట : వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో జాబ్ కార్డులు దుర్వినియోగం చేశారని, కళాశాల విద్యార్థులకు కూడా కార్డులు ఇచ్చి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వల్లె పండుగ పేరుతో గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వటంపై హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణాబోర్డు విజయవాడలో ఏర్పాటు చేయాలి

ఆటోనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా కృష్ణా బేసిన్ దాటి విశాఖపట్నంలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని సాగునీటి సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఎంపీ బాలశౌరిని కోరారు. అమరావతి రాజధాని అంతర్భాగమైన విజయవాడలోనే బోర్డును ఏర్పాటు చేయాలని శుక్రవారం ఎంపీ వల్లభనేని బాలశౌరికి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, గుండవపనేని శ్రీనివాసరావు, బొర్రా అశోక్ కుమార్, గుండపనేని ఉమావర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు తదితరులు వినతిపత్రం అందజేశారు.

న్యాయం చేయండి

\- ఎమ్మెల్యే సుజనాకు దుర్గా కోఆపరేటివ్ బ్యాంకు బాధితుల వినతి

భవానీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంకులో డిపాజిట్లు చేసిన తమకు న్యాయం చేసేవారే కరువయ్యారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం వద్ద బాధిత సంఘం తరఫున జింకా చక్రధర్ ఆధ్వర్యంలో డిపాజిట్‌దారులు 80 మంది వరకు శుక్రవారం సమావేశం అయ్యారు. డిపాజిట్లపై వచ్చే వడ్డీలతోను తాము జీవనం సాగిస్తున్నామని కొందరు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తమకు ఆదరువుగా ఉంటాయని లక్షల్లో కూడబెట్టుకున్న సొమ్మును బ్యాంకుల్లో డిపాజిట్లుగా చేశామని పలువురు వాపోయారు. బ్యాంకు సెక్యూరిటీ డిపాజిట్‌ల నుంచి తమకు చెల్లింపులు జరపాలని డిమాండ్ చేశారు. బాధితులంతా ఐక్యంగా కలిసి పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరికి వినతి పత్రం సమర్పించారు. తమకు న్యాయం చేయాలని కోరగా, ఎమ్మెల్యే దీనిపై విచారణ జరిగి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఎన్‌ఆర్ఐకు నకిలీ పత్రాలతో ప్లాట్ విక్రయించిన ఇద్దరిపై కేసు

విద్యాధరపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐకు దొంగ పత్రాలు తయారు చేసి ప్లాట్ లేకపోయినా ఉన్నట్లు మాయమాటలు చెప్పి లక్షలాది రూపాయలు తీసుకుని మోసం చేసిన ఇద్దరిపై శుక్రవారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, నాగులపాడుకు చెందిన షేక్ శ్రీనివాసరావు అమెరికాలో ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే స్థిరపడ్డాడు. ఇతని బంధువు షేక్ ఇమామ్, తాపీ మేస్త్రీ రామారావు ద్వారా 2012లో ఊర్మిళానగర్, పోలేరమ్మ గుడి సమీపంలో 200 గజాల ప్లాట్ ఉందని చెప్పటంతో బాధితుడు పలు దఫాలుగా రూ.11.31 లక్షలు చెల్లించి కొనుగోలు చేశాడు. బాధితుడు పలుసార్లు ప్లాట్ గురించి ఆ ఇరువురిని ప్రశ్నించగా, అందుబాటులోకి రాకుండా కాలయాపన చేశారు. దీంతో బాధితుడుకు అనుమానం వచ్చి విజయవాడలో ఉన్న పలువురు పరిచయస్తులతో ఆరా తీయగా నకిలీ పత్రాలు తయారు చేసి డబ్బులు తీసుకున్నట్లు గుర్తించాడు. దీనిపై బాధితుడు తనను ఇమామ్, రామారావులు మోసం చేశారని భవానీపురం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షర్మిలపై అసత్య ప్రచారం చేసిందెవరో ప్రజలకు తెలుసు : బాలకృష్ణ



గన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళపై అసత్య ప్రచారం చేసిందెవరో ప్రజలందరికీ తెలిసిందేనని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. అసెంబ్లీ సమావేశానికి హాజరయ్యేందుకు శుక్రవారం హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. షర్మిళపై తప్పుడు ప్రచారం చేసిందెవరో ప్రజలు గ్రహించారన్నారు.

అంతర్జాతీయ స్థాయికి జగన్ అవినీతి

- అదానీ, జగన్‌ల మధ్య జరిగిన ఒప్పందం రద్దు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు డిమాండ్



అదానీ, వైఎస్ జగన్‌ల మధ్య చీకటి ఒప్పందాలు, అవినీతిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

గవర్నర్‌పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ జగన్మోహనరెడ్డి అవినీతి అంతర్జాతీయ స్థాయికి చేరిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ధ్వజమెత్తారు. పారిశ్రామిక వేత్త అదానీ, వైఎస్ జగన్‌ల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదానీ కుంభకోణంపై విచారణ జరపాలని, ఆ ఒప్పందంతో సంబంధం ఉన్న అందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అదానీ చిత్రపటాన్ని కటకటాల్లో ఉంచి సంకెళ్లను వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతబూని అదానీ, జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ, మోదీతో కుమ్మక్కు అయిన జగన్, అదానీతో కలిసి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, అమెరికాలో నమోదైన కేసుకు జగన్ బాధ్యత వహించాలని అన్నారు. రూ. 1750 కోట్ల ముడుపులు అందాయని పక్కాగా చెప్తారంటే జగన్, అదానీ చీకటి ఒప్పందాలు నిజమేనని తేలాయన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఒప్పందాలను పూర్తిగా రద్దుచేసి ప్రజలపై భారం లేకుండా చేయాలన్నారు. అదానీ కంపెనీలతో ఎటువంటి ఒప్పందాలు లేకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఈ కుంభకోణంపై ప్రస్తావించడంలేదని, న్యాయవిచారణకు ప్రభుత్వం ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. అదానీకి గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం కేటాయించిన స్థలాలను రద్దు చేయాలని కోరారు. అదానీ స్మార్ట్ మీటర్లను పెట్టుకోవద్దని, వాటిని తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం నేతలు దోనేపూడి కాశీనాథ్, బోయ సత్యబాబు, బి.రమణారావు, కె.దుర్గారావు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ఓటరు ప్రత్యేక క్యాంపులు

విజయవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా నవంబరు 23, 24 తేదీలలో ప్రత్యేక ఓటరు క్యాంప్‌ను నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి నిధి మీనా శుక్రవారం ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించారు. రెండు రోజుల పాటు ఓటర్ల అభ్యంతరాలు, సవరణలకు ఈ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చు. ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు, తప్పుల సవరణ, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, శాశ్వతంగా వలసవెళ్లిన ఓట్ల తొలగింపులు తదితరాల కోసం ఈ క్యాంపులను ఓటర్లు వినియోగించుకోవచ్చు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఓటు కోసం ముందస్తుగా ఈ క్యాంపులో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరికి అర్హత వచ్చిన తర్వాతే అధికారికంగా ఓటర్లుగా నమోదు చేస్తారు. ఓటర్ల జాబితాలో తప్పులున్నా సరిచేయించుకోవచ్చు. ముసాయిదా ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలుంటే వాటిని కూడా క్యాంపులలో తెలియచేయవచ్చు. జనవరి 6, 2025న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్న నేపథ్యంలో, ఈ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రత్యేక క్యాంపులు గ్రామాలు, వార్డులు, డివిజన్ల పరిధిలోని పోలింగ్ స్టేషన్లలోనే నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక క్యాంపులు పనిచేస్తాయి.

పోరాటాలతోనే మహిళా సాధికారత

- సీఐటీయూ జాతీయ కార్యదర్శి సింధు

పెనమలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కేంద్ర ప్రభుత్వ, అనుబంధ సంస్థల్లో వివిధ హోదాలలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిరంతర పోరాటాలతోనే సాధ్యమవుతుందని సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఏఆర్ సింధు అన్నారు. శుక్రవారం పోరంకిలోని మురళీ గార్డెన్స్‌లో రెండు రోజుల కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయీస్, కార్మికుల జాతీయ స్థాయి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలంతో పాటు మహిళా ఉద్యోగుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లయినా మహిళా ఉద్యోగులపై లైంగిక దాడులు జరగడం విచారకరమన్నారు. ప్రధాన నగరాల్లో మహిళా ఉద్యోగుల సంతాన సంరక్షణ కోసం ఉచితంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు అదనంగా పన్నెండు రోజులు సెలవులను మంజూరు చేయాలన్నారు. సంఘ జాతీయ అధ్యక్షులు రూపక్ సర్కార్ మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులపై జరుగుతున్న అఘాయిత్యాలపై విచారణ తొందరైన రోజుల్లోనే పూర్తి చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో నిలిచిపోయిన 18నెలల డీఏలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ముందుగా మహిళా ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఎన్నో పోరాటాలు చేసిన దివంగత నేత కామ్రేడ్ సీతాలక్ష్మికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర విభాగ కార్యదర్శి ఎ.అజీజ్, ఉమెన్ సబ్ కమిటీ చైర్మన్ మనీసా మజుందార్, కన్వీనర్ సుశీలారాణి, పూర్వ కన్వీనరు ఉష, ఎస్వీ యాదవ్, కె.రమాదేవి, ఎం.రాజలక్ష్మి, వి.నాగేశ్వరరావు, కేవీ రమణారావు, మహిళా ఉద్యోగ సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వెస్ట్ బైపాస్ పనులు పునరుద్ధరణ

విజయవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ బైపాస్ పనుల్లో భాగంగా జీరో పాయింట్ దగ్గర కాంట్రాక్టు సంస్థ పనులను పునఃప్రారంభించింది. ఎన్‌హెచ్-16 దగ్గర చిన్న అవుటపల్లిలో విజయవాడ పశ్చిమ బైపాస్ ప్రారంభమౌతున్న ప్రాంతాన్ని జీరో పాయింట్ అంటారు. ఇక్కడ ఆర్‌ఓబీకి అనుసంధానంగా అప్రోచ్ రోడ్డును నిర్మించారు. ఈ అప్రోచ్ రోడ్డు ఎన్‌హెచ్-16 దగ్గర అనుసంధానమయ్యే చోట సరిగా కలవలేదు. కాంట్రాక్టు సంస్థ ఈ సమస్యకు పరిష్కారంగా పునరుద్ధరణ పనులను చేపడుతోంది. తిరిగి అప్రోచ్‌ను కొంత మేర తొలగిస్తూ మట్టిని మరోచోట పోగుచేస్తున్నారు. ఈ అప్రోచ్ వాల్‌ను ఎన్‌హెచ్-16కు తేలిగ్గా అనుసంధానమయ్యేలా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.



క్వారీవద్ద ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు

మట్టి రవాణా అడ్డుకున్న జనసైనికులు

ఎ.కొండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురం వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను తిరువూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామ సమీపంలోని కొండగట్టు ప్రాంతం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారన్న విషయాన్ని కొందరు జనసేన పార్టీ దృష్టికి తేవడంతో ఇన్‌చార్జి మనుబోలు కార్యకర్తలతో కలిసి వాహనాలను అడ్డుకున్నారు. ఆర్డీవో కె.మాధురీ, ఎ కొండూరు తహసీల్దార్ ఆశయ్యకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో టిప్పర్లకు వాహనాలు అడ్డుపెట్టారు. అటవీ భూమిని ఆక్రమించి మట్టిమాఫియా ఆ ప్రాంతంలోని మట్టిని తరలిస్తున్నదని వారు ఆరోపించారు. సమాచారం ఇచ్చినా స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ క్వారీ విషయాన్ని పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతామన్నారు. గట్టువద్దే జనసైనికులతో దీక్షచేపట్టి వంటా వార్పు నిరసన సాగించారు. క్వారీ వద్దకు వెళ్లిన జనసైనికులను మట్టి మాఫియా అనుచరులు బెదిరిస్తున్నారని మనుబోలు శ్రీనివాస్ ఆరోపించారు.



విప్ కాలువ శ్రీనివాసులు దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు

దుర్గమ్మను దర్శించుకున్న కాలువ దంపతులు

వన్‌టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు దంపతులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి అధికారులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందచేశారు. వేదపండితులు ఆశీస్సులు అందచేశారు.

విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలి

లబ్బీపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులకు ప్రతి దేవాలయంలో ఒక నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలని అసెంబ్లీలో విశాఖపట్నం గాజువాక ఎమ్మెల్యే వంశీకృష్ణ చర్చను లేవదీయడాన్ని స్వాగతిస్తున్నమని ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. శుక్రవారం బందరు రోడ్డులో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ ను కలిసిన జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

విజయవాడ తూర్పు

తెలుగు యువత ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

పటమట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ శ్రీ ధర్మశాస్త్ర సేవాసమితి వారు దీక్షాపరులైన అయ్యప్పస్వాములకు, శివ, భవానీ స్వాములకు నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో భాగంగా కృష్ణాజిల్లా తెలుగు యువత శనివారం భాగస్వామ్యులయ్యారు. డీజేఆర్ మెమోరియల్స్ ద్వారా కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నవితరణ నిర్వహించారు. అనంతరం గురుస్వామి వారికి ఆశీస్సులు అందించారు.


పూజలో పాల్గొన్న చౌదరి కుటుంబ సభ్యులు

నిరుపయోగ స్థలాలను వినియోగంలోకి తెస్తాం

దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పటమట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకువస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర నాయకులు చెన్నుపాటి గాంధీల అభ్యర్థన మేరకు శుక్రవారం పటమటలంక అవధూత ఆశ్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఇక్కడ అవధూత ఆయుర్వేద వైద్యం చేసే వారని, ఆయన మరణానంతరం ఈ ఆశ్రమ ప్రాంతాలన్నీ నిరుపయోగంగా మారాయని, ఆయనకు వారసులు లేరని తెలిపారు. ఈ స్థలం ప్రభుత్వానిదని, పటమటలంక చుట్టుపక్కల నివాసితులు ఆశ్రమంలో వాకింగ్ చేయొచ్చని మౌళిక ఆదేశాలిచ్చారు. అవధూత ఆశ్రమ రికార్డులు పూర్తిగా పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ఆశ్రమ ప్రాంతాన్ని వాణిజ్యపరంగా ఏ విధంగా అభివృద్ధి చేయాలో ఎమ్మెల్యే గద్దె, స్థానికులతో మాట్లాడి ఈ ఆశ్రమాన్ని అభివృద్ధి చేస్తామని వివరించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణాన్ని చేప ట్టాలని దేవదాయశాఖ అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్యే గద్దె రామ్మో హన్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, చెన్నుపాటి గాంధీ, ఎన్టీవో నాయకులు విద్యాసాగర్, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ, యలమంచిలి దేవేంద్రబాబు, అన్నా భత్తుని బాబీ, చెన్నుపాటి ఉషా రాణి, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.


అవధూత ఆశ్రమం గురించి మంత్రి రామనారాయణరెడ్డికి వివరిస్తున్న గద్దె

మద్యం షాపు తొలగించాలంటూ సీపీఎం ధర్నా

ధర్నాకు మద్దతు తెలిపిన సీపీఐ

కృష్ణలంక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్‌లో నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపు తక్షణం తొలగించాలంటూ 21, 22 డివిజన్లకు చెందిన సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా నివాస ప్రాంతాల మధ్యలో మద్యం షాపు పెట్టడం, ఎక్కడో గురునానక్ కాలనీలో పెట్టిన మద్యం షాపునకు అభ్యంతరం తెలిపితే దానిని తెచ్చి ఇక్కడ పెట్టడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యం, కరెంట్, సరుకులు ఇస్తే బాగుంటుందని కాశీనాథ్ ఎద్దేవా చేశారు. తక్షణమే ఇక్కడ ఏర్పాటు చేసిన మద్యం షాపు లైసెన్సును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ మద్యం షాపును తొలగించేంతవరకు స్థానిక ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పుప్పాల కృష్ణ, నగర కార్యదర్శివర్గ సభ్యుడు బత్తుల చిన్నారావు, నగర నాయకులు కోరాడ రమణ, వాజా శ్రీను, పి.శ్రీరాములు, గోపి, తాండవ కృష్ణ పాల్గొన్నారు.


మద్యం షాపును తక్షణం తొలగించాలంటూ సీపీఎం నాయకుల ధర్నా

ట్రాఫిక్ అనుమతులపై ప్రచారం ప్రారంభం

- మహానాడు జంక్షన్ వైపు లారీలకు వేళలు పాటించాలి : సీఐ రామారావు

ఆటోనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహానాడు జంక్షన్‌లోని ట్రాఫిక్ రద్దీ కట్టడిలో భాగంగా ఆటోనగర్ లారీ ఓనర్స్, ట్రాన్స్‌పోర్టు లారీలకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల సమయాల్లో అనుమతి లేదని ట్రాఫిక్ సీఐ రామారావు తెలిపారు.

శుక్రవారం మహానాడు జంక్షన్ వద్ద ట్రాఫిక్ అనుమతులపై ఆటో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌లోని టిప్పర్లు, లారీల వల్ల నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ట్రాఫిక్ కష్టాలను తొలగాలంటే వాటికి నిర్ణయిత సమయంలోనే అనుమతినివ్వాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దానికి అనుగుణంగా ప్రచార ఆటోను ప్రారంభించామని, రెండు రోజుల పాటు ఆటోనగర్‌లోని ప్రతి ప్రాంతంలోనూ మైక్ ద్వారా అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఎస్ఐ అనిల్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆటో ప్రచారాన్ని ప్రారంభించిన ట్రాఫిక్ సీఐ రామారావు, ఎస్ఐ అనిల్ కుమార్ తదితరులు

సిద్ధార్థ వైద్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ వైద్య కళాశాలలో ఏసీ లెక్చరర్ గ్యాలరీలో ఫస్ట్ ఎంబీబీఎస్ 2024-25 బ్యాచ్‌కి శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంఈ డాక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లేడీస్ హాస్టల్ కొత్త భవనం సిద్ధం అవుతుందన్నారు. ఇండోర్ గేమ్స్‌కు పెద్ద పీట వేసినట్లు చెప్పారు. అవుట్ డోర్ గేమ్స్‌కు ఆట స్థలం సిద్ధం అవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ బాగా చదవాలన్నారు. క్రీడల్లోను రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు పాల్గొని విద్యార్థులను అభినందించారు.


ప్రసంగిస్తున్న అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు

సీఎం సహాయనిధికి రేషన్ డీలర్ల వితరణ

మొగల్రాజపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధికి విజయవాడ రేషన్ డీలర్స్ రూ.5.90 లక్షలు ఇచ్చినట్టు సంఘం ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో భారీ వర్షాలకు, బుడమేరు వరదల వల్ల జరిగిన నష్టం, ఆ నష్ట నివారణ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని తమ వంతు సాయంగా సీఎం సహాయ నిధికి కమిషన్ నుంచి 15 శాతం జమ చేశామని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పటమట,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు పరిధిని 2, 15 డివిజన్లలో వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.10లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బాధిత కుటుంబాలకు అందజేశారు. 2వ డివిజన్‌కు చెందిన డి కనకదుర్గకు ఆపరేషన్ నిమిత్తం రూ.60వేలు, 15వ డివిజన్‌కు చెందిన బి స్పందనకు ఆపరేషన్ కోసం రూ.50వేలు రామ్మోహన్ అందజేశారు.

శ్రీధనలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

వన్‌టౌన్,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి దేవస్థానం (పాత శివాలయంలో)లో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాలు సందర్భంగా 21వ రోజు శుక్రవారం భ్రమరాంబ అమ్మవారు భక్తులకు శ్రీధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఆలయ ఈవో నటరాజన్ షణ్ముగం పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు రాచకొండ సుమంత్ శర్మ, అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డుపై చిరువ్యాపారుల తొలగింపు యత్నం

- స్వల్ప ఉద్రిక్తత
- ఎమ్మెల్యే గద్దె చొరవతో వెనుతిరిగిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

లబ్బీపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 19వ డివిజన్ బృందావన్ కాలనీలోని చందనా గ్రాండ్ సమీపంలో రోడ్డుపై చిరువ్యాపారులను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్నో ఏళ్లనుంచి కొందరు బండ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీరిని తొలగించేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం రాగా చిరువ్యాపారులు తమ పొట్టకొట్టవద్దని వేడుకున్నారు. అయినా తొలగించేందుకు సిద్ధం కాగా వ్యాపారులు విషయాన్ని టీడీపీ డివిజన్ అధ్యక్షుడు బాగం సాయి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన అధికారులతో మాట్లాడారు. ఇటువైపు మంత్రుల నివాసాలు ఉన్నాయని, వారి రాకపోకలకు అంతరాయంగా ఉండడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని ఫిర్యాదు రావడంతో పై అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు తెలిపారు. దీంతో సాయిప్రసాద్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన చిరువ్యాపారుల పొట్టకొట్టవద్దని, ఏదైనా ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడతానని చెప్పినట్లు సాయి ప్రసాద్ అధికారులకు తెలిపారు. దీంతో సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడ రోడ్డుపై వ్యాపారాలు చేసుకుని బతికే వారికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలుస్తామని తెలిపారు.


చిరువ్యాపారులతో మాట్లాడుతున్న సాయి ప్రసాద్

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఆటోనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ. 1.5 లక్షల విలువైన మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు విజయవాడ కమిషనర్ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సీసీఎస్ పోలీసులకు అందిన సమాచారం మేరకు పటమట పోలీసులు ఆటోనగర్ చెక్‌పోస్ట్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్ చోరీ కేసుల్లో నిందితుడు నత్తెనపల్లికి చెందిన తమ్మిశెట్టి వెంకటేష్‌ను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. అతడి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలో ఐదుకు పైగా కేసులు నమోదయ్యాయని తెలిపింది. సెంట్రల్ ఏసీపీ దామోదరరావు, పటమట సీఐ పవన్ కిషోర్, సిబ్బంది ద్విచక్ర వాహన చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపింది.


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

లబ్బీపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పలు సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకునేలా వివిధ కోర్సుల్లో సర్టిఫికేషన్స్ చేసుకోవాలని ఏపీ అండ్ తెలంగాణ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీ రీజనల్ లీడ్ టి.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం టెక్‌స్పార్క్స్ 2024 స్టేట్ లెవల్ టెక్నికల్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సర్టిఫికేషన్స్, ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ స్టార్టప్స్, ఇన్నోవేషన్స్‌పై అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్‌బ్లైండ్ సి, టెక్నో ఫీస్టా, క్రియేటింగ్ వెబ్‌పేజ్, షార్ట్ ఫిలిం, రీల్స్ ఆన్ సైబర్ ఎటాక్, సైబర్ థ్రెట్స్ తదితర ఈవెంట్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ప్రవీణ్ కుమార్

ఘనంగా మహా సంప్రోక్షణ ప్రారంభం

లబ్బీపేట, నవంబరు 22 (అంధజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలోని ఆలయంలో శుక్రవారం భోగ శ్రీనివాసునకు మహాసంప్రోక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. నగరానికి చెందిన వేణు అనే భక్తుడు భోగశ్రీవాసునికి పంచలోహ విగ్రహాన్ని ఆలయానికి బహుకరించాలని అధికారులను సంప్రదించగా వారు తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో విగ్రహాన్ని తయారు చేయించి నగరానికి పంపించారు. ఈ విగ్రహాన్ని ఆలయంలోని స్వామి వద్ద ఉంచే కార్యక్రమంలో భాగంగా మహా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ లలితా రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమాలు నాలుగు రోజులు జరుగుతాయని, శుక్రవారం సాయంత్రం భగవత్ ప్రార్థన, అంకుర్పాణ వేదారంభం, 23న ఉదయం 8గంటల నుంచి పుణ్యాహవాచనం, ప్రాయశ్చిత హోమం కుంభసాదన, 24న పంచగవ్యాధి వాసం, మహాశాంతి అభిషేకం, 25న మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు స్వామి ప్రసాదాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని అత్యంత సుందరంగ, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమాన్ని వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. తిరుమల ఆగమ అడ్వైజర్ నల్లూరి వెంకట మోహన రంగాచార్యులు, కంకణ భట్టార్ ప్రధానాచర్య ఆర్‌టీఎంకేఎస్ అయ్యంగార్, సూర్య కుమార చార్యులు, రుత్వికులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

స్థాయీ సంఘంలో 18 అంశాలకు ఆమోదం

చిట్టినగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 18అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 20అంశాలపై చర్చించి 18అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. నగరపాలక సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్లు సర్వీసులో ఉండగా ప్రమాదానికి గురై మరణిస్తే రూ. 5లక్షలు, సర్వీసులో ఉండగా సహజ మరణం పొందితే రూ. 2లక్షలు నష్ట పరిహారం వారి కుటుంబ సభ్యులకు చెల్లించేలా, జాప్యం లేకుండా ప్రధాన వైద్యాధికారి పేరున ఇంప్రెస్టుగా రూ. 25లక్షలు ఏర్పాటు చేసి మరణించిన కార్మికుల కుటుంబాలకు వెంటనే నష్ట పరిహారం చెల్లించేలా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య పనుల నిర్వహణకు 125 కొత్త కాంపాక్ట్ బిన్స్(చెత్తకుండీలు) రూ. 48లక్షలు, 225 మూడు చక్రాల ట్రాలీలు రూ.48లక్షలు, 278 రెండు చక్రాల తోపుడు బండ్లు రూ.26లక్షలతో కొనుగోలు చేసేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో పలువురు కమిటీ సభ్యులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పొదుపు సంఘాలను ఆదరించాలి

రాణిగారితోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెప్మా బజార్‌లో ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రజలు మహిళా పొదుపు సంఘాలను ఆదరించాలని టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు కోరారు. రాణిగారితోట ఫీడర్ రోడ్డులో శుక్రవారం నగరపాలక సంస్థ, మెప్మా మహిళా పొదుపు సంఘాల ద్వారా తయారు చేయబడిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించారు. ఈ బజార్ ను పరిశీలించిన టీడీపీ నేతలు అక్కడి ఉత్పత్తులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా బజార్‌ను రాణిగారితోట ప్రాంతంలో ఏర్పాటు చేయడం వలన ఇక్కడ నివసించే పేదలకు ఎంతో ఆసరాగా ఉంటుందని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అన్ని విధాల ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీవో ఉమామహేశ్వరి, సీవో నాగలక్ష్మి, టీడీపీ నేతలు పీరుబాబు, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.


ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న టీడీపీ నాయకులు

మర్యాదపూర్వక కలయిక



తన కార్యాలయానికి వచ్చిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును సత్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పలనాయుడుకు చిన్ని సాదర స్వాగతం పలికారు. సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలు, కేంద్రం నుంచి రాష్ట్రానికి తేవాల్సిన నిధులపైన చర్చించుకున్నారు.

బూడిద సమస్య పరిష్కరించాలి

- ఎంపీ కేశినేని చిన్నికి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు ఉద్యోగుల వినతి

వన్‌టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండపల్లిలోని నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ నుంచి విడుదలయ్యే బూడిద కారణంగా తాగునీరు, గాలి కలుషితమై అనారోగ్యాలకు గురవుతున్నామని, సమస్యకు పరిష్కారం చూపాలని గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు ఉద్యోగులు, కాలనీవాసులు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కు విన్నవించారు. గురునానక్ కాలనీలోని కార్యాలయంలో ఎంపీని వారంతా కలిశారు. వర్క్‌షాపు కాలనీలో నివాసం ఉంటున్న 500 కుటుంబాలతో పాటు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తెచ్చారు. థర్మల్ పవర్‌స్టేషన్ నుంచి బూడిద విరజిమ్మకుండా ఏర్పాటు చేసిన ఫిల్టర్లు పనిచేయటం లేదని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వినోద్, సెక్రటరీ కె.రాజకుమార్, కార్యవర్గ సభ్యులు తెలిపారు. సమస్య తన దృష్టిలో ఉందని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయని, నిధులు వచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ తెలిపారు. గత ప్రభుత్వం థర్మల్ పవర్ స్టేషన్ నిర్వహణకు రూపాయి కూడా విడుదల చేయలేదని, దీంతో ఇబ్బందులు వచ్చాయని ఎంపీ తెలిపారు. రెండు నెలల్లో సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ ప్రెసిడెంట్ ఎల్ఆర్‌కే ప్రసాద్, బ్రాంచి చైర్మన్ డి.ఎల్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

సరుకు రవాణాలో విజయవాడ డివిజన్ ముందంజ

రైల్వేస్టేషన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సరుకు రవాణాలో విజయవాడ రైల్వే డివిజన్ ముందంజలో ఉందని డివిజన్ సీనియర్ డీసీఎం రాంబాబు అన్నారు. విజయవాడలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సరుకు రవాణా, కస్టమర్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, డివిజనల్ ఏడీఆర్ఎం శ్రీనివాసరావు కొండా, బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు. లోడింగ్ అంచనాలు, ఆదాయం, సరఫరాలో ఇబ్బందులను డీసీఎం చర్చించారు. సరుకు రవాణా సంస్థల అధికారులను ఆయన స్వాగతించారు. 2023-2024లో అద్భుతమైన సహకారం అందించినందుకు అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించినందుకు ఎగ్జిక్యూటివ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్ ఎన్నడూ లేనివిధంగా అత్యధిక సరుకు రవాణా ఆదాయాన్ని సాధించిందని తెలిపారు. డివిజన్ అంతటా సరుకు రవాణాకు ఉన్న అడ్డంకులను తగ్గించేందుకు సమన్వయం, టీమ్ ప్లానింగ్, మౌలిక సదుపాయాల కల్పనల వల్ల ఈ ఘనత సాధ్యమైందన్నారు. భారతీయ రైల్వేలో ఉన్న లైట్ ఎకో సిస్టమ్‌ను సరళీకరించారన్నారు. కస్టమర్ల సహకారంతో ఈ ఏడాది చివరినాటికి 40 మిలియన్ల టన్నుల సరుకు రవాణా లోడింగ్ మార్క్‌ను చేరతామన్నారు. అనంతరం సరుకు రవాణా పరిశ్రమల ఎగ్జిక్యూటివ్‌ల ముఖాముఖిలో డీఆర్ఎం, అధికారులు పాల్గొన్నారు. వ్యాగన్లను కేసులవారీగా పెంచటానికి కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. లోడింగ్ స్టేషన్లలో క్షేత్రస్థాయిలో సమస్యలు, గూడ్స్ షెడ్లలో సౌకర్యాల పునరుద్ధరణకు పూర్తిస్థాయి సహకారం అందిస్తామని డీఆర్ఎం హామీ ఇచ్చారు. అధికారులు నరేంద్రవర్మ, ఎ.సంజయ్, వై.సందీప్, ఆలీఖాన్, శైలేష్‌కుమార్ సింగ్, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడి-దువ్వాడ మధ్య పలు రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ పరిధిలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా తాడి-దువ్వాడ సెక్షన్ల మధ్య పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న విశాఖపట్నం-విజయవాడ, కాకినాడ పోర్టు-విశాఖపట్నం, గుంటూరు-విశాఖపట్నం, రాజమండ్రి-విశాఖపట్నం అప్ అండ్ డౌన్ రైళ్లను రద్దు చేసినట్టు తెలిపారు.

26న కార్మిక, కర్షక ప్రదర్శన

- జయప్రదం చేయాలని ముఠాకార్మికులకు సీఐటీయూ పిలుపు

చిట్టినగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాత గవర్నమెంటు ఆస్పత్రి నుంచి ఈనెల 26న నిర్వహించే రైతులు, కార్మికుల ప్రదర్శనను జయప్రదం చేయాలని ముఠా కార్మికులకు సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపేట ఎంహెచ్ శ్రామిక భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరిట కార్మికుల హక్కులను హరిస్తోందని, యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల వ్యవసాయానికి అనుకూల విధానాలు కల్పిస్తోందని, రైతులకు ఇచ్చే రాయితీలను రద్దు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు, ట్రూఅప్ చార్జీల పేరిట రూ.32వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతోందన్నారు.

27న రగ్బీ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 9 గంటలకు నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మినీ సబ్ జూనియర్స్(అండర్-12) బాల, బాలికల జిల్లా రగ్బీ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి ఎస్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. 2012 జనవరి 1, 2014 డిసెంబరు 31 మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన జట్టను డిసెంబరు 1వ తేదీ నుంచి కావలిలో నిర్వహించే రాష్ట్ర పోటీలకు పంపుతామని తెలిపారు.

మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో ఐఆర్‌సీటీసీ రైల్ నీర్ బాట్లింగ్ ప్లాంట్ తాజాగా అందుబాటులోకి వచ్చింది. నవంబరు 7న అధికారికంగా ట్రయల్ రన్ నిర్వహించగా అది విజయవంతం కావడంతో ఆరోజు నుంచే ప్లాంట్‌లో అధికారికంగా ఉత్పత్తిని ప్రారంభించారు. దశాబ్దకాలంగా ఎదురు చూపులకే పరిమితమైన రైల్ నీర్ బాట్లింగ్ ప్లాంట్ ఎట్టకేలకు ప్రారంభమవడంతో స్టేషన్లలో రైలు ప్రయాణికులకు తక్కువ ధరకే స్వచ్ఛమైన మంచినీటి బాటిళ్లు అందుబాటులోకి వచ్చాయి.



ఎట్టకేలకు ప్రారంభం!

మల్లవల్లి ఐఆర్‌సీటీసీ రైల్ నీర్ బాట్లింగ్ ప్లాంట్‌లో ఉత్పత్తికి శ్రీకారం

- నవంబరు 7న ట్రయల్ రన్..విజయవంతం కావడంతో అదేరోజు నుంచి బాటిళ్ల ఉత్పత్తి
- దశాబ్దం కిందటే కేంద్ర బడ్జెట్‌లో ప్లాంట్ కేటాయింపు
- రూ.7 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు
- రోజుకు 72 వేల మంచినీటి బాటిళ్ల ఉత్పత్తి
- సికింద్రాబాద్ నుంచి రాజమండ్రి వరకు సరఫరా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/హనుమాన్‌జంక్షన్ రూరల్): స్పెషల్ ఎకనమిక్ జోన్(సెజ్) కింద ఏర్పడిన మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్(ఐపీ)లో భూములు తక్కువ ధరకు లభించడంతో ఐఆర్‌సీటీసీ రైల్ నీర్ బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారు. బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు గతంలో గుణ్‌రాజ్ అనే సంస్థ పనులు దక్కించుకున్నప్పటికీ ఆ సంస్థ దీని పనులు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరిచింది. పదేళ్ల కిందటే ఈ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినా దీన్ని ఏర్పాటు చేయటంలో అంతులేని తాత్సారం నడిచింది. గత అర్ధ సంవత్సర కాలంగా ఈ ప్రాజెక్టును ఐఆర్‌సీటీసీ అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దీనిపై శ్రద్ధ పెట్టారు. దీంతో అందుబాటులోకి రాగలిగింది. గుణ్‌రాజ్ సంస్థను వదిలించుకోవటానికి చాలా సమయం పట్టింది. ఆ సంస్థను చట్టబద్ధంగా వదిలించుకున్న తర్వాత 'మెహాయ్ ఆక్వా' సంస్థకు అప్పగించారు. మెహాయ్ ఆక్వా సంస్థ రంగంలోకి దిగాక పనులు ఊపందుకున్నాయి. ఐఆర్‌సీటీసీ అధికారుల పర్యవేక్షణలో మెహాయ్ ఆక్వా సంస్థ పనులను వేగవంతంగా చేపట్టింది. దీంతో బాట్లింగ్ ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొన్ని దశాబ్దాలుగా రైల్ నీర్ బాటిళ్లను దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ఇక నుంచి దిగుమతి చేసుకునే సమస్య లేకుండా పోయింది. విజయవాడ నుంచే ఎగుమతి చేయొచ్చు. మల్లవల్లిలోని ప్లాంట్ ద్వారా తెలంగాణలోని సికింద్రాబాద్ వరకు, మన రాష్ట్రంలో ఒంగోలు, నెల్లూరు, గుంటూరు, కాజీపేట, గూడూరు, రాజమండ్రి వరకు రైల్‌నీర్ బాటిళ్లను ఎగుమతి చేయొచ్చు. రైల్ నీర్ బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయటానికి ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం సర్వీసు (ఐఆర్‌సీటీసీ) వారు రూ.7 కోట్లు ఖర్చు చేసింది. ప్లాంట్ నిర్మాణ, నిర్వహణ పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించినా పర్యవేక్షణ మాత్రం ఐఆర్‌సీటీసీదే ఉంటుంది. ఐఆర్‌సీటీసీ పర్యవేక్షణలోనే ఈ ప్లాంట్ పనిచేస్తుంది. ప్లాంట్‌లో రక్షిత మంచినీటిని అందించేందుకు ల్యాబొరేటరీని ఏర్పాటు చేశారు. ఐఆర్‌సీటీసీ తరఫున ఒక బయాలజిస్టు ఈ ప్లాంట్‌లో పనిచేస్తారు. రోజూ ల్యాబ్‌లో మంచినీటిని పరీక్షిస్తారు.

ఇక చవకగా..స్వచ్ఛమైన రైల్ నీర్

మల్లవల్లిలో రైల్ నీర్ ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. ప్లాంట్ ప్రారంభించడం కోసం ఏడాదిగా ఎంతో శ్రమించాం. ఇన్నాళ్లూ మంచినీటి బాటిళ్లను దిగుమతి చేసుకున్నాం. ఇక నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తాం. స్వచ్ఛమైన నీటిని అందిస్తాం. నీటి నాణ్యతలో రాజీపడం. ల్యాబ్‌లో రోజూ నీటి శాంపిల్స్ తీసుకుని పరీక్ష చేయిస్తాం. మా బయాలజిస్టు ఒకరు అక్కడ ఉంటారు.

- రాజీ, ఐఆర్‌సీటీసీ మేనేజర్, విజయవాడ



వాటర్ బాటిళ్లను వ్యానులోకి ఎక్కిస్తున్న సిబ్బంది

రూ.15కే వాటర్ బాటిల్

మల్లవల్లి బాట్లింగ్ ప్లాంట్‌లో రోజూ 6 వేల కేసుల రైల్ నీర్ బాటిళ్లను ఉత్పత్తి చేస్తారు. లీటరు పరిమాణంతో కూడిన వాటర్ బాటిళ్లను ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్నారు. ఒక కేసులో 12 చొప్పున వాటర్ బాటిళ్ళు ఉంటాయి. అంటే రోజుకు 72 వేల బాటిళ్లను ఉత్పత్తి చేస్తారు. నెలకు 21.60 లక్షలు, సంవత్సరానికి 2.59 కోట్ల బాటిళ్లను ఉత్పత్తి చేయనున్నారు. మెహాయ్ ఆక్వా సంస్థ ఇక్కడి నుంచి బాటిళ్లను సరఫరా చేయటానికి అధీకృత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. వీరు సికింద్రాబాద్, ఒంగోలు, నెల్లూరు, గుంటూరు, కాజీపేట, గూడూరు, రాజమండ్రి రైల్వేస్టేషన్లకు సరఫరా చేస్తారు. రైల్వేస్టేషన్లలో రైల్ నీర్ బాటిళ్లను తక్కువ ధరకు అంటే రూ.15కే విక్రయించనున్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- అధికారులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశం



అధికారులకు ఆదేశాలిస్తున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కృష్ణలంక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీలు గ్రీవెన్స్ డే ద్వారా విన్నవించిన సమస్యలపై అలసత్వం వహించకుండా అధికారులు ఆ రోజే పరిష్కరించాలని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్ర వారం తుళ్లూరు సీఆర్‌డీఏ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ప్రవీణ్‌చంద్ సూచించారు. అమరావతిలో భూమి వ్యవహారాలపై-61, ప్రణాళికా విభాగం-2, అకౌంట్స్ అండ్ ఫైనాన్స్-1, డెవలప్‌మెంట్ ప్రమోషన్స్-5 సమస్యలు వచ్చాయని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాసనాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి.రామకృష్ణన్, డీసీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

దుర్గగుడిలో భక్తుల రద్దీ



కిటకిటాలడుతున్న క్యూలైన్లు

వన్‌టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శుక్రవారం కావడంతో దుర్గామల్లేశ్వర దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునుంచే భక్తులు క్యూలలో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. అమ్మవారి సుప్రభాతం అనంతరం దేవస్థానం అధికారులు అమ్మవారి దర్శనానికి అనుమతి ఇచ్చారు. ఉచిత, టికెట్ క్యూలు రద్దీగా కనిపించాయి. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఈవో కేఎస్ రామారావు ఆధ్వర్యంలో అధికారులు అమ్మవారి దర్శనం శీఘ్రంగా అయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. కొంతమంది పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు.

టూరిజం పాలసీ భేష్

- ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆమోదించిన టూరిజం పాలసీ భేషుగ్గా ఉందని, పెట్టుబడుదారులకు మరింత ఊతమిచ్చేలా ఉందని ఆంధ్రప్రదేశ్ అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని పేర్కొన్నారు. సూక్ష్మ పెట్టుబడిదారులకు రూ.25 లక్షలు, 10 కోట్లకు రూ.కోటి, రూ.50 కోట్లకు రూ.7.50 కోట్ల సబ్సిడీలను ఇస్తుందని ఆయన తెలిపారు. జీఎస్టీ రాయితీలు, ఇతర రాయితీలతో, ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ప్రభుత్వం పలు రాయితీలను ఇవ్వడానికి ముందుకు రావడం చాలా మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఫల, పుష్ప ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

మొగల్రాజపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్య నియంత్రణకు మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమని ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నగరపాలక సంస్థ, అర్బన్ గ్రీనరీ, ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25 వరకు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో నిర్వహించే ఫల, పుష్ప ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో గులాబీలు, చామంతులు, వివిధ రకాల పూలు, పండ్లమొక్కలు, అలంకరణ మొక్కలు, ఇండోర్, అవుట్‌డోర్‌లో పెంచుకునే మొక్కలు అందుబాటులో ఉంచామని రోజ్ సొసైటీ అధ్యక్షురాలు ఎస్.ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో శారదా కళాశాలల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు, రోజ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ

- ఎన్ఎంయూఏ నిర్ణయం

బస్‌స్టేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థలో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయిలో మహిళా కమిటీని ఏర్పాటు చేసేందుకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) నిర్ణయించింది. విజయవాడలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నాలుగు జోన్ల కమిటీలు, 26జిల్లాల కమిటీలు, నాన్ ఆపరేషన్ డివిజనల్ కమిటీల ప్రతినిధుల రాష్ట్రస్థాయి మహిళా సమావేశం నిర్వహించారు. 'మహిళా ఉద్యోగుల సాదకబాధకాలు, విధి నిర్వహణలో ఇబ్బందులు, ప్రభుత్వపరంగా రావాల్సిన సౌలభ్యాలు, సౌకర్యాలు, అన్ని కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యంపై చర్చించి తీర్మానాలు చేశారు. ఎండీకి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. మహిళా ఉద్యోగులకు శిశు సంరక్షణ సెలవు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంపైనా వినతి పత్రం ఇవ్వాలని తీర్మానించారు. రాష్ట్రస్థాయిలో మహిళా సదస్సు ఏర్పాటు చేసి మహిళా మంత్రులను, ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆహ్వానించాలని నిర్ణయించారు. మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సుజాతమ్మ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, కార్యదర్శి పురుషోత్తమనాయుడు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ నుంచి తాము పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి.మోహన్, మహిళా నాయకులు పద్మ, భద్రావతి హాజరయ్యారు.

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

రైతులకు మేలు చేసేలా పనిచేస్తా: ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

వన్‌టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'ఇరవై నాలుగేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో విజయాలు అందుకున్నా, కష్టాలు చూశా. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. రైతులకు మేలు చేసేలా పనిచేస్తా. గిడ్డంగుల నిర్మాణానికి కృషి చేస్తా. ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేస్తా.' అని రావి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణమండపంలో ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన పదవీ బాధ్యతలు తీసుకున్నారు. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా గుడివాడలో టీడీపీ జెండా ఎగురవేయటంలో రావి చేసిన కృషి మరువలేనిదని మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. రైతులకు మేలు చేసేలా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. టీడీపీకి రావి కుటుంబం చేసిన సేవ ఎనలేనిదని టీడీపీ జాతీయ కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. రావి వెంకటేశ్వరరావును పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంపీలు కేశినేని చిన్ని, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, బూరగడ్డ వేదవ్యాస్, సామినేని ఉదయభాను, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, నాగుల్‌మీరా, బీజేపీ నాయకుడు దావులూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.

రేషన్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

కారణం. అయితే, స్థానిక వ్యాపారులు ఎవరైనా రేషన్ బియ్యాన్ని కొనడం కానీ, అమ్మడం కానీ చేస్తే.. వారిపై షాడో ఎమ్మెల్యే ద్వారా కేసులు పెట్టిస్తున్నారు. ఎండీయూ సిబ్బందికి వీరులపాడు వ్యాపారి కిలోకు రూ.16 చెల్లిస్తుండగా, చందర్లపాడు వ్యాపారి మాత్రం రూ.14 ఇవ్వడంతో ఇటీవల షాడో ఎమ్మెల్యే వద్ద పంచాయితీ పెట్టారు. ఇందులో చందర్లపాడు వ్యాపారి విచిత్రమైన వాదనను లేవదీశారు. వీరులపాడు వ్యాపారి ఒక సర్కిల్ కార్యాలయాన్ని (కంచికచర్ల) మాత్రమే మేనేజ్ చేయాల్సి ఉంటుందని, తాను మాత్రం రెండు సర్కిల్ కార్యాలయాలు (నందిగామ, చందర్లపాడు), ఆర్డీవో, ఏసీపీ కార్యాలయాలను మేనేజ్ చేయాల్సి ఉంటుందని, అందుకే తాను తక్కువ చెల్లించాల్సి వస్తుందని చెప్పినట్లు సమాచారం. ఈ రేషన్ దందా షాడో నేతృత్వంలో నడుస్తుండటంతో అధికార పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలు నోరు మెదపలేకపోతున్నారు. అడ్డుకున్నా, ప్రశ్నించినా వారికి వేధింపులు తప్పడం లేదు.

అధికారులేం చేస్తున్నారు..?

ఆర్డీవో, ఏసీపీ కార్యాలయాలు ఉన్న నందిగామ నియోజకవర్గంలో భారీ ఎత్తున రేషన్ బియ్యం దందా నడుస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వీరి నిర్వాకం కారణంగా.. పౌరసరఫరాల శాఖ మంత్రి నేరుగా రంగంలోకి దిగి పరిటాలలో అక్రమంగా తరలిపోతున్న బియ్యం పట్టుకోవాల్సి వచ్చింది. స్వయంగా మంత్రి దాడులు చేసినా ఏమాత్రం భయం లేకుండా అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో యథేచ్ఛగా మట్టి, ఇసుక, రేషన్ బియ్యం దోపిడీతో పాటు కాంట్రాక్టర్ల వద్ద నుంచి వైసీపీ నాయకులు భారీగా ముడుపులు అందుకున్నారు. వారి అక్రమాలను అరికట్టేందుకు పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు పోరాడారు. కేసులు కూడా ఎదుర్కొన్నారు. ఆ సమయంలో వారిని నిలువరించలేకపోయినా, వారి దోపిడీని మాత్రం క్షేత్రస్థాయిలోని ప్రజలకు తెలియజేయ గలిగారు. తాజాగా అవే పరిస్థితులు పునరావృత్తం అవుతుండటంతో టీడీపీ, జనసేన శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

మూడు వారాల్లో.. 50 లక్షల మందికి ఉచిత గ్యాస్

- దీపం-2 పథకంపై కావాలనే జగన్ దుష్ప్రచారం: మంత్రి నాదెండ్ల మనోహర్



మహిళకు గ్యాస్ సిలెండర్‌ను అందిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన దీపం-2 పథకంలో లబ్ధిపొందిన వారిసంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కృష్ణలంకలో శుక్రవారం నిర్వహించిన దీపం-2 ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి మనోహర్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. లబ్ధిదారు ఎం.కోటేశ్వరమ్మ కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. దీపావళి పండుగ రోజు సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో లాంఛనంగా ప్రారంభించిన దీపం-2 పథకం విజయవంతంగా అమలవుతోం దని మంత్రి మనోహర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.55 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కావాలనే దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గ్యాస్ కనెక్షన్ల సంఖ్యపై అవగాహన లేకుండా 1.85 కోట్ల కనెక్షన్లు అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతు న్నారన్నారు. మూడు గ్యాస్ కంపెనీలు అందించిన సమాచారం మేరకు రాష్ట్రంలో 1,55,00,200 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ పథకం అందేలా రూ.894 కోట్ల అడ్వాన్స్‌ను గ్యాస్ కంపెనీలకు అందజేశామన్నారు. దీపం-2 పథకంపై ఇప్పటివరకు 521 ఫిర్యాదులు అందాయని, కార్యక్రమం అమలులో పారదర్శకతే దీనికి నిదర్శనమని అన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటల్లోనే నిధులు జమ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పౌరసరఫ రాల కార్పొరేషన్ వీసీ, ఎండీ జి.వీరపాండ్యన్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, ఆర్డీవో చైతన్యపాల్గొన్నారు.

వెల్లుల్లి.. కల్తీ లొల్లి

(5వ పేజీ తరువాయి)

హోల్‌సేల్ మార్కెట్లకు వెల్లుల్లి సరఫరా అవుతుంది. వాటిని నాటు వెల్లుల్లిగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం కిలో వెల్లుల్లి ధర రూ.300 నుంచి రూ.400 ఉంది. ధర ఈస్థాయిలో పెరగడానికి రైతులు పంట విరామం ప్రకటించడమే ప్రధాన కారణం. గడిచిన ఏడాది కిలో వెల్లుల్లి రూ.20-25 పలికింది. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు పంట సాగు చేయడం మానేశారు. ఫలితంగా దిగుబడి తగ్గిపోయింది. విజయవాడ, గుంటూరు హోల్‌సేల్ మార్కెట్లలోకి వెల్లుల్లి సరఫరా పడిపోయింది. డిమాండ్‌కు తగినట్టుగా లేకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఈ పరిణామాలను వ్యాపారులు అనుకూలంగా మార్చుకోవడానికి, కాసులు వెనుకేసుకోవడానికి మరల్చుకున్నారు. తక్కువ ధరకు సరుకును దిగుమతి చేసుకుని దేశీయంగా ఉన్న ధరకు విక్రయిస్తున్నారు. తెగుళ్ల సోకిన వెల్లుల్లితో కాసులు వెనకేసుకుంటున్నారు. విజయవాడ హోల్‌సేల్ మార్కెట్‌కు ఏడాదికి 7,200 టన్నుల దేశీయ వెల్లుల్లి దిగుమతి అవుతోంది. ఇదంతా మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి జరుగుతోంది.

నిషేధం ఉన్నా అమ్మకాలు

దేశీయ వెల్లుల్లి మొత్తం తెలుపు రంగులో ఉంటుంది. తొక్కతో పాటు పాయలో ఉండే రెమ్మలు కూడా తెల్లగా ఉంటాయి. అలాకాకుండా తెలుపు, ఎరుపు, గులాబీ రంగు ఉన్నవి చైనా వెల్లుల్లిగా పేర్కొంటారు. ఈ చైనా వెల్లుల్లిపై కేంద్ర ప్రభుత్వం 2014లో నిషేధం విధించింది. ఇది ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం వెల్లుల్లికి మంచి ధర పలుకుతుండటంతో వ్యాపారులు చైనా వెల్లుల్లిని రహస్యంగా దిగుమతి చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం కస్టమ్స్ అధికారులు జాతీయ రహదారులపై నిఘా పెట్టి రూ.21.97 లక్షల విలువ చేసే చైనా వెల్లుల్లిని సీజ్ చేశారు. బిహార్‌లోని జహంపూర్ నుంచి ఈ చైనా వెల్లుల్లి వివిధ రాష్ట్రాలకు సరఫరా అవుతున్నట్టు గుర్తించారు. చైనాలో సాగవుతున్న వీటిపై అనేక అనుమానాలు ఉన్నాయి.

పొడి తెగులు ఉన్నట్టు నిర్ధారణ

చైనా వెల్లుల్లి ఉపయోగించడం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. కస్టమ్స్ అధికారులు సీజ్ చేసిన వెల్లుల్లిని పరీక్షలనిమిత్తం ప్రయోగశాలకు పంపారు. ఈ వెల్లుల్లికి ఎంబెల్లిసియా అల్లి (పొడి తెగులు) సోకినట్టు నిర్ధారణైంది. ఈ వెల్లుల్లి రెమ్మలను, తొక్కలను చెత్తడబ్బాలో వేసినప్పుడు.. సేంద్రీయ ఎరువుగా మారాల్సిన చెత్తపై తెగులు ప్రభావం పడిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాటిని భూమిపై వేసినా ఆ ప్రభావం ఉంటుందంటున్నారు. సాధారణంగా రైతులు చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చుకుంటున్నారు. ఎంబెల్లిసియా అల్లి సోకిన వెల్లుల్లి చెత్తలో ఉంటే సేంద్రీయతత్వం పోతుందని స్పష్టం చేస్తున్నారు.

సీనియారిటీని పట్టించుకోకుండా

పదోన్నతులా?

» డైరెక్ట్ రిక్రూటీలకు ప్రమోషన్లా?.. తప్పుపట్టిన హైకోర్టు

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ పదోన్నతుల్లో సీనియారిటీ ఉన్న వారిని పక్కనబెట్టడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. పదోన్నతిపై 1993-95 మధ్య అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈ) అయినవారిని పక్కనపెట్టి 1997లో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా నేరుగా నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు తాత్కాలిక పదోన్నతి(అడ్‌హాక్) కల్పించడాన్ని ప్రశ్నించింది. డైరెక్ట్ రిక్రూటీలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(డీఈఈ)లుగా పదోన్నతి కల్పించేందుకు వీలుగా గత వైసీపీ ప్రభుత్వం 2021 అక్టోబర్ 5న జారీ చేసిన జీవో 71ని కొట్టివేసింది. ఆ జీవో ఆధారంగా డైరెక్ట్ రిక్రూటీలకు అడ్‌హాక్ పదోన్నతి కల్పిస్తూ పంచాయితీరాజ్‌శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను కూడా రద్దు చేసింది. ఏఈఈలుగా పదోన్నతి నాటి నుంచి సీనియారిటీ, తదనంతర ప్రయోజనాలు పొందేందుకు పిటిషనర్లు అర్హులని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ఈ నెల 15న తీర్పు ఇవ్వగా.. ఆ ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది.

సీనియర్లకు ప్రయోజనాలు కల్పించకపోవడాన్ని సమర్థించలేం

ఏపీపీఎస్సీ 1997లో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా పంచాయితీరాజ్ శాఖలో ఏఈఈగా ఎంపికైన ఉద్యోగులకు డీఈఈలుగా పదోన్నతి కల్పించేందుకు వీలుగా అప్పటి వైసీపీ ప్రభుత్వం 2021 అక్టోబరులో జీవో 71 జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ పదోన్నతిపై ఏఈఈ అయిన పలువురు ఉద్యోగులు 2021లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు ఇటీవల తుది విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 71ని హైకోర్టు 2021 అక్టోబరు 28న సస్పెండ్ చేసిందన్నారు. పదోన్నతుల విషయంలో యథాతథస్థితి పాటించాలని సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో సీనియారిటీ, ఇతర ప్రయోజనాల కల్పనకు సంబంధించి ప్రభుత్వం 2006లో ఇచ్చిన జీవో 262, 2011లో ఇచ్చిన జీవో 334 ఉనికిలో ఉన్నాయన్నారు. పిటిషనర్లకు 1994 నుంచి సీనియారిటీ, ఇతర ప్రయోజనాలు కల్పించాలని ఆ జీవోల్లో స్పష్టంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పిటిషనర్లను పక్కనపెట్టి 1997 ఏపీపీఎస్సీ ద్వారా రిక్రూట్ అయిన ఏఈఈలకు డీఈఈగా అడ్‌హాక్ పదోన్నతి కల్పించడం చెల్లుబాటు కాదన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం డైరెక్ట్ రిక్రూటీలకు మరో పదేళ్ల సర్వీసు ఉందని గుర్తు చేసింది. అయితే పిటిషనర్లు గత 25-30 ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపింది. పదోన్నతిపై ఏఈఈ అయినవారిలో 50 శాతం మంది పదవీ విరమణ చేశారని పేర్కొంది. మిగిలినవారు మరో రెండేళ్లలో రిటైర్ కాబోతున్నారని తెలిపింది. ఏవిధంగా చూసినా పిటిషనర్లకు సీనియారిటీ ప్రయోజనాలు కల్పించకపోవడాన్ని సమర్థించలేమంది. సీనియారిటీ ప్రయోజనాలు పొందేందుకు పిటిషనర్లు అన్నివిధాలా అర్హులని స్పష్టం చేసింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఎలాంటి అధికారం లేకున్నా డైరెక్ట్ రిక్రూటీలకు పదోన్నతి కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 71 జారీ చేసిందని పేర్కొంది. ఆ జీవోను కొట్టివేయడంతోపాటు దాని ఆధారంగా డైరెక్ట్ రిక్రూటీలకు డీఈఈలుగా అడ్‌హాక్ పదోన్నతి కల్పిస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

విజయవాడ, విశాఖ

మెట్రో డీపీఆర్‌కు ఆమోదం

పూర్తిఖర్చు కేంద్ర ప్రభుత్వానిదే!.. సర్కారు సరికొత్త ప్రతిపాదన .. రాష్ట్రానికి 42 వేల కోట్ల ఉపశమనం



విజయవాడ/అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుల పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. తొలిదశ పనులు చేపట్టడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుల ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించేలా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ చేసిన ప్రతిపాదనలకు కూడా సర్కారు ఆమోదముద్ర వేసింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కేంద్రానికి పంపించింది. ఏపీ మెట్రోరైల్ ప్రాజెక్టుల రెండింటిలో ఒకటి రాష్ట్ర విభజన చట్టాన్ని అనుసరించి నూరుశాతం ఖర్చు భరించేలా, రెండోది నూతన మెట్రో పాలసీలో భాగంగా కేంద్రం పొందుపరిచిన కీలకమైన 'క్లాజ్'ను ప్రాతిపదికగా తీసుకుని పూర్తి ఖర్చు భరించేలా ఈ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పూర్తి ఖర్చు కేంద్రానిదే..!

రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. దీనిలోని 13వ సెక్షన్‌లో విజయవాడలో మెట్రో రైల్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్రం పూర్తి సహకారాన్ని అందిస్తానని పేర్కొంది. దీని ప్రకారం నిధులను నూరుశాతం కేంద్రమే భరించాలి. ఇక నూతన మెట్రో పాలసీలో రాష్ట్రాల్లోని ఏ నగరంలో అయినా అవసరమని భావిస్తే ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండానే కేంద్రం మెట్రో ప్రాజెక్టులను నిర్మించే అవకాశం ఉంటుంది. దీనికి నూరుశాతం నిధులను కేంద్రమే భరిస్తుంది. 40 లక్షల జనాభా కలిగిన విశాఖ నగరంలో మెట్రో ఏర్పాటును కేంద్రం ప్రత్యేకంగా తీసుకోవచ్చు. ఈ రెండు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని విజయవాడ, విశాఖ మెట్రోల ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించేలా ప్రతిపాదనలను రూపొందించారు. దీని ఫలితంగా రెండు మెట్రో ప్రాజెక్టుల పూర్తి ఖర్చు 42,362 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వానికి తగ్గనుంది.

తొలిదశ మెట్రో కారిడార్ల ఏర్పాటు

కేంద్రం నుంచి అనుమతులు రాగానే తొలిదశ మెట్రో పనులు ప్రారంభించటానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ సిద్ధంగా ఉంది. కారిడార్-1లో భాగంగా విజయవాడలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్(పీఎన్‌బీఎస్) నుంచి గన్నవరం వరకు 25.95, కారిడార్-2లో పీఎన్‌బీఎస్ నుంచి బందరు రోడ్డు మీదుగా పెనమలూరు వరకు 12.45, చొప్పున మొత్తంగా 38.40 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టాలని భావిస్తోంది. విశాఖపట్నంలో కారిడార్-1లో భాగంగా స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34.40, కారిడార్-2లో గురుద్వార్ నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07, కారిడార్-3లో తాటిచెట్లపాలెం నుంచి చిన వాల్తేరు వరకు 6.75 కిలోమీటర్ల చొప్పున మొత్తం 46.23 కిలోమీటర్ల మేర తొలిదశ పనులు చేపట్టనుంది. కేంద్రం నుంచి అనుమతులు రాగానే, విజయవాడ, విశాఖ నగరాల్లో ఎంఏయూడీ, కార్పొరేషన్, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలతో కమిటీలు ఏర్పాటు చేస్తారు. కారిడార్ల మార్గంలో ఆయా శాఖలు తక్షణం చేయాల్సిన పనులకు సంబంధించి చర్చిస్తారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఆయా శాఖలు పనులు ప్రారంభిస్తాయి. భూసేకరణ ప్రతిపాదనలు గతంలోవే కాబట్టి.. మెట్రో స్టేషన్లకు సేకరణ పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. సెంట్రల్ డివైడర్ పైపిల్లర్ల పనులకు ఇబ్బందులు లేవు కాబట్టి.. భూసేకరణ జరిగే వరకు వేచి చూడకుండా, టెండర్లు పిలిచి పనులు అప్పగించనున్నారు.

విద్యుత్ తీగలు కనిపించకుండా..!

మెట్రో ప్రాజెక్టులు అనగానే విద్యుత్ తీగలు కనిపిస్తుంటాయి. అయితే రాష్ట్రంలో థర్డ్‌లైన్ విధానాన్ని అనుసరించాలని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ భావిస్తోంది. ఈ విధానంలో ట్రాక్ నుంచే విద్యుత్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తీగలు ఎక్కడా కనిపించవు.

కేంద్రం ఓకే అనగానే విశాఖ మెట్రో పనులు

విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టుపై పూరిస్థాయి ప్రాజెక్టు నివేదికను కేంద్రానికి పంపామని పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. కేంద్ర నుంచి అనుమతి రాగానే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామన్నారు. వంద శాతం నిధులు కేంద్రమే భరించేలా నిర్మాణం చేపట్టాలని కోరినట్టు తెలిపారు. తొలిదశలో 46.2 కిలోమీటర్లతో మూడు కారిడార్ల నిర్మాణం ఉంటుందన్నారు.

'ఎన్‌డీబీ' రోడ్ల పనులు మొదలు

» పర్యవేక్షించిన ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్ రెడ్డి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) నిధులతో రాష్ట్రంలో చేపట్టిన రహదారుల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. మంత్రి లోకేశ్ నేతృత్వం వహిస్తోన్న మంగళగిరిలో ఎన్‌డీబీ పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. గుంటూరు జిల్లాలో రూ.120 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే రూ.51.06 కోట్ల పనులు మొదలయ్యాయి. ఎన్‌డీబీ పనులపై ప్రతి పక్షం రోజులకోసారి సమీక్ష నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

గత ప్రభుత్వంలో సాగని పనులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రానికి ఎన్‌డీబీ ప్రాజెక్టు మంజూరైంది. రాష్ట్రంలో రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం 6,400 కోట్లను సింగపూర్‌కు చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే ఆతర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ముందుకు సాగలేదు. కాంట్రాక్టర్ల డిమాండ్లు, సమస్యలను జగన్ సర్కారు పట్టించుకోలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. పైగా, ఎన్‌డీబీ ఇచ్చిన రూ.500 కోట్లను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించింది. దీంతో ఈ ప్రాజెక్టును ఎన్‌డీబీ నిలిపివేసింది. కూటమి సర్కారు వచ్చాక ఎన్‌డీబీతో సంప్రదింపులు జరిపి, ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించింది. కాంట్రాక్టర్లు కోరిన మేరకు సీనరేజీ మినహాయింపు, ఇసుక, గ్రావెల్ సరఫరాకు ప్రభుత్వం అంగీకరించింది. మంత్రి చొరవతో తొలి విడత నిధులు రూ.250 కోట్లు విడుదలయ్యాయి. దీంతో శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌డీబీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి.

అన్ని కేసులు కలిపి విచారించండి: సజ్జల భార్గవ్‌రెడ్డి

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సామాజిక మధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో గుడివాడ, కదిరి రూరల్, భీమవరం పోలీసులు వేర్వేరుగా నమోదు చేసిన మూడు కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జ్ సజ్జల భార్గవ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు వచ్చాయి. పిటినర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఇదే వ్యవహారంతో ముడిపడి ఉన్న మరో రెండు కేసులు లిస్ట్ కాలేదన్నారు. ప్రస్తుత వ్యాజ్యాలతోపాటు వాటిని కూడా జత చేసి విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు విచారణను ఈనెల 27కి వాయిదా వేశారు.

ఆర్జీవీపై కేసుల పూర్తి వివరాలు ఇవ్వండి: హైకోర్టు

సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టారనే ఆరోపణలతో అనకాపల్లి జిల్లా రావికమతం పోలీసులు, గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన రెండు కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు వచ్చాయి. ఆర్జీవీ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఇదే వ్యవహారంపై దాఖలైన మరో కేసు ఈనెల 26న విచారణకు వస్తుందన్నారు. ప్రస్తుత ముందస్తు బెయిల్ పిటిషన్లు కూడా ఆ వ్యాజ్యానికి జత చేయాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కేసులకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ పిటిషన్లపై విచారణను ఈనెల 26కి వాయిదా వేశారు.

నాకు రక్షణ కల్పించండి: సునీల్ యాదవ్

బి.కొత్తకోట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'బలమైన వర్గం నుంచి నాకు ప్రాణహాని ఉంది. ప్రభుత్వం రక్షణ కల్పించాలి' అని వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-2గా ఉన్న సునీల్ యాదవ్ అభ్యర్థించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో టీడీపీ నేత సురేశ్‌యాదవ్ నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '39 నెలలపాటు కడప, హైదరాబాద్‌లో జైళ్లలో ఉన్నా. న్యాయస్థానాలు, వ్యవస్థపై నాకు నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. జైలు జీవితం గడిపినప్పుడు చాలా పశ్చాత్తాప పడ్డా' అని అన్నారు.

వర్రా పోలీస్ కస్టడీ పిటిషన్ 26కు వాయిదా

కడప రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా జిల్లా సహ సమన్వయకర్త వర్రా రవీంద్రరెడ్డిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ వేసిన పిటిషన్‌పై తీర్పు 26వ తేదీకి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 20న కడప ఎస్సీ, ఎస్టీ కోర్టులో వాదనలు జరిగాయి. తదుపరి ఉత్తర్వులకు 22వ తేదీకి వాయిదా వేశారు. అయితే శుక్రవారం జడ్జి సెలవులో ఉండడతో ఇన్‌చార్జి న్యాయాధికారి కేసును 26కు వాయిదా వేశారు. ఇదే కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సైతం 26కు వాయిదా వేశారు.

పోలీసుల ముందుకు ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ఒంగోలు క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన కేసులో ముదిరెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒంగోలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యాడు.

నందిగం బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ నందిగం సురేశ్ బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. నందిగం బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసని, ఘటన జరిగిన ప్రదేశంలో సురేశ్ లేరని వాదించారు. వాదనల అనంతరం ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

మార్కెట్లో కొనుగోళ్ల జాతర

స్టాక్ సూచీలు రయ్ రయ్.. సెన్సెక్స్ ఒక దశలో 2,062 పాయింట్లు అప్

- చివరికి 1,961 పాయింట్ల లాభంతో 79,000 ఎగువన ముగిసిన సూచీ
- 557 పాయింట్ల వృద్ధితో 23,900కి నిఫ్టీ
- గడచిన 5 నెలల్లో సూచీలకిదే అతిపెద్ద లాభం
- రూ.7.32 లక్షల కోట్లు పెరిగిన సంపద



ముంబై: ఏడు వారాలుగా బేర్ బిగిపట్టుతో ఉక్కిరిబిక్కిరైన స్టాక్ మార్కెట్‌కు భారీ ఊరట లభించింది. మెరుపు వేగంతో దూసుకొచ్చిన బుల్ రంకెల శబ్దం విని బేర్ తుర్రుమంది. దాంతో ట్రేడర్లు దలాల్ స్ట్రీట్‌లోకి మళ్లీ పరుగెత్తుకొచ్చారు. అదానీ లంచం కేసు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ భయాలను సైతం పక్కన పెట్టి అమితోత్సాహంతో కొనుగోళ్లు జరుపడంతో ప్రామాణిక సూచీలు రివ్వున ఎగిశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 2,062.4 పాయింట్లు పెరిగి 79,218.19 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1,961.32 పాయింట్ల (2.54 శాతం) లాభంతో 79,117.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 557.35 పాయింట్ల (2.39 శాతం) వృద్ధితో 23,907.25 వద్ద ముగిసింది. గడిచిన ఐదు నెలల్లో సూచీలకిదే అతిపెద్ద ఒక్క రోజు లాభం. కొనుగోళ్ల జోరుతో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.7.32 లక్షల కోట్లకు పైగా పెరిగి 432.71 లక్షల కోట్లకు (5.12 లక్షల కోట్లు) చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

● సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లూ రాణించాయి. ఎస్‌బీఐ 4.51 శాతం, టీసీఎస్ 4.13 శాతం, టైటాన్ 4.10 శాతం లాభంతో సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.49 శాతం ఎగబాకగా.. ఇన్ఫోసిస్, ఐటీసీ, ఎల్ అండ్ టీ, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 3 శాతానికి పైగా పుంజుకున్నాయి.

● క్రితం సెషన్‌లో ఆల్‌టైం రికార్డు స్థాయికి పతనమైన రూపాయి కాస్త తేరుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.84.41 వద్ద ముగిసింది.

మార్కెట్ ర్యాలీకి కారణాలివే..

● మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ సర్వేలు బీజేపీ విజయ సంకేతాలివ్వడం మార్కెట్ వర్గాల్లో జోష్ పెంచింది.

● ఇప్పటికే ప్రామాణిక సూచీలు 10 శాతానికి పైగా క్షీణించిన నేపథ్యంలో ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్న నాణ్యమైన స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు వాల్యూ బైయింగ్‌కు పాల్పడ్డారు. పీఎస్‌యూ బ్యాంకింగ్ సహా పలు రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరిగాయి.

● జపాన్‌లో అక్టోబరు నెలకు ద్రవ్యోల్బణం తగ్గడంతో పాటు ఆ దేశం 39 లక్షల కోట్ల యెన్‌ల ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించడం వంటి అంతర్జాతీయ సానుకూల సంకేతాలు సైతం కలిసివచ్చాయి.

● అమెరికాలో నిరుద్యోగిత రేటు 7 నెలల కనిష్ఠానికి తగ్గిన నేపథ్యంలో అక్కడి మార్కెట్ మళ్లీ పుంజుకుంటోందన్న అంచనాల నేపథ్యంలో ఐటీ రంగ షేర్లకు డిమాండ్ ఊపందుకుంది.

● విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల అమ్మకాల తీవ్రత తగ్గుముఖం పట్టడం. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో నిరాశపర్చిన కార్పొరేట్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు.. మూడు, నాలుగు త్రైమాసికాల్లో మళ్లీ మెరుగుపడవచ్చన్న అంచనాలూ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను పెంచాయి.

1,00,000 డాలర్లకు చేరువలో బిట్‌కాయిన్

ప్రముఖ క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ వాయువేగంతో దూసుకెళ్తోంది. తాజాగా ఈ వర్చువల్ కరెన్సీ 1,00,000 డాలర్లకు చేరువైంది. బిట్‌కాయిన్ విలువ ఒకదశలో 99,525 డాలర్లు పలికింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంతో క్రిప్టో మార్కెట్లో మళ్లీ సందడి మొదలైంది. గడిచిన రెండు వారాల్లో బిట్‌కాయిన్ విలువ ఏకంగా 40 శాతం పెరిగింది. ఎందుకంటే, అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు.

మిశ్రమంగా ముగిసిన అదానీ షేర్లు

గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై అమెరికాలో లంచం కేసు నమోదైన నేపథ్యంలో గురువారం కుప్పకూలిన అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు వారాంతం ట్రేడింగ్‌లో మాత్రం మిశ్రమంగా ముగిశాయి. అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.16 శాతం, అదానీ పోర్ట్స్ 2.05 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 1.18 శాతం, అంబుజా సిమెంట్స్ 3.50 శాతం, ఏసీసీ 3.17 శాతం, ఎన్‌డీటీవీ 0.65 శాతం పెరిగాయి. కాగా, అదానీ గ్రీన్ ఎనర్జీ మరో 8.20 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 6.92 శాతం, అదానీ పవర్ 3.23 శాతం, అదానీ విల్మర్ 0.73 శాతం క్షీణించాయి.

సెన్సెక్స్‌లోకి జొమాటో

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సేవలందించే జొమాటో షేరు వచ్చే నెల 23 నుంచి బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్‌లో భాగం కానుంది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ స్థానాన్ని జొమాటో భర్తీ చేయనుంది. సూచీలోని షేర్ల తాజా పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ సర్దుబాటు జరిగింది.

వెండి ఈటీఎఫ్‌ల్లోకి నిధుల వరద

ఏడాది కాలంలో నాలుగింతలైన పెట్టుబడులు

సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)కు ఈ మధ్య కాలంలో ఆదరణ భారీగా పెరిగింది. ఈ అక్టోబరుతో ముగిసిన ఏడాది కాలంలో సిల్వర్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) మొత్తం విలువ నాలుగింతల వృద్ధితో రూ.12,331 కోట్లకు చేరుకుంది. ధరాఘాతం, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు బంగారంతోపాటు వెండినీ భద్రమైన పెట్టుబడి సాధనంగా భావిస్తుండటం ఇందుకు ప్రధాన కారణమని ఇక్రా అనలిటిక్స్ పేర్కొంది. 2022లో ప్రారంభమైన సిల్వర్ ఈటీఎఫ్‌లపై రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతూ వస్తోందని ఇక్రా అంటోంది. 2023 అక్టోబరులో సిల్వర్ ఈటీఎఫ్‌లో పెట్టుబడులు కలిగిన ఇన్వెస్టర్ల సంఖ్య 1.42 లక్షలుగా ఉండగా.. ఏడాది కాలంలో 215 శాతం పెరిగి ఈ అక్టోబరు నాటికి 4.47 లక్షలకు చేరుకుంది. ఇదే కాలంలో నికర పెట్టుబడులు కూడా 24 శాతం వృద్ధితో రూ.643.10 కోట్లకు పెరిగాయని ఇక్రా వెల్లడించింది.

మళ్లీ రూ.80,000 పైకి బంగారం

దేశీయంగా బంగారం, వెండి ధరలు మరింత ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,100 పెరిగి రూ.80,400కు చేరుకుంది. కిలో వెండి రూ.300 పెరుగుదలతో రూ.93,300 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి రేట్లు పెరగడంతో పాటు రూపాయి మారకం విలువ పతనం ఇందుకు కారణం. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతల పెరిగిన నేపథ్యంలో అనిశ్చితిలో భద్రమైన పెట్టుబడి సాధనమైన బులియన్‌కు డిమాండ్ మళ్లీ పెరిగింది.

4 నెలల కనిష్ఠానికి ఫారెక్స్ నిల్వలు

భారత్ వద్దనున్న విదేశీ మారకం నిల్వలు భారీగా క్షీణించి 4 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఈనెల 15తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు ఏకంగా 1,776.1 కోట్ల డాలర్ల తగ్గుదలతో 65,789.2 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆర్‌బీఐ వెల్లడించింది. సెప్టెంబరు చివర్లో నిల్వలు ఆల్‌టైం రికార్డు స్థాయి 70,488.5 కోట్ల డాలర్లకు పెరిగాయి. కానీ, ఆ తర్వాత వరుసగా 7 వారాలుగా తగ్గుతూ వస్తున్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం, రూపాయి మారకం విలువ క్షీణత వంటి అంశాలు ఇందుకు కారణం.

టెలికాం రంగానికి సైబర్ సెక్యూరిటీ నిబంధనలు జారీ

న్యూఢిల్లీ: భారత కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, సర్వీసులను సంరక్షించే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త టెలికాం చట్టం కింద టెలికాం సైబర్ సెక్యూరిటీ నిబంధనలు నోటిఫై చేసింది. తమ నెట్‌వర్క్‌పై భద్రతాపరమైన సంఘటనలు సంభవిస్తే వాటిని వెల్లడించడానికి నిర్దిష్ట కాలపరిమితిని ప్రభుత్వం నిర్దేశించింది. కేంద్ర ప్రభుత్వం లేదా దాని అధీకృత సంస్థ టెలికాం సంస్థల నుంచి ట్రాఫిక్ డేటా, ఇతర డేటా సేకరించడానికి అధికారాలు ఈ నిబంధనల ద్వారా సంక్రమిస్తాయి. సెక్యూరిటీ రక్షణలు, రిస్క్ మేనేజ్‌మెంట్ చర్యలు, కార్యాచరణలు, శిక్షణ, నెట్‌వర్క్ టెస్టింగ్, రిస్క్ అసెస్‌మెంట్ సహా సైబర్ సెక్యూరిటీ విధానంలోని పలు అంశాలను టెలికాం సంస్థలు అమలుపరచాల్సి ఉంటుంది. ప్రతి టెలికాం కంపెనీ వీటి కింద నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఎయిరిండియాలో మెయింటెనెన్స్ శిక్షణా సంస్థ

ముంబై: ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ (ఏఎంఈ) గ్రాడ్యుయేట్లకు విమాన మెయింటెనెన్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు ప్రాథమిక మెయింటెనెన్స్ శిక్షణా సంస్థ (బీటీఎంఓ) ఏర్పాటు చేయనున్నట్లు ఎయిరిండియా తెలిపింది. 2026 మధ్య కాలం నుంచి ఇది అమల్లోకి వస్తుంది. బెంగళూరులోని ఎంఆర్ఓ కేంద్రానికి చేరువలోనే బీటీఎంఓ ఏర్పాటవుతుంది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ బెంగళూరు ఎయిర్‌పోర్ట్ సిటీ లిమిటెడ్‌తో (బీఏసీఎల్) ఈ మేరకు ఎయిరిండియా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రోగ్రామ్ కాలపరిమితి రెండు సంవత్సరాలు. కాగా మరో రెండు సంవత్సరాలు ఎంఆర్ఓలో శిక్షణ ఇస్తారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,820 ▲	72,250 ▲	1.01.000 ▲
ముంబై	77,787 ▲	71,253 ▲	90,850 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (వెక్ 100 గుడ్లు)

23వ తేదీ

హైదరాబాద్	570	విజయవాడ	585
వరంగల్	572	గోదావరి	585
చిత్తూరు	593	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	87
కర్నూలు	107	నెల్లూరు	87
విశాఖపట్నం	120	అనంతపురం	87
గోదావరి	108		

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి రూ.42,500 కోట్ల ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల నుంచి ల్యాప్‌టాప్స్ వరకు వివిధ రకాలైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అవసరమైన విడి భాగాలు దేశంలోనే తయారుచేసే కంపెనీలకు ప్రభుత్వం 500 కోట్ల డాలర్ల (రూ.42,500 కోట్లు) ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇద్దరు అధికారులు తెలిపారు. మంచి వృద్ధి అవకాశాలున్న పరిశ్రమను ప్రోత్సహించడంతో పాటు చైనా దిగుమతులకు అడ్డుకట్ట వేయడం దీని లక్ష్యం. యాపిల్, సామ్‌సంగ్ వంటి ప్రపంచ శ్రేణి సంస్థలు అందించిన మద్దతు కారణంగా గత ఆరు సంవత్సరాల కాలంలో దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రెట్టింపై ఇప్పుడు 11,500 కోట్ల డాలర్లకు (రూ.9.77 లక్షల కోట్లు) చేరింది. స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తిలో భారత్ ఇప్పుడు ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉంది. అయితే ఆ రంగం విడిభాగాల కోసం చైనా దిగుమతుల పైనే అధికంగా ఆధారపడి ఉందన్న విమర్శలు ఎదుర్కొంటోంది. కాగా కొత్త పథకం కింద ఇవ్వనున్న ప్రోత్సాహకాలను రెండు, మూడు నెలల్లో ప్రారంభించనున్నట్లు సమాచారం. కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ ప్రణాళిక ఎలక్ట్రానిక్ విడిభాగాలు ప్రోత్సాహకాలకు అర్హమైనవిగా గుర్తించింది.

ఓలా ఎలక్ట్రిక్‌లో 500 ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా వివిధ విభాగాల్లో, వివిధ హోదాల్లో పని చేస్తున్న 500 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తోంది. సెప్టెంబరులోనే ఉద్యోగాల కోత ప్రారంభమైంది. ఈ ప్రక్రియ మొత్తం ఈ నెలాఖరుకు పూర్తి కావచ్చని దీంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి.

రూ.2,975 కోట్ల సేకరణ

జెప్టో

న్యూఢిల్లీ: తాజా రౌండ్‌లో 35 కోట్ల డాలర్ల (రూ.2,975 కోట్లు) నిధులు సమీకరించినట్లు క్విక్ కామర్స్ విభాగంలోని జెప్టో ప్రకటించింది. భారత స్టార్టప్ వ్యవస్థలో దేశీయంగా ఇంత భారీ స్థాయిలో నిధులు సమీకరించడం ఇదే ప్రథమమని తెలిపింది. మోతీలాల్ ఓస్వాల్ ప్రైవేట్ వెల్త్ విభాగం ఈ నిధుల సమీకరణ ప్రక్రియను నిర్వహించింది. హెచ్ఎన్ఐలు, కుటుంబ కార్యాలయాలు, అగ్రగామి ఆర్థిక సంస్థలు ఈ రౌండ్ నిధుల సమీకరణలో పాల్గొన్నాయి.

బీఎండబ్ల్యూ కార్ల ధరలు 3% పెంపు

జనవరి 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ ఇండియా.. అన్ని మోడళ్ల కార్ల ధరలను 3 శాతం మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. 2025 జనవరి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని తెలిపింది. కంపెనీ 2 సిరీస్ గ్రాన్ కూపే, 3 సిరీస్, 5 సిరీస్, 7 సిరీస్ లాంగ్ వీల్‌బేస్ సహా ఎక్స్1, ఎక్స్3, ఎక్స్5, ఎక్స్7, ఎం340ఐ మోడళ్లను దేశీయంగా ఉత్పత్తి చేస్తోంది. కాగా కంప్లీట్లీ బిల్టప్ యూనిట్స్ (సీబీయూ)గా ఐ4, ఐ5, ఐ7, ఐ7 ఎం70, ఐఎక్స్1, ఎం2 కూపే వంటి మోడళ్లను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది.

పేస్ వికెట్ బుమ్రా బుల్లెట్

తొలి రోజే 17 వికెట్లు ఫట్

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 67/7

భారత్ తొలి ఇన్నింగ్స్ 150

ఆకట్టుకున్న నితీశ్ కుమార్



భారత బ్యాటర్ల తీరు మారలేదు.. అంతా కలిసి సాధించింది 150 పరుగులే. ఆస్ట్రేలియా ముందు ఇదీ ఓ స్కోరేనా అనిపించింది. కానీ బ్యాటర్లు విఫలమైన చోట భారత పేసర్లు నిప్పులు చెరిగారు. వీరి ధాటికి ఆసీస్ పరుగులు కాదు కదా.. వికెట్లను కాపాడుకునేందుకే ఆపసోపాలు పడాల్సి వచ్చింది. కొత్త బంతితో బుమ్రా టాపార్డర్‌ను కట్టడి చేయగా.. అరంగేట్ర పేసర్ హర్షిత్‌తో పాటు సిరాజ్ సైతం ఆకట్టుకున్నాడు. దీంతో ఆతిథ్య జట్టు 67 పరుగులకే 7 వికెట్లు కోల్పోవడంతో.. మన స్వల్ప స్కోరే వారికి కొండంతలా కనిపిస్తోంది. ఓవరాల్‌గా పెర్త్ స్టేడియంలో ఆరంభ రోజే ఇరు జట్ల బౌలర్ల ధాటికి ఏకంగా 17 వికెట్లు నేలకూలడం విశేషం.

పెర్త్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ అత్యంత ఆసక్తికరంగా ఆరంభమైంది. పర్యాటక భారత్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశామనే ఆనందంలో ఉన్న ఆస్ట్రేలియాకు గట్టి ఝలక్ తగిలింది. పేసర్ బుమ్రా (4/17) తన పదునైన బౌలింగ్‌తో ఆ జట్టును ఉక్కిరిబిక్కిరి చేశాడు. దీంతో తొలిరోజు శుక్రవారం టీమిండియాదే ఆధిపత్యం కనిపించింది. ఆఖరి సెషన్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 27 ఓవర్లలో 7 వికెట్లకు 67 పరుగులు చేసింది. జట్టులో ఎవరూ కనీసం 20 పరుగులు చేయకపోవడం గమనార్హం. క్రీజులో క్యారీ (19 బ్యాటింగ్), స్టార్క్ (6 బ్యాటింగ్) ఉన్నారు. సిరాజ్‌కు రెండు, హర్షిత్‌కు ఓ వికెట్ దక్కింది. అంతకుముందు భారత్ కూడా తడబడి తొలి ఇన్నింగ్స్‌లో 49.4 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. నితీశ్ కుమార్ (41) టాప్ స్కోరర్ కాగా, పంత్ (37), రాహుల్ (26) ఫర్వాలేదనిపించారు. హాజెల్‌వుడ్‌కు 4.. మార్ష్, స్టార్క్, కమిన్స్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆసీస్ ఇంకా 83 పరుగులు వెనుకంజలో ఉండడం గమనార్హం. అందుకే నేటి తొలి సెషన్ ఆరంభంలోనే ఆతిథ్య టీమ్‌కు చెక్ పెట్టాలి. అనంతరం రోజంతా బ్యాటింగ్ చేయగలిగితే భారత్ పటిష్ఠ స్థితిలో నిలుస్తుంది. ఈ మ్యాచ్‌లో భారత్ నుంచి నితీశ్, హర్షిత్.. ఆసీస్ నుంచి మెక్‌స్వీనే అరంగేట్రం చేశారు.

తడబాటుతో ఆరంభం: స్టేడియం ట్రాక్ రికార్డును అనుసరించి టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. కానీ ఆసీస్ పేసర్ల కట్టుదిట్టమైన బంతులకు పరుగులు అంత సులువుగా రాలేదు. ఆరంభంలో హాజెల్‌వుడ్, స్టార్క్ వెంటవెంటనే దెబ్బతీశారు. అయితే పంత్‌కు జతగా నితీశ్ ఎదురొడ్డి నిలిచి జట్టు పరువు కాపాడారు. ఓపెనర్ రాహుల్ వినహా టాపార్డర్‌లో జైస్వాల్, దేవ్‌దత్ డకౌట్లుగా వెనుదిరిగారు. ఇక విరాట్ (5) పేలవ ఫామ్ ఇక్కడా కొనసాగింది. రాహుల్ మాత్రం పట్టుదలగా క్రీజులో నిలిచాడు. భారీ స్కోరు చేస్తాడనిపించినా వివాదాస్పద రీతిలో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంత్ ఓపిగ్గా క్రీజులో నిలవగా జురెల్ (11), సుందర్ (4)లను మార్ష్ పెవిలియన్‌కు చేర్చాడు.

వహ్వా.. నితీశ్: ఎనిమిదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ అంచనాలకు మించి రాణించాడు. అతడు క్రీజులోకి వచ్చే సమయానికి భారత స్కోరు 73/6. ఈ సమయంలో జట్టు కనీసం వంద పరుగులైనా చేయగలుగుతుందా? అనిపించింది. కానీ ఎటాకింగ్ ఆటతీరుతో పాటు చక్కటి డిఫెన్స్‌తోనూ శభాష్ అనిపించుకున్నాడు. ముఖ్యంగా టాప్ స్పిన్నర్ లియోన్‌ను సైతం సులువుగా ఎదుర్కొంటూ రివర్స్ స్వీప్ షాట్లతో ఫోర్లు బాదడం హైలైట్‌గా నిలిచింది. అలాగే స్టార్ పేసర్లు హాజెల్‌వుడ్, కమిన్స్, స్టార్క్ బౌలింగ్‌ను సైతం దీటుగా ఎదుర్కొన్నాడు. కమిన్స్ బౌలింగ్‌లో అతడి అప్పర్ కట్ సిక్సర్ చూడాల్సిందే. ఇక పంత్-నితీశ్ జోడీ నిలకడతో భారత్ కుదురుకుంటున్నట్టే కనిపించింది. కానీ పంత్‌ను కమిన్స్ అవుట్ చేయడంతో ఏడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత వికెట్లు పడుతుండడంతో కమిన్స్ ఓవర్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన నితీశ్ చివరివికెట్‌గా వెనుదిరిగాడు.

దెబ్బతీసిన బుమ్రా: చివరి సెషన్‌ను జాగ్రత్తగా ముగిద్దామనుకున్న ఆసీస్‌ను ఏకంగా ఏడు వికెట్లతో భారత పేసర్లు దావుదెబ్బ తీశారు. ముఖ్యంగా బుమ్రా టాపార్డర్ పనిబట్టాడు. లబుషేన్ దాదాపు తొమ్మిది ఓవర్లపాటు క్రీజులో నిలిచినా అతడు చేసింది రెండు పరుగులే. స్టార్ బ్యాటర్లంతా ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో 38 పరుగులకే సగం వికెట్లను కోల్పోయింది. ఓపెనర్ మెక్‌స్వీనే (10) వికెట్‌ను డీఆర్ఎస్ ద్వారా సాధించిన బుమ్రా.. ఆ తర్వాత ఒకే ఓవర్‌లో ఖవాజా (8), స్మిత్ (0)లను అవుట్ చేశాడు. విడిలార్డర్‌ను కుదురుకోనీయకుండా సిరాజ్, రాణా చూసుకున్నారు. దీంతో 59/7 స్కోరుతో ఆసీస్ పీకల్లోతు కష్టాల్లో పడింది.



నితీశ్ కుమార్ (41)

తెలుగోడి తెగువ

ప్రపంచస్థాయి బౌలింగ్‌ను, అదీ అత్యుత్తమ పేస్‌తో బ్యాటర్లను గడగడలాడించే కంగారూల బౌలింగ్ దళాన్ని ఎదుర్కోవడం.. విరాట్ కోహ్లీలాంటి స్టార్ ఆటగాళ్లు విఫలమైన వేళ క్రీజులోకి వచ్చి పట్టుదలతో పరుగులు సాధించడం.. అందునా, అరంగేట్ర టెస్టులోనే ఈ ఘనత అందుకోవడం.. ఇలాంటి మధుర జ్ఞాపకం కెరీర్ ఆరంభంలో ఎంతమంది క్రికెటర్లకు దక్కుతుంది? కానీ, వీటన్నింటినీ 21 ఏళ్ల నితీశ్‌కుమార్ రెడ్డి తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్‌లో అద్భుత ప్రతిభతో ఆకట్టుకొని, ఇటీవల బంగ్లాదేశ్‌తో సిరీస్‌తో టీ20ల్లో అరంగేట్రం చేసిన పేస్ ఆల్‌రౌండర్ నితీశ్.. బోర్డర్ గవాస్కర్ సిరీస్ ట్రోఫీ తొలి టెస్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్నాడు. 41 (6 ఫోర్లు, 1 సిక్సర్‌తో) పరుగుల విలువైన ఇన్నింగ్స్‌తో తన రాకను ఘనంగా చాటాడు. పంత్ (37), రాహుల్ (26) తర్వాత ఈ ఇన్నింగ్స్‌లో అధిక బంతులు (59) ఎదుర్కొన్న నితీశ్ జట్టులో అందరికంటే ఎక్కువగా 69.49 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు రాబట్టాడు. రిషబ్ పంత్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన అతడు జట్టు స్కోరు 150 స్కోరు వచ్చేంతవరకు ప్రత్యర్థి బౌలర్లతో దీటుగా పోరాడి ఆఖరి వికెట్‌గా వెనుదిరిగిన తీరు సర్వదా ప్రశంసనీయం.

- (ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కల నిజమాయె..



భారత జట్టుకు ఆడడం నా చిరకాల స్వప్నం. అది ఈ ఏడాది నెరవేరినందుకు సంతోషంగా ఉంది. విరాట్ చేతుల మీదుగా టెస్టు క్యాప్‌ను స్వీకరించడం అద్భుతంగా అనిపిస్తోంది. ఇక కోచ్ గంభీర్ ఇచ్చిన సలహా కారణంగా నా ఆట మరింత మెరుగుపడింది. బౌన్సీ బంతులు ఎదురైనప్పుడు.. నీ దేశం కోసం బుల్లెట్లను స్వీకరిస్తున్నట్టుగా భావించమని చెప్పాడు. ఆ మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. అలాగే భావించి క్రీజులో పరుగులు రాబట్టాను.

- నితీశ్ కుమార్

1 ఆసీస్ గడ్డపై తొలి రోజే టెస్టులో 17 వికెట్లు నేలకూలడం 72 ఏళ్లలో ఇదే తొలిసారి. 1952లో చివరిసారి ఇలా జరిగింది.

2 స్మిత్‌ను టెస్టుల్లో గోల్డెన్ డకౌట్ చేసిన రెండో బౌలర్‌గా బుమ్రా. 2014లో స్టెయిన్ తొలి బంతికే అవుట్ చేశాడు.

2 1980 తర్వాత తమ సొంత గడ్డపై 40 పరుగుల్లోపే టాప్-5 వికెట్లు కోల్పోవడం ఆసీస్‌కిది రెండోసారి. 2016లో దక్షిణాఫ్రికాపై 17/5 స్కోరుతో నిలిచింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మెక్‌స్వీనే (బి) స్టార్క్ 0; రాహుల్ (సి) క్యారీ (బి) స్టార్క్ 26; పడిక్కళ్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 0; కోహ్లీ (సి) ఖవాజా (బి) హాజెల్‌వుడ్ 5; పంత్ (సి) స్మిత్ (బి) కమిన్స్ 37; జురెల్ (సి) లబుషేన్ (బి) మార్ష్ 11; సుందర్ (సి) క్యారీ (బి) మార్ష్ 4; నితీశ్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 41; హర్షిత్ (సి) లబుషేన్ (బి) హాజెల్‌వుడ్ 7; బుమ్రా (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 8; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 49.4 ఓవర్లలో 150 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-32, 4-47, 5-59, 6-73, 7-121, 8-128, 9-144, 10-150; **బౌలింగ్:** స్టార్క్ 11-3-14-2; హాజెల్‌వుడ్ 13-5-29-4; కమిన్స్ 15.4-2-67-2; లియోన్ 5-1-23-0; మార్ష్ 5-1-12-2.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) విరాట్ (బి) బుమ్రా 8; మెక్‌స్వీనే (ఎల్బీ) బుమ్రా 10; లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 2; స్మిత్ (ఎల్బీ) బుమ్రా 0; హెడ్ (బి) హర్షిత్ 11; మార్ష్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 6; క్యారీ (బ్యాటింగ్) 19; కమిన్స్ (సి) పంత్ (బి) బుమ్రా 3; స్టార్క్ (బ్యాటింగ్) 6; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 27 ఓవర్లలో 67/7; వికెట్ల పతనం:** 1-14, 2-19, 3-19, 4-31, 5-38, 6-47, 7-59; **బౌలింగ్:** బుమ్రా 10-3-17-4; సిరాజ్ 9-6-17-2; హర్షిత్ 8-1-33-1.

విరాట్ ఎందుకలా?

ఫామ్ కోల్పోయి ఒత్తిడిలో ఉన్న కోహ్లీ ఈసారీ నిరుత్సాహపరిచాడు. 14/2 స్కోరు దగ్గర బరిలోకి దిగిన తను క్రీజుకు బయట స్టాన్స్ తీసుకోవడం ఆశ్చర్యపరిచింది. కానీ పెర్త్‌లో ఎదురయ్యే బౌన్స్‌ను ఆడే విషయంలో విరాట్ ఈ వ్యూహం బెడిసికొట్టింది. ఫ్రంట్ ఫుట్ షాట్లతో ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు కనిపించినా.. హాజెల్‌వుడ్ తెలివైన బంతికి దొరికిపోయాడు. తను తీసుకున్న స్టాన్స్‌తో అదనపు బౌన్స్‌తో వచ్చిన డెలివరీని ఆడే విషయంలో కోహ్లీ బ్యాలెన్స్ తప్పాడు. బంతి ఎడ్జ్ తీసుకుని స్లిప్‌లో ఉన్న ఖవాజా చేతిలో పడడంతో ఐదు పరుగులకే వెనుదిరిగాడు.





రాహుల్ అవుటేనా?

ఓపెనర్ కేఎల్ రాహుల్ 23వ ఓవర్‌లో అతడు వివాదాస్పద రీతిలో వెనుదిరగాల్సి వచ్చింది. స్టార్క్ వేసిన ఆఫ్‌సైడ్ బంతిని రాహుల్ డిఫెన్స్ ఆడాలని చూశాడు. అయితే ఆసీస్ క్యాచ్ అవుట్ కోసం చేసిన అప్పీల్‌ను అంపైర్ తిరస్కరించాడు. డీఆర్ఎస్‌కు వెళ్లగా రీప్లేలో స్నికో మీటర్‌లో స్పైక్స్ రావడంతో థర్డ్ అంపైర్ అవుటైనట్టు ప్రకటించాడు. నిజానికి రాహుల్ కుడికాలి ప్యాడ్‌కు బ్యాట్ తాకింది. అలాగే బ్యాట్‌కు బాల్‌కు చిన్న గ్యాప్ ఉన్నట్టు కనిపించింది. అటు సరైన యాంగిల్స్‌లో ఫుటేజీ అందుబాటులో లేకపోవడం కూడా ఆసీస్‌కు కలిసివచ్చింది. మరోవైపు మాజీలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబట్టారు.

సెమీస్‌కు సాత్విక్ జోడీ

షెన్‌జెన్ (చైనా): ఏస్ డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్/చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. డబుల్స్ క్వార్టర్స్ పోరులో సాత్విక్/చిరాగ్ జంట 21-16, 21-19తో డెన్మార్క్‌కు చెందిన రెండో సీడ్ కిమ్ ఆస్ట్రప్/ఆండెర్స్ స్కారప్ జోడీని ఓడించింది. లక్ష్య సేన్ 18-21, 15-21తో మూడో సీడ్ ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

స్నేహిత్‌కు కాంస్యం



హైదరాబాద్: తెలుగు ఆటగాడు స్నేహిత్ జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పతకంతో మెరిశాడు. హరియాణాలోని పంచకులలో శుక్రవారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో స్నేహిత్ 2-4తో ఢిల్లీకి చెందిన పయాస్ జైన్ చేతిలో ఓటమిపాలై కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. కాగా సాథియాన్ విజేతగా నిలిచాడు.

ఆంధ్రజ్యోతి
నవ్య
11
కుటుంబ కదంబం
శనివారం • 23 నవంబరు 2024

వంటిల్లు



శీతాకాలంలో వేడివేడి కూరలు తింటుంటే వచ్చే మజా వేరుగా ఉంటుంది. అలాంటి కొన్ని వంటకాలు ఎలా చేయాలో తెలుసుకుందాం...

శీతాకాలం వేడి వేడిగా..!

జీడిపప్పు కోడికూర

కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు- 750 గ్రాములు, ఉల్లిపాయ ముక్కలు-ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, కారం- ఒక స్పూను, పసుపు- రెండు స్పూనులు, నూనె- అరకప్పు, జీడిపప్పు- 150 గ్రాములు, గరం మసాలా- ఒక స్పూను, పెరుగు- ఒక కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత, నీళ్లు- రెండు కప్పులు, నెయ్యి- రెండు స్పూనులు

తయారీ విధానం

- ఒక మూకుడులో నెయ్యి వేసి వేడి చేయాలి. 50 గ్రాముల జీడిపప్పును వేయించి చల్లార్చాలి. వేగిన జీడిపప్పును కొద్దిగా నీళ్లు వేసి మిక్సీలో ముద్దగా చేయాలి.
- ఆ మూకుడులోనే నూనెను వేడి చేయాలి. దీనిలో ఉల్లిపాయ ముక్కలు, గరం మసాలా వేసి వేయించాలి.
ఉల్లిపాయ ముక్కలు కొద్దిగా వేగిన తర్వాత చికెన్ ముక్కలు వేయాలి. పెరుగు కూడా వేయాలి. మూత పెట్టి బాగా మగ్గనివ్వాలి.
- చికెన్ ముక్కలు బాగా ఉడికిన తర్వాత దానిలో అల్లం వెల్లులి పేస్ట్, పసుపు, కారం, ఉప్పు వేయాలి. రెండు కప్పుల నీళ్లు పోసి ఉడకనివ్వాలి.
- ఆ తర్వాత జీడిపప్పు పేస్ట్ వేసి 10 నిమిషాలు ఉడకనివ్వాలి.
కూరను దింపే ముందు దానిలో వేయించిన జీడిపప్పు, తరిగిన కొత్తిమీర చల్లాలి.

జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మరీ చిన్నగా.. లేదా మరీ పెద్దగా లేకుండా చూసుకోవాలి.
- చిక్కటి పెరుగు వేస్తే రుచి చాలా బావుంటుంది.
- పసుపు రెండు స్పూన్ల కన్నా ఎక్కువ వేయకూడదు. ఎక్కువ వేస్తే చిరు చేదు వస్తుంది.

బజ్జీ మిర్చీ కూర



కావాల్సిన పదార్థాలు

బజ్జీ మిర్చీ- అర కిలో, జీలకర్ర- ఒక స్పూను, నిమ్మరసం- 4 స్పూన్లు, నూనె- ఒక కప్పు, నువ్వులు- 100 గ్రాములు, తురిమిన ఎండు కొబ్బరి- 200 గ్రాములు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- బజ్జీ మిర్చీని బాగా కడిగి సగం చీరాలి.
- నువ్వులు, తురిమిన ఎండు కొబ్బరిని కలిపి మిక్సీలో వేసి పొడి చేయాలి.
- ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దానిలో బజ్జీ మిర్చీ వేసి వేయించాలి. వాటిని బయటకు తీసి చల్లార్చాలి.
- మిగిలిన నూనెలో జీలకర్ర వేసి వేయించాలి. ఆ తర్వాత నువ్వులు, ఎండుకొబ్బరి పొడిని వేసి వేయించాలి. దానిలో నీళ్లు వేసి ఉడకనివ్వాలి. కొద్ది సేపటి తర్వాత నూనె పైకి తేలుతుంది. అప్పుడు తగినంత ఉప్పు వేసుకోవాలి.
- నూనె పైకి తేలిన తర్వాత మిర్చీని వేసి బాగా ఉడకనివ్వాలి.

జాగ్రత్తలు

- బజ్జీ మిర్చీని చీల్చకుండా నూనెలో నేరుగా వేయకూడదు. వేస్తే నూనె పైకి చిమ్మే ప్రమాదం ఏర్పడుతుంది.
- ఈ కూరను అన్నంలో తినాలంటే కొద్దిగా పలచగా చేసుకోవచ్చు. చపాతీలలో తినాలంటే మాత్రం చిక్కగా చేసుకుంటే బావుంటుంది.

కోడిగుడ్డు సాలన్



కావాల్సిన పదార్థాలు

ఉడికించిన కోడిగుడ్లు- ఆరు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, కారం- ఒక స్పూను, పసుపు- పావు స్పూను, నూనె- అర కప్పు, చింతపండు గుజ్జు- అరకప్పు, ఉప్పు- తగినంత, వేరుశనగపప్పు- రెండు స్పూనులు, గసగసాలు- ఒక స్పూను, నువ్వులు- ఒక స్పూను, తురిమిన ఎండు కొబ్బరి- మూడు టేబుల్ స్పూనులు, ధనియాలు- ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ఒక మూకుడులో గసగసాలు, నువ్వులు, వేరుశనగపప్పు, ఎండు కొబ్బరి, ధనియాలు, జీలకర్ర వేసి పొడి చేయాలి.
- ఉడకబెట్టిన కోడిగుడ్లపై పొర తీసి రెండేసి ముక్కలుగా చేయాలి.
- ఒక మూకుడులో నూనె వేడి చేసి ఉల్లిపాయలు వేయించాలి. దానిలో అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోయాలి.
- ఈ నీళ్లలో ముందుగా చేసుకున్న పొడి.. చింతపండు గుజ్జు వేసి కలపాలి. బాగా ఉడికిన తర్వాత ఉడకబెట్టిన కోడిగుడ్డు ముక్కలను దీనిలో వేయాలి.

జాగ్రత్తలు

- కోడిగుడ్లను ఎక్కువగా ఉడకబెట్టకూడదు. సగం ఉడకబెట్టిన గుడ్లు సరిపోతాయి.
- చింతపండు గుజ్జు తగినంతే వేయాలి. ఎక్కువ అయితే సాలన్ రుచిలో తేడా వస్తుంది.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

ప్రకృతిలో ఉన్న ప్రతీ ఆహార ద్రవ్యానికీ వేటి గుణాలు వాటికున్నాయి. అంతకు మించిన అంశం ఇంకొకటుంది.. ఆయుర్వేద శాస్త్రం దాన్ని 'ప్రభావం'

గుణాలు తెలిసి తినాలి

అన్నది. ద్రవ్యాల ప్రభావం వలన ఆహారానికి ఔషధ ప్రయోజనం కలుగుతోంది! భోజనకుతూహలం గ్రంథంలో రఘునాథ సూరి అనేక ఆహార పదార్థాల ప్రభావాన్ని వివరిస్తూ, సిద్ధాన్నప్రకరణం అని ఒక అధ్యాయం వ్రాశాడు. ఆహార ప్రయోజనాన్ని ఈ అధ్యాయం వివరిస్తుంది. ఆహార పదార్థాల తయారీకి వాడే ద్రవ్యాలకు ఏ గుణాలుంటాయో వాటితో వండిన పదార్థాలక్కూడా అవే గుణాలుంటాయన్నది ఇందులో మొదటి సూత్రం. ఉదాహరణకు నువ్వులు వాతాన్ని తగ్గిస్తాయి. నువ్వులు కలిపి వండిన ఏ ఆహార పదార్థమైనా వాతాన్ని తగ్గించేదిగానే ఉంటుంది. అయితే ఈ సూత్రం అన్ని సందర్భాల్లోనూ వర్తించదు. ఉదాహరణకు ఆరు నెలల పాటు పాతబడిన బియ్యం తేలికగా



అరిగే స్వభావాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి, ఆ బియ్యాన్ని వండిన అన్నం తేలికగా అరుగుతుంది. కడుపు నిండుతుంది. వాతాన్ని, పిత్తాన్ని, కఫాన్ని కూడా అదుపు చేస్తుంది. కానీ, ఈ బియ్యంతోనే చేసిన మరమరాలకు, అటుకులకు అవే గుణాలు ఉండటం లేదు. పాతబియ్యంతో చేసిన మరమరాలు అన్నం కన్నా తేలికగా అరుగుతాయి. కానీ కడుపు నింపవు. అటుకులు కష్టంగా అరుగుతాయి. వాతం చేస్తాయి. కడుపునొప్పి లాంటివి తెస్తాయి. ఇందుకు వాటి ప్రభావం కారణం. ఈ ప్రభావంలో మార్పు తెస్తున్నదేది?

"క్వచిత్సంస్కార భేదేనగుణభేదోభవేదిహఖ సంస్కార భేదం" అంటే ఆహార ద్రవ్యాల తయారీ తీరులో మార్పులు చేయటంలో తేడాలవలన వాటి గుణాలలో కూడా తేడా లేర్పడుతున్నాయి. అంటూ రఘునాథపండితుడు భోజన కుతూహలంలో ప్రభావం ఎలా ఏర్పడుతుందో వివరించాడు! అంటే, ఆహార పదార్థాల తయారీ తీరు దాని గుణాలను ప్రభావితం చేస్తుందన్న మాట. ఏం వండారన్నదానికన్నా ఎలా వండారన్నదే ముఖ్యం. ఒక్కోసారి కొన్ని పదార్థాల్ని కలపటం వలన అంతకు మునుపులేని కొత్త గుణాలు ఆ ఆహార పదార్థానికి ఏర్పడతాయి. దీనికి రఘునాథ సూరి కొన్ని ఉదాహరణలు ఇచ్చాడు. అవి..

"కాదలంగురుసర్పిశ్శతదుష్ట్రమ్ సుపచేత్ భవేత్ఖ"

కాదలం అంటే కదళీ (అరటి)ఫలం, సర్పి అంటే నెయ్యి. అరటి పండు, నెయ్యి రెండూ ఆలస్యంగా అరిగే స్వభావం కలిగినవే! కానీ అన్నంతో కలిపి వీటిని తిన్నప్పుడు ఒకే విధమైన ఫలితాలు ఉండవు. నెయ్యి వల్ల అన్నం త్వరగా అరుగుతుంది. అరటిపండుతో కలిపి తింటే అన్నం ఆలస్యంగా అరుగుతుంది. ఈ విధంగా ఏవి తింటే శరీరంమీద ఏ గుణాలు కలుగుతాయో ముందుగా మనం తెలుసుకోవాలి. ఆహార పదార్థాలను ఎలా వండుకోవాలో ఆలోచించాలి. ఆహారంలో ఏ ఏ ద్రవ్యాలను కలపవచ్చో, వేటివేటిని కలపకూడదో తెలుసుకోవాలి. అప్పుడే పరిపూర్ణమైన ఆరోగ్యవంతులమవుతాం!

- గంగరాజు అరుణాదేవి

మేకప్

చలిలో చమక్కుమనేలా...

చలికాలం మేకప్ పట్ల చికాకు పెరుగుతుంది. మేకప్ వల్ల చల్లని వాతావరణంలో చర్మం మరింత పొడిబారిపోయినట్టు అని పించడమే ఇందుకు కారణం. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించాలి.

తేమ తగ్గకుండా

మేకప్ ఉత్పత్తుల వల్ల చర్మంలో తేమ తగ్గిపోకుండా ఉండడం కోసం, ఉపయోగించే సీరమ్, మాయిశ్చరైజర్, ప్రైమర్‌లలు కూడా తేమతో కూడినవై ఉండేలా చూసుకోవాలి. మేకప్‌కు ముందు ముఖం కడుక్కున్న వెంటనే తడి పూర్తిగా ఆరేలోగానే వీటిని పూసుకోవాలి.



ద్రవరూప ఉత్పత్తులు

పౌడర్ ఆధారిత ఉత్పత్తులకు బదులుగా ద్రవరూపంలో ఉండే ఫౌండేషన్, బ్లష్‌లు వాడుకోవాలి. ఇవి చర్మానికి చక్కగా అంటుకుపోయి చర్మం తేమను హరించకుండా ఉంటాయి.

పెదవులు

చలికాలం పెదవులు పొడిబారిపోయి, పగిలిపోకుండా ఉండడం కోసం లిప్ స్క్రబ్‌తో వారానికోసారి పెదవులను రుద్దుకుని మృతకణాలను తొలగించుకోవాలి. తేమను అందించే ప్రత్యేకమైన లిప్‌స్టిక్స్‌నే ఈ కాలంలో వాడుకోవాలి.

బ్లష్

చెక్కిళ్లకు ఎరుపు దనాన్ని తెచ్చిపెట్టే బ్లష్‌లను ఎంచుకునేటప్పుడు క్రీమ్ ఆధారిత బ్లష్‌నే ఎంచుకోవాలి.

సెట్టింగ్ స్ప్రే

పూర్తయిన మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే వాడుకుంటూ ఉంటాం. అయితే ప్రత్యేకించి చలికాలం కోసం వాటర్‌ప్రూఫ్ సెట్టింగ్ స్ప్రేను ఎంచుకోవాలి.

వేడిని పెంచే యోగాసనాలు

చలికాలంలో మనసు, శరీరం అంత ఉత్సాహంగా అనిపించవు. చలి వల్ల శరీరం ఉష్ణోగ్రతను కోల్పోతుంది. దీంతో నీరసం ఆవహిస్తుంది. జలుబు, దగ్గు వంటి సమస్యలు కూడా వేధిస్తుంటాయి. వీటన్నింటినీ నివారించేందుకు యోగా మంచి మార్గమని ఆయుర్వేదం చెబుతోంది. శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచే యోగాసనాలు ఇవే..



సూర్య నమస్కారం

- ఉదయిస్తున్న సూర్యుని ముందు నిలుచుని చేసే ఈ నమస్కారం ఎంతో విశిష్టమైంది. శరీరానికి సూర్యరశ్మి సోకగానే మనసు ఉత్తేజితం అవుతుంది. రక్త ప్రసరణ వ్యవస్థ వేగవంతమవుతుంది. కీళ్ల కదలికలు మెరుగవుతాయి. వెన్నెముక దృఢంగా మారుతుంది.




వీరభద్రాసనం

- ఈ ఆసనం శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తుంది. శరీరానికి చలిని తట్టుకునే శక్తిని ఇస్తుంది. కాళ్లు, చేతులు, భుజాల్లో కదలికలను పెంచి శరీర సామర్థ్యాన్ని స్థిరపరుస్తుంది. ఏకాగ్రతను పెంచుతుంది.



నటరాజాసనం

- ఇది ప్రత్యేకమైన ఓ నృత్య భంగిమ. ఈ ఆసనం వేయడం వల్ల చలి కారణంగా బిగుసుకున్న కండరాలు వదులుగా మారతాయి. భుజాలు, పాదాలు, వేళ్లకు రక్తప్రసరణ వేగంగా జరుగుతుంది. ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. శరీరానికి చురుకుదనం లభిస్తుంది.



భుజంగాసనం

- చలికాలంలో జీర్ణక్రియ మందగిస్తుంది. భుజంగాసనం వేయడం వల్ల జీర్ణాశయంలో జఠరాగ్ని ఏర్పడుతుంది. ఇది ఆహారం తేలికగా జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. ఛాతి, ఊపిరితిత్తులు, ఉదర కండరాల్లో కూడా ఈ ఆసనం వేడిని ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు తీవ్ర స్థాయిలో వేధించకుండా ఉంటాయి.



ఉత్కటాసనం

- శీతాకాలంలో చలి వల్ల శరీరం బిగుసుకుపోతుంది. ఉత్కటాసనం వేయడం వల్ల శరీరంలోని కండరాలు, రక్తం వేడెక్కుతాయి. ముఖ్యంగా తుంటి, తొడలు, మోకాళ్లకు తగిన ఉష్ణం అంది సులభంగా కదులుతాయి.



అధోముఖ స్వనాసనాసనం

- ఈ ఆసనం వేయడం వల్ల శరీరం మొత్తం సాగినట్టవుతుంది. ముఖ్యంగా వీపు, భుజాలు, కాళ్లలో రక్త ప్రసరణ వేగం పెరుగుతుంది. రక్తం ఎగువకు ప్రవహించడం వల్ల తలకు, మెదడుకి తగినంత వేడి రక్తం అందుతుంది. దీనివల్ల బద్ధకం, నీరసం, నిద్రించాలనే భావనలు మాయమవుతాయి.



వృక్షాసనం

- ఈ ఆసనం శరీరాన్ని సమతాస్థితిలో ఉంచుతుంది. చల్లని వాతావరణం వల్ల కలిగే మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. గాలి పీల్చుకునే వేగాన్ని క్రమబద్ధీకరిస్తుంది. తీసుకున్న ఆహారంలోని పోషకాలు శరీరానికి అందేలా చేస్తుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత మోతాదుకు మించి తగ్గకుండా ఉంటుంది.

వినూత్నం



వ్యాపకంగా మొదలై... ఎందరికో ఆదర్శమై

ఆమె సాధారణ గృహిణి. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టింది. వ్యాపకంగా మొదలై... ఇప్పుడు ఏడాదికి ముప్పై లక్షల టర్నోవర్ సాధించే స్థాయికి ఎదిగింది. విభిన్నమైన ఔషధ రకం పుట్టగొడుగులను పెంచుతూ... లాభాల పంట పండిస్తోంది. పారిశ్రామికవేత్తగా తనలాంటి మహిళలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న సుమన్ సాఖీజా ప్రయాణం ఇది..

సుమన్‌ది ఢిల్లీలోని ద్వారక. ఆమెకు తన పిల్లలే ప్రపంచం. వాళ్ల ఆలనాపాలనతోనే రోజులు గడిచిపోయేవి. క్రమంగా పిల్లలు పెద్దవాళ్లయ్యారు. వాళ్ల చదువులేవో వాళ్లు చదువుకుంటున్నారు. దాంతో సుమన్‌కు ఖాళీ సమయం దొరికింది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంది ఆమె. ఇంటివద్ద ఉంటూనే ఏదైనా చేయాలని భావించింది. అదే సమయంలో పుట్టగొడుగుల పెంపకం గురించి తెలిసింది. హరియాణాలోని హైటెక్ మష్రూమ్ అండ్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ సెంటర్ వాళ్లు శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని.. అందులో చేరింది. అక్కడ శిక్షణ తీసుకుంటూనే, వివిధ మాధ్యమాల ద్వారా పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించింది.



అరుదైన రకం...

సైన్స్‌పై ఏ మాత్రం అవగాహన లేని సుమన్ బటన్ పుట్టగొడుగుల పెంపకంపై ప్రత్యేక శిక్షణ తీసుంది. ఈ క్రమంలోనే ఆమెకు కార్డిసెప్స్ మిలిటరీస్ అనే ఔషధ గుణాలున్న పుట్టగొడుగుల గురించి తెలిసింది. వీటిపై పరిశోధన ప్రారంభించింది. ఇవి హిమాలయాల్లో మాత్రమే లభించే ప్రత్యేకమైన ఫంగస్‌లని తెలుసుకుంది. కాస్త శ్రద్ధ పెడితే వీటిని ప్రయోగశాలల్లో కూడా పెంచవచ్చని ఆమెకు అర్థమైంది. దీనితో వీటి పెంపకాన్ని ఇంట్లోనే నిర్వహించాలని నిర్ణయించుకుంది సుమన్.

ఎదురు చూడక్కర్లేదు...

"కార్డిసెప్స్‌ను పెంచడానికి ఎక్కువ స్థలం అవసరం లేదు. కేవలం 200 చదరపు అడుగుల స్థలంలో నాలుగు లక్షల పెట్టుబడితో ప్రయోగశాల ఏర్పాటు చేసుకున్నా. థాయ్‌లాండ్ నుంచి కార్డిసెప్స్ విత్తనాలను తెప్పించుకుని పుట్టగొడుగుల పెంపకం ప్రారంభించాను. ఇవి చాలా తక్కువ సమయంలోనే చేతికి అందివస్తాయి. అంతేకాదు.. చాలా రోజుల వరకు తాజాగా ఉంటాయి. వెంటనే అమ్ముడుపోవాలన్న ఆందోళన అక్కర్లేదు. ఏడాదికి నాలుగు పంటలు పండించుకోవచ్చు. ఈ కార్డిసెప్స్‌లో అత్యధికంగా యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడానికి, మలబద్ధకం, మధుమేహం, మూత్రపిండాల వ్యాధుల నివారణకు వీటిని వివిధ రూపాల్లో వినియోగిస్తున్నారు" అని చెప్పుకొచ్చింది సుమన్.

పుష్కలంగా ఔషధ గుణాలు...

"నేను కార్డిసెప్స్ పుట్టగొడుగుల పెంపకం గురించి పరిశోధించి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఇవి ఎక్కువగా పర్వత ప్రాంతాల్లో మాత్రమే లభిస్తాయి. వీటిని సేకరించడం చాలా కష్టం. అంతేకాదు.. వీటి కోసం పర్వత ప్రాంతాల్లో మనుషుల తిరగడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. ఆ ప్రాంతాల్లో మరలా ఈ పుట్టగొడుగులు ఉత్పత్తి కాకపోవచ్చు. వీటికి ఉన్న ఔషధ గుణాల వల్ల రకరకాల మందుల తయారీలో ఉపయోగిస్తున్నారు. డిమాండ్ కూడా అధికంగానే ఉంది. ఒక కేజీ కార్డిసెప్స్ మూడు లక్షల రూపాయల వరకు ధర పలుకుతోంది.

> **మహిళలకు శిక్షణ...**
>
> పుట్టగొడుగుల పెంపకంలో ఆసక్తిగల ఔత్సాహిక మహిళలకు సుమన్ ప్రత్యేకంగా శిక్షణ ఇస్తోంది. ప్రతి నెలా 20 నుంచి 30 మంది వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకొంటున్నారు. సొంత ప్రయోగశాలలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కార్డిసెప్స్ పెంపకంతోపాటు సుమన్ కుంకుమ పూల సాగును కూడా నిర్వహిస్తోంది. ఏడాదికి 600 గ్రాముల కుంకుమ పువ్వు ఉత్పత్తి చేసి, మూడు లక్షల టర్నోవర్ సాధించింది. ఆగస్టు నుంచి నవంబరు వరకు కుంకుమ పువ్వు సాగుకు అనుకూలంగా ఉంటాయని, మిగతా సమయమంతా కార్డిసెప్స్‌ను పెంచుతానని సుమన్ చెప్పుకొచ్చింది.

సహజంగా లభించే కార్డిసెప్స్ కంటే ప్రయోగశాలల్లో పెంచేవి సరసమైన ధరకు లభిస్తాయి. వీటి అమ్మకాల కోసం ఇటీవలే ఆరెంజ్ హెర్బ్ బ్రాండ్ పేరిట సంస్థను ప్రారంభించాం" అంటారు సుమన్. ఈ సంస్థ ద్వారా వినూత్న సాగు పద్ధతులను పరిచయం చేసి, మరింతమంది మహిళలను సాధికారత వైపు అడుగులు వేయించాలన్నది ఆమె ఆశయం.

'అధ్యక్షా'.. ఆ మాటే

బంగారమాయెనే!

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారంతోనే సరి

వైసీపీ నుంచి నలుగురు తొలిసారి ఎన్నిక

జగన్ నిర్ణయంతో అసెంబ్లీకి దూరం.. సభలో మాట్లాడే అవకాశమే లేదాయె

ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తామంటున్న జగన్.. ఈ ఐదేళ్లలో హోదా దక్కడం కష్టమే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


ఎమ్మెల్యే అయ్యే అవకాశం చాలా కొద్దిమందికే వస్తుంది. ఎమ్మెల్యేలుగా గెలిచినవారు అసెంబ్లీకి వెళ్తేనే ఆ పదవికి సార్థకత. ఆ నియోజకవర్గానికి సభలో ప్రాతినిధ్యం ఉంటుంది. సాధారణంగా ఎమ్మెల్యేలందరికీ అసెంబ్లీకి వెళ్లాలని, స్పీకర్‌ను 'అధ్యక్షా' అంటూ సభలో మాట్లాడాలనే కోరిక ఉంటుంది. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు అయితే మరీను. అయితే వైసీపీ అధినేత జగన్ నిర్ణయం కారణంగా ఆ పార్టీ తరఫున తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన నలుగురు ఎమ్మెల్యేలు ఈ అరుదైన అవకాశం కోల్పోవాల్సి వస్తోంది. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడమే తప్ప అధ్యక్షా అని పిలిచే భాగ్యానికి నోచుకోలేకపోయారు. దీనికంతటికీ జగనే కారణం. గత ఐదేళ్లు అరాచక పాలన సాగించిన జగన్ పార్టీ చిత్తుచిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఆ పార్టీకి అసెంబ్లీలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు తీర్పు ఇచ్చారు. జగన్‌తో సహా వైసీపీ 11 మంది ఎమ్మెల్యేలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకున్నా, కావాల్సిందే నంటూ జగన్ మారాం చేస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని వింత రాజకీయానికి తెరలేపారు. జగన్ నిర్ణయానికి అసలు కారణం వేరే ఉందన్నది రాజకీయ విశ్లేషకుల మాట. ఈ విషయాన్ని అటుంచితే... జగన్ నిర్ణయం కారణంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి దూరం కావాల్సి వచ్చింది. అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను చెప్పుకొనే హక్కును కోల్పోయారు. వైసీపీ తరఫున గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలలో నలుగురు కొత్తగా ఎన్నికైన వారు ఉన్నారు. మిగిలిన ఏడుగురు పాతవారే. వైసీపీ అధినేత జగన్ మూడుసార్లు పులివెందుల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నుంచి ఏడుసార్లు ఎన్నికయ్యారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి నాలుగుసార్లు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి మూడుసార్లు, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధ, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి రెండుసార్లు చొప్పున గెలిచారు. ఈ ఏడుగురికి అసెంబ్లీలో అనుభవం ఉంది. అయితే అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వరరాజు, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాడిపర్తి చంద్రశేఖర్, ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అసెంబ్లీకి ఈసారి కొత్తగా ఎన్నికయ్యారు.



రేగం మత్స్యలింగం
అరకు ఎమ్మెల్యే



మత్స్యరస విశ్వేశ్వరరాజు
పాడేరు ఎమ్మెల్యే



తాడిపర్తి చంద్రశేఖర్
ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే



బి.విరూపాక్షి
ఆలూరు ఎమ్మెల్యే

భవిష్యత్ ఏమిటో..?

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల సమయంలో కూటమి పార్టీలతో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో పెద్దగా సమస్యలపై మాట్లాడే వీలులేకుండా పోయింది. ఆ తర్వాత వైసీపీ శాసనసభ్యులు అసెంబ్లీ ప్రాంగణంలోకి అడుగు పెట్టలేదు. ఈ నెల 11వ తేదీ నుంచి జరుగుతున్న పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలకు దూరమయ్యారు. దీంతో వైసీపీ తరఫున కొత్తగా గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో 'అధ్యక్షా' అని పిలిచే అవకాశం కోల్పోయారు. భవిష్యత్‌లోనూ అసెంబ్లీకి వస్తారా? రారా? అన్నది ప్రస్తుతానికి సందేహమే. ఎందుకంటే.. ప్రతిపక్ష హోదా వైసీపీకి దక్కే చాన్స్ కనిపించడం లేదు. ఇచ్చేదాకా అసెంబ్లీకి రామంటూ జగన్ ప్రకటించారు. దీంతో కొత్తగా ఎన్నికైన నలుగురు ఎమ్మెల్యేలతో సహా మొత్తం 11 మంది వైసీపీ శాసనసభ్యులు అసెంబ్లీకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. వారి భవిష్యత్ జగన్ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

అనవాయితీని తప్పుదారి పట్టించారు: పెద్దిరెడ్డి

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు, అసెంబ్లీలో పీఏసీ చైర్మన్ పోస్టు ప్రతిపక్షానికి ఇవ్వాలి. ఆ అనవాయితీని కూటమి ప్రభుత్వం తప్పుదారి పట్టించింది' అని వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో 23 మందే ఉన్న టీడీపీకి ఆ పోస్టు ఇచ్చాం. కానీ కూటమి ప్రభుత్వం అనవాయితీకి విరుద్ధంగా వ్యవహరిస్తోంది' అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, 'పీఏసీ చైర్మన్ పోస్టును ప్రతిపక్షానికి ఇవ్వకుండా అధికారపక్షం అహంకారంతో వ్యవహరిస్తోంది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పీఏసీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించింది' అని అన్నారు.

మహిళలకు మంత్రి సవిత క్షమాపణలు చెప్పాలి: వైసీపీ

జగన్ బటన్ నొక్కుడు డబ్బుతో మహిళలు గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారంటూ మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలను వైసీపీ ఎమ్మెల్సీలు తీవ్రంగా ఖండించారు. మహిళలకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో తోట త్రిమూర్తులు, వరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, సిపాయి సుబ్రహ్మణ్యం, బొమ్మి ఇజ్రాయల్ మాట్లాడుతూ... 'బాధ్యత గల మంత్రిగా సవిత మహిళల్ని కించపర్చడం దుర్మార్గం. మంత్రి సత్యకుమార్ కూడా ముస్లిం మైనార్టీలను కించపరిచేలా మాట్లాడారు. మంత్రుల వ్యాఖ్యల వెనుక కూటమి పెద్దలున్నారని భావిస్తున్నాం' అని అన్నారు.

తొడ కొట్టడం కాదు.. పనులు చేయాలి: వెనిగండ్ల

తొడలు కొట్టడం, సవాళ్లు చేయడం కాదు.. అభివృద్ధి పనులు చేయడం ముఖ్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. తన నియోజకవర్గంలో ప్రజలకు మంచినీటి సరఫరాకు సంబంధించి శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే 20ఏళ్ల దమ్ము ఏపాటిదో.. నియోజకవర్గంలో తాగునీటి సరఫరా చూస్తే అర్థమవుతుందని కొడాలి నానిని ఉద్దేశించి అన్నారు. గత ఐదేళ్లు మంచినీటి పథకాల ఫిల్టర్ బెడ్లు బాగు చేయకుండా మురికి నీరు సరఫరా చేశారని, విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు దృష్టికి తీసుకెళ్లగానే.. ఆయన బాగు చేయించారని పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఆలయాల భూముల కబ్జాలన్నీ బయటకు తీస్తామని రాము అన్నారు.

బడి వేళలపై వింత నిర్ణయం: పీడీఎఫ్

రాష్ట్రంలో కొందరు నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చినప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ఆరోపించారు. 'ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పాఠశాలల పని వేళలు పెంచడం ఎందుకు? విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టేలా వింత నిర్ణయం తీసుకోవడం ఏంటి?' అని మండిపడ్డారు.

వైసీపీ పోటీ తుస్సు!

బలం లేక పీఏసీ ఓటింగ్ బహిష్కరణ.. పెద్దిరెడ్డికి ఒక్క ఓటూ రాని వైనం

» కూటమి అభ్యర్థుల సునాయాస ఎన్నిక



అసెంబ్లీలో పీఏసీ చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించిన పోలింగ్‌లో ఓటు వేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బలం లేకున్నా శాసనసభ ప్రజా పద్దుల సంఘం(పీఏసీ)లో సభ్యత్వం కోసం నామినేషన్ వేసిన వైసీపీ.. తీరా పోలింగ్ ముందే చేతులెత్తేసింది. ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో కూటమి అభ్యర్థులు సునాయాసంగా ఎన్నికయ్యారు. పీఏసీ సభ్యత్వానికి వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. ఉన్న 9 స్థానాలకు కూటమి అభ్యర్థులు కూడా నామినేషన్లు వేయడంతో పోలింగ్ అనివార్యమైంది. 175 స్థానాల అసెంబ్లీలో వైసీపీకి 11మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. పెద్దిరెడ్డి గెలవాలంటే 20 మంది ఓటేయాలి. ఆ అవకాశం లేకపోవడంతో తమకు విజయం అసాధ్యమని వైసీపీ నాయకత్వం గుర్తించింది. శుక్రవారం మేలుకొని ఈ ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. పెద్దిరెడ్డి శుక్రవారం ఉదయం అసెంబ్లీ ప్రాంగణానికి వచ్చి తమ పార్టీ నిర్ణయాన్ని మీడియా పాయింట్‌లో ప్రకటించారు. పీఏసీ చైర్మన్ పదవిని సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికి ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదని, దీనికి నిరసనగా ఈ ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ నిర్ణయంతో సంబంధం లేకుండా కూటమి ఎమ్మెల్యేలంతా తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా చూడాలని పార్టీల నాయకత్వాలు నిర్ణయించాయి. మంత్రి లోకేశ్ దీనిని పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సహా 164 మంది కూటమి ఎమ్మెల్యేల్లో 163మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అమెరికా ఎంబసీలో వీసా ఇంటర్వ్యూ ఉండడంతో రాలేదని తెలిసింది. ఆ ఇంటర్వ్యూ వాయిదా వేసుకుని వస్తే బాగుండేదని, నూటికి నూరు శాతం ఓటింగ్ జరిగినట్లు అయ్యేదని టీడీపీ ఎమ్మెల్యేల వద్ద లోకేశ్ వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఆయన శుక్రవారం జైపూర్‌లో రెండు పెళ్లిళ్లకు హాజరు కావలసి ఉంది. కానీ పీఏసీ పోలింగ్ దృష్ట్యా వెళ్లకుండా అసెంబ్లీలో ఉండిపోయారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ పోలింగ్ నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఎన్నికను బహిష్కరించడంతో ఆ పార్టీ అభ్యర్థి పెద్దిరెడ్డికి ఒక్క ఓటు కూడా రాలేదు. కాగా.. కూటమి ఎమ్మెల్యేల్లో ఒకరి ఓటు చెల్లలేదు. బ్యాలెట్ పత్రంపై నంబర్ వేయాల్సి ఉండగా ఆ ఎమ్మెల్యే టిక్కు కొట్టారు. దీంతో చెల్లకుండా పోయింది. టీడీపీ ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య(జగ్గయ్యపేట), జయనాగేశ్వర్‌రెడ్డి (ఎమ్మిగనూరు), అరిమిల్లి రాధాకృష్ణ (తణుకు), అశోక్‌రెడ్డి (గిద్దలూరు), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), నక్కా ఆనందబాబు (వేమూరు), కోళ్ల లలితకుమారి (ఎస్.కోట).. జనసేన నుంచి పులపర్తి రామాంజనేయులు (భీమవరం), బీజేపీ తరఫున విష్ణుకుమార్‌రాజు (విశాఖ ఉత్తరం) విజయం సాధించారు. వారి ఎన్నికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభాముఖంగా ప్రకటించారు. కాగా.. శాసనమండలి నుంచి ముగ్గురు సభ్యులు పీఏసీకి ఎంపికయ్యారు. వీరిలో వైసీపీ నుంచి పి.రామసుబ్బారెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, టీడీపీ తరఫున దువ్వారపు రామారావు ఉన్నారు.

పులపర్తి నిజాయితీపరుడు: సీఎం

పీఏసీ చైర్మన్‌గా ఎన్నిక కాబోతున్న జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శుక్రవారం సాయంత్రం అసెంబ్లీ లాబీల్లో చంద్రబాబును కలిశారు. ఆయనను సీఎం అభినందించారు. పులపర్తి నిజాయితీ, అంకిత భావం కలిగిన వ్యక్తి అని.. అందుకే ఆయన్ను పీఏసీ చైర్మన్‌గా ఎంపిక చేశామని వ్యాఖ్యానించారు. తనకు అవకాశం ఇచ్చినందుకు చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

శాసనసభ నిరవధిక వాయిదా

శాసనసభను స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిరవధికంగా వాయిదా వేశారు. శుక్రవారం సీఎం చంద్రబాబు ప్రసంగం అనంతరం స్పీకర్ సభలో సమితుల విజేతలను ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ 10 రోజులపాటు.. 59 గంటల 55 నిముషాలపాటు సమావేశాలు జరిగాయన్నారు. మంత్రులు 75ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతోపాటు 51 ప్రశ్నలకు సమాధానాలను సభ సమక్షంలో ఉంచారన్నారు. సీఎం, మంత్రులు సభలో 8 ప్రకటనలు చేశారని, 21 బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, వాటిని సభ ఆమోదించిందన్నారు. 120 మంది సభ్యులు ప్రసంగించారని తెలిపారు. సభలో 2 లఘు చర్చలతోపాటు 3 తీర్మానాలను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. 344 నియమం కింద ఒక చర్చ, ఒక సాధారణ ప్రతిపాదన చేపట్టిందన్నారు. విశాఖ డెయిరీ అవకతవకలపై ప్రత్యేక విచారణకు సభా సంఘాన్ని నియమించాలని సభ తీర్మానించిందని ప్రకటించారు. 3 ఆర్థిక సమితులకు జరిగిన ఎన్నికల్లో విజేతలను ప్రకటించారు.

ప్రజా పద్దుల కమిటీ: నక్కా ఆనందబాబు, రాధాకృష్ణ, అశోక్‌రెడ్డి, రామాంజనేయులు, జయనాగేశ్వరరెడ్డి, కోళ్ల లలితకుమారి, శ్రీరాం రాజగోపాల్, పులపర్తి రామాంజనేయులు, విష్ణుకుమార్‌రాజు

అంచనాల కమిటీ: అఖిలప్రియ, బండారు సత్యానందరావు, జయకృష్ణ, జోగేశ్వరరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, వాల్మీకి పార్థసారధి, సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు.

ప్రభుత్వరంగ సంస్థల కమిటీ: అయితాబత్తుల ఆనందరావు, ఈశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, గౌతు శిరీష, కూన రవికుమార్, వర్ల కుమార్‌రాజు, రంగారావు, తెనాలి శ్రావణ్‌కుమార్, వసంత వెంకట కృష్ణప్రసాద్

ముడుపుల మసక!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ హయాంలో సెకీతో కుదుర్చుకున్న ఒప్పందాలు రాష్ట్రానికి భారంగా మారే ప్రమాదముందని వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని రద్దు చేస్తారా అన్న ప్రశ్నకు.. ఆయన ఆచితూచి స్పందించారు. 'పెట్టుబడులు పెట్టే వారి విశ్వాసం దెబ్బ తినకుండా.. అదే సమయంలో ప్రజల కోణంలో కూడా ఆలోచించి నిర్ణయానికి వస్తాం. అన్ని వైపుల నుంచీ ఆలోచిస్తాం' అని తెలిపారు.

పార్లమెంటులో ఎండగట్టాలి...

సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి చంద్రబాబు తన నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. అదానీలపై అమెరికా కోర్టులో కేసులు నమోదైన నేపథ్యంలో పార్లమెంటు సమావేశాల్లో టీడీపీ వైఖరి ఎలా ఉండాలో వారికి ఆయన సూచనలు చేశారు. 'సౌర విద్యుత్ కొనుగోలు కోసం ఒప్పందాలు కుదుర్చుకోవడానికి జగన్మోహన్‌రెడ్డి రూ.1750 కోట్లు ముడుపులు తీసుకున్నారని అమెరికా సంస్థలు దాఖలు చేసిన చార్జిషీటుతో స్పష్టంగా తేలిపోయింది. జగన్ అవినీతిని, ముడుపుల వ్యవహారాన్ని బలంగా ఎండగట్టాలి. అదే సమయంలో బీజేపీ ఇబ్బంది పడకుండా చూడాలి. పార్లమెంటులో తలెత్తే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించండి' అని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం తీసుకురానున్న వక్ఫ్ బిల్లుపై ముస్లిం వర్గాల మనోభావాలను తాను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు వివరించానని, వాళ్లు కూడా తొందరపడే ఉద్దేశంలో లేరనే అనుకుంటున్నానని చంద్రబాబు చెప్పారు. ఒకవేళ బిల్లు పార్లమెంటు ముందుకు వస్తే ఏం చేయాలో అప్పుడు ఆలోచించుకుందామని వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో ఎంపీలు సమన్వయం చేసుకుని వెళ్లాలని, సమస్యలు రాకుండా చూసుకోవాలని ఆయన ఎంపీలకు సూచించారు. కేంద్రం నుంచి నిధుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను దృష్టిలో ఉంచుకోవాలని.. ప్రతి శాఖ పరిధిలో రాష్ట్రానికి లేగలిగే ప్రాజెక్టులపై అధ్యయనం చేసి పని చేయాలని చెప్పారు.

'బ్రాండ్ ఏపీ' నాశనం: రామ్మోహన్

పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రానికి రావలసిన వాటిని సాధించుకోవడానికి ప్రయత్నిస్తామని పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. టీడీపీపీ సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్ ఆచరణరూపం దాల్చడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. దానిని మార్గదర్శక పత్రంగా ఎంచుకుని పనిచేస్తాం. జగన్ తన ఐదేళ్ల పాలనలో 'బ్రాండ్ ఏపీ'ని సర్వనాశనం చేశాడు. మేం మళ్లీ పునర్నిర్మిస్తున్నాం' అని వివరించారు. అమరావతి, పోలవరంతో పాటు రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, ప్రాజెక్టులు సాధించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. కూటమికి లోక్‌సభలో ఉన్న 21 మంది ఎంపీలం వివిధ అంశాలపై సమష్టి నిర్ణయంతో పనిచేస్తామని, అప్పటి పరిస్థితిని బట్టి చర్చించుకుని తదనుగుణంగా వెళ్తామన్నారు.

జమిలి ఎన్నికలు 2029లోనే..!

పార్లమెంటు, అసెంబ్లీలకు కేంద్రం జమిలి ఎన్నికలు పెట్టినా అవి షెడ్యూల్ ప్రకారం 2029లోనే వస్తాయని, ముందుగా రావని సీఎం స్పష్టం చేశారు. విజన్-2047ను కింది స్థాయి వరకూ ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ఆలోచనలు చేస్తున్నామని తెలిపారు. 'కాలేజీలు, విశ్వవిద్యాలయాల వంటి వేదికలపై చర్చిస్తాం. ఈ విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్నామో అన్ని వర్గాలవారికీ తెలియడానికి ప్రణాళిక రూపొందించుకుని పనిచేస్తాం. మూడు నెలలో.. ఆరు నెలలో కాకుండా ఇది నిరంతరం జరుగుతూ ఉంటుంది. ప్రతి నెల, ప్రతి క్వార్టర్, ప్రతి ఏడాదికి లక్ష్యాలు పెట్టుకుని సాధించడానికి ప్రయత్నిస్తాం. ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి పురోగతి తెలుసుకుంటాను' అని వివరించారు. అనుకున్న మేర లక్ష్యాలు సాధించడానికి భారీగా వనరులు కావాలని, వినూత్న పద్ధతుల్లో నిధుల సేకరణకు ప్రయత్నిస్తామని తెలిపారు.

అదానీతో ఒక్క డీల్‌లోనే 1,750 కోట్లు

» ఐదేళ్లలో జగన్‌కు ఇంకెంత లంచం ముట్టిందో?

» రాష్ట్రాన్ని అదానీకి బ్లాంక్ చెక్‌లా రాసిచ్చారు

» ఇది రాష్ట్రానికి, వైఎస్ కుటుంబానికి అవమానం

» కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేయాలి: షర్మిల

» అదానీ దేశం పరువు తీస్తే.. జగన్ రాష్ట్రం పరువు తీశారని ధ్వజం

హైదరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'అదానీతో చేసుకున్న ఒక్క డీల్‌లోనే జగన్‌కు రూ.1,750 కోట్ల లంచం ముట్టింది. గత ఐదేళ్లలో అదానీతో ఆయన ఎన్నో ఒప్పందాలు చేసుకున్నారు. వాటన్నింటికీ కలిపి ఇంకెంత లంచం ముట్టి ఉంటుంది?' అంటూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రశ్నించారు. హైదరాబాద్ లోటస్ పాండ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రాన్ని అదానీకి బ్లాంక్ చెక్కులాగా జగన్ రాసిచ్చారని, ఆంధ్రప్రదేశ్‌ను అదానీప్రదేశ్‌గా మార్చేశారని ధ్వజమెత్తారు. ఇది రాష్ట్రానికే కాకుండా.. వైఎస్ఆర్ కుటుంబానికీ అవమానమని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అదానీతో జగన్ చేసుకున్న ఒప్పందాలన్నింటినీ సమీక్షించాలని, వాటిపైన విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబును ఆమె డిమాండ్ చేశారు. సోలార్ విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, ఆయన కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. అదానీ, జగన్ లంచాల బాగోతంపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందని, ఇది దేశానికి, రాష్ట్రానికి, వైఎస్ఆర్ కుటుంబానికీ అవమానమని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ దేశం పరువు తీస్తే.. జగన్ రాష్ట్రం పరువు తీశారని మండిపడ్డారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందంతో జగన్‌కు రూ.1,750 కోట్ల లంచం వస్తే.. రాష్ట్ర ప్రజలపైన మాత్రం సర్దుబాటు చార్జీల పేరుతో రూ.17 వేల కోట్ల భారం పడిందని, ఈ ఒప్పందం చేసుకున్నప్పుడు జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాలు గుర్తురాలేదా? అని షర్మిల నిలదీశారు. 'ఇదే అదానీ గుజరాత్‌లో యూనిట్ విద్యుత్తు రూ.1.99 చొప్పున ఇచ్చేలా అగ్రిమెంట్ చేసుకుంటే.. ఏపీతో మాత్రం రూ.2.49కి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ లెక్కన 25ఏళ్ల ఒప్పందంతో ప్రజలపై పడే భారం రూ.లక్ష కోట్లు. లంచం కోసం డిస్కామ్‌లను, ఏపీ ప్రజలను తాకట్టు పెట్టేందుకు సిద్ధపడిన జగన్‌కు ఎక్కడుంది క్రెడిబిలిటీ?' అని షర్మిల ప్రశ్నించారు. 'గంగవరం పోర్టుకు సంబంధించి రూ.9వేల కోట్ల విలువజేసే ప్రభుత్వ పది శాతం వాటాను కేవలం రూ.640 కోట్లకు అదానీకి కట్టబెట్టారు. కృష్ణపట్నం పోర్టును బెదిరించి అదానీకి ఇప్పించారు. రాష్ట్రం మొత్తం బొగ్గు సరఫరా చేసే కంట్రాక్టు, బీచ్ శాండ్ మైనింగ్, విశాఖలో సబ్‌మెరైన్ కంట్రాక్టులనూ వారికే కట్టబెట్టారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీపై అమెరికా అరెస్టు వారెంట్ జారీ చేసిన నేపథ్యంలోనైనా ఆయనపై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని, లేకుంటే అదానీ అవినీతిలో మోదీని కూడా భాగస్వామిగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. అదానీ విషయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా పునరాలోచన చేయాలని కోరారు. అమెరికా, భారత్ మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం అదానీని ఆ దేశానికి అప్పగించాలని, లేకుంటే ఆయనపై ఇక్కడ విచారణ జరిపించాలని, ఈ రెండింటిలో మోదీ ఏం చేయబోతున్నారని షర్మిల ప్రశ్నించారు.



నీకా చెల్లెలిపై ప్రేమ ఉంది?

» నీ సైతాన్ సైన్యంతో నా క్యారెక్టర్‌పై తప్పుడు ప్రచారం చేయించలేదా: షర్మిల

'నాకు, ప్రభాస్‌కు సంబంధం ఉన్నట్లుగా బాలకృష్ణకు చెందిన భవనం నుంచే ప్రచారం జరిగినట్లుగా ఇటీవల జగన్ ఒక వీడియోను చూపించారు. నిజంగా చెల్లెలిపై ప్రేమ ఉంటే.. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఏం చేశారు? గాడిదలు కాశారా? బాలకృష్ణపై ఎందుకు విచారణ జరిపించలేదు?' అంటూ షర్మిల నిలదీశారు. ఈ ప్రచారంపై కేసు పెట్టిన రోజే ప్రభాస్ అనే వ్యక్తిని ఇంతవరకు చూడలేదంటూ తన బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పానని గుర్తుచేశారు. ఈ రోజూ తన బిడ్డలపై ప్రమాణం చేసి అదే చెబుతున్నానని అన్నారు. 'జగన్‌కు ఇదంతా తెలిసి కూడా నాకు క్యారెక్టర్ లేనట్లుగా, ప్రభాస్‌తో సంబంధం ఉన్నట్లుగా గత ఐదేళ్లుగా తన సైతాన్ సైన్యంతో ప్రచారం చేయించలేదా? సిగ్గుండాలి. ఆయనకా చెల్లెలుపై ప్రేమ ఉన్నది?' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కేసు పెట్టినప్పుడు నేను మాట్లాడిన వీడియో పనికొస్తుందంటే మీరు వాడేసుకుంటారు. చెల్లెల్ని వాడేసుకుంటారు. తల్లి మీద కేసు పెడతారు. నాన్న పేరును సీబీఐ చార్జిషీట్‌లో చేర్పిస్తారు. మీరు ఏమైనా చేయగలరు. మీకు మీరే సాటి సార్!' అంటూ జగన్‌ను ఉద్దేశించి షర్మిల వ్యాఖ్యానించారు.

ఆ లంచం ఖరీదు 72వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారం కాదు. ఈ లంచాల బంధంవల్ల రాష్ట్ర ప్రజలపై సుమారు 72వేల కోట్ల భారం పడింది. 'జగన్-అదానీ' పరస్పర ప్రయోజనాలకు రాష్ట్రం ఆర్థికంగా బలైపోయే పరిస్థితి తలెత్తింది. నాడు అదానీకి మేలు చేయడానికి గత జగన్ ప్రభుత్వం అన్ని అడ్డదారులూ తొక్కింది. కేవలం అదానీకి తలుపులు తెరవడం కోసం.. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజీఈసీఎల్) పిలిచిన 10,000 మెగావాట్ల టెండర్లను రద్దు చేసింది. రైతాంగానికి పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేసేందుకు వీలుగా సోలార్ విద్యుత్తు సేకరించేందుకు ఏపీజీఈసీఎల్ 2021లో టెండర్లు పిలిచింది. యూనిట్‌ను రూ.2.49 ధరకు ఇచ్చేందుకు సోలార్ ఉత్పత్తి సంస్థలు ముందుకొచ్చాయి. అప్పట్లో దేశీయంగా సోలార్ విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.2.92గా ఉంది. ఏపీజీఈసీఎల్ పిలిచిన టెండర్‌కు స్పందిస్తూ సోలార్ సంస్థలు యూనిట్‌ను రూ.2.49కు ఇస్తామనడం అప్పట్లో జాతీయ స్థాయిలో బెంచ్ మార్క్‌గా మారింది. జగన్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే కొనుగోలు ఒప్పందాలు చేసుకునేది. అయితే అలా చేయలేదు. అదానీకి దోచిపెట్టడానికి స్కెచ్ వేశారు.

2021లో జగన్‌తో అదానీ భేటీ తర్వాత...

సెకీతో ఒప్పందం చేసుకున్న అదానీ, అజూర్ సంస్థలు 2021లో జగన్‌ను కలిశాయి. తాము 9,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించాయి. యూనిట్ ధరను రూ.2.92గా పేర్కొన్నాయి. అయితే.. అప్పటికే గుజరాత్ సెకీ నుంచి యూనిట్ సోలార్ విద్యుత్తును రూ.1.99కే తీసుకుంటోంది. అదే సమయంలో ఏపీజీఈసీఎల్ పిలిచిన టెండర్లకు బిడ్డర్లు యూనిట్ విద్యుత్తును రూ.2.49కే ఇస్తామంటూ ముందుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో అదానీ, అజూర్ నుంచి అంతే కంటే ఎక్కువ ధరకు యూనిట్‌ను రూ.2.92కు కొనుగోలు చేయడం అసాధ్యంగా మారింది. అదే సమయంలో జగన్‌తో అదానీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సోలార్ విద్యుత్తును యూనిట్‌ను రూ.2.31.. సెకీకి ఏడు శాతం కమీషన్ 17 పైసలు.. మొత్తంగా యూనిట్‌ను రూ.2.48కే ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నివాసంలో ఒప్పందం కుదిరింది. అయితే.. మరి సమస్యేముందనుకుంటున్నారా? చాలా ఉంది. ఎక్కడో రాజస్థాన్‌లో ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్తును ఏపీకి సరఫరా చేసేందుకు ట్రాన్స్‌మిషన్ చార్జీల కింద యూనిట్‌కు 80 పైసలు అదనంగా పడుతుంది. ఆ మొత్తం విలువ 30,600 కోట్లు. అదే ఏడాది సెకీ నుంచి గుజరాత్ సర్కారు యూనిట్ రూ.1.99కే కొంటున్నా జగన్ పట్టించుకోలేదు. 50 పైసలు అదనంగా ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. 'మేం సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. అదానీతో కాదు. ఇంకా లంచాల ప్రస్తావన ఎక్కడిది?' అని వైసీపీ పెద్దలు ప్రశ్నిస్తున్నారు. కానీ.. అసలు డ్రామా అక్కడే ఉంది. సెకీ విక్రయించేది అదానీ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసే విద్యుత్తునే! అంటే.. డిస్కమ్‌లు కొనేది అదానీ కరెంటునే! అంతా పారదర్శకంగా జరుగుతోందని చెప్పేందుకు సెకీని వాడుకున్నారని అమెరికా దర్యాప్తు సంస్థలు కూడా తెలిపాయి. మరోవైపు.. అదానీ, అజూర్ సంస్థలతో సెకీ ఒప్పందాన్ని చేసుకుందంటూ ఈ పీపీఏలను ఆమోదిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఏపీఈఆర్‌సీ స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ.. సెకీతో రాష్ట్ర ఇంధన సంస్థలు కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటే అదానీ ప్రస్తావన ఎందుకు వస్తోందని జగన్ అమాయకంగా ప్రశ్నిస్తున్నారు.

రివర్స్ టెండరింగ్ ఏదీ?

కాంట్రాక్టు విలువ రూ.100 కోట్లను మించితే రివర్స్ టెండరింగ్‌కు వెళ్లాలన్నది జగన్ ప్రభుత్వ విధానం. కానీ 25 ఏళ్ల కాలానికి 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును యూనిట్ ధర రూ.2.49 చొప్పున కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకుంది. దీని విలువ రూ.95,429 కోట్లు! దీనిపై జగన్ సర్కారు రివర్స్ టెండరింగ్‌కు వెళ్లలేదు. వెళ్లిఉంటే... అప్పటికే గుజరాత్‌కు యూనిట్‌ను రూ.1.99 ధరకు ఇస్తున్నందున ఆ స్థాయిలో ధరను తగ్గించేదని నిపుణులు చెబుతున్నారు. రివర్స్ టెండరింగ్‌కు వెళ్లకుండా, ధర తగ్గించకుండా ఉండేందుకే జగన్‌తో అదానీ సంప్రదింపులు జరిపారని అంటున్నారు. కొవిడ్ ఉధృతంగా ఉన్న సమయంలో 2021 డిసెంబరు 1న రాష్ట్ర ఇంధన శాఖ, డిస్కమ్‌లతో పాటు సెకీ, కేంద్ర ఇంధన శాఖ, ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ సప్లయ్ కార్పొరేషన్ (ఏపీజీఈసీఎల్ పేరు మార్చారు) 7,000 మెగావాట్ల కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి.

తుంగభద్రకు 33 గేట్లు ఒకేసారి మార్చేయాలి!

» నిపుణులతో అధ్యయనం చేయించాలి

» క్రస్ట్‌గేట్లపై డీపీఆర్ సిద్ధం చేయించాలి

» తుంగభద్ర అకౌంట్స్ ఫ్రీజ్ తొలగించాలి

» టీబీపీ బోర్డు భేటీలో కీలక నిర్ణయాలు

కర్నూలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): "తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల జీవిత కాలం అయిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయడం సరైంది కాదు. మరో క్రస్ట్‌గేటు కొట్టుకుపోదని గ్యారెంటీ ఇవ్వలేం. అత్యాధునిక డిజైన్‌తో 33 క్రస్ట్‌గేట్లు కొత్తగా ఏర్పాటు చేయడమే పరిష్కారం" అని సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 33 గేట్లు ఏకకాలంలో మార్చడంపై తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు(టీబీపీ బోర్డు) దృష్టి పెట్టింది. ఇలా ఒకేసారి 33 గేట్లు మార్చడం సాధ్యమేనా? ఎంత నిధులు కావాలి? అనే అంశంపై ఆరా తీసింది. దీనికి సంబంధించి డిసెంబరులోగా క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించి, పూర్తిస్థాయి ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) తయారు చేయించాలని నిర్ణయించింది. ఈ మేరకు చైర్మన్ పాండే అధ్యక్షతన టీబీపీ బోర్డు పేర్కొంది. శుక్రవారం హోస్పేట్‌లో బోర్డు భేటీ జరిగింది. బోర్డు సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, కర్ణాటక రాష్ట్ర సభ్యుడు కులకర్ణి, బోర్డు ఎస్ఈ నీలకంఠారెడ్డి, ఏపీ రాష్ట్ర సభ్యుడి తరఫున అనంతపురం జిల్లా హెచ్ఎల్ఎంసీ సీఈ నాగరాజు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తరఫున రిచాపి త్ర, తెలంగాణ సభ్యుడు, ఈఎన్‌సీ అనీల్ వర్చువల్‌గా పాల్గొన్నారు. జలాశయంలో పూడిక చేరడంతో 30 టీఎంసీలకు పైగా నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఆ నీటిని వినియోగించుకునేలా కర్ణాటక ప్రభుత్వం 31 టీఎంసీలతో నవలీ జలాశయం నిర్మాణానికి ప్రతిపాదిస్తోంది. దీనికి రూ.15 వేల కోట్ల వ్యయం అవుతుందని బోర్డు సమావేశంలో తెలిపింది. డీపీఆర్‌ను అధ్యయనం చేయాల్సి ఉండడంతో నవలీ రిజర్వాయర్‌కు ఏపీ అభ్యంతరం చెప్పింది. రాయలసీమ జిల్లాలకు తుంగభద్ర వరద జలాలు వినియోగించుకునేలా తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ(హెచ్చెల్సీ)కు సమాంతరంగా మరో కాలువ నిర్మించే తేల్చాలని పేర్కొంది. కాగా, తెలంగాణ ఈ రెండింటినీ వ్యతిరేకించినట్లు సమాచారం.

జీతాలు ఇవ్వకపోతే ఎలా?

"తుంగభద్ర బోర్డు అకౌంట్ ఫ్రీజ్ కావడంతో ఉద్యోగులు జీతాలు లేకుండా ఎలా పని చేస్తారు? బోర్డు సెక్రెటరీ, ఎస్ఈలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి తక్షణమే అకౌంట్ ఫ్రీజ్ తొలగించాలి" అని పాండే ఆదేశించారు. తుంగభద్ర దిగువ, ఎగువ కాలువల సీసీ లైనింగ్ కోసం రూ.400 కోట్లతో టెండర్లు పిలిచి.. అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే, ఏపీ ప్రభుత్వం ఇటీవల తెచ్చిన టెండర్ల జీవో(టెండర్లు దక్కించుకుని పనులు ప్రారంభించని వాటిని రద్దు చేసే అధికారం) బోర్డుకు వర్తించదని స్పష్టం చేశారు.



విజన్‌తో ముందుకు

2047కి హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్: చంద్రబాబు

అమరావతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమతుల్యం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దేనికైనా ఓ విజన్ ఉండాలని, ఆ విజన్‌కు కావాల్సిన పునాదిని పటిష్ఠంగా వేసుకుంటే అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. శుక్రవారం శాసనసభలో విజన్-2047 డాక్యుమెంట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. స్వర్ణాంధ్ర సాధనకు ప్రజల ఆదాయం, ఆరోగ్యం, సంతోషం ముఖ్యమన్నారు. పేదరిక నిర్మూలనే ప్రధాన అజెండాగా పది కీలక సూత్రాలతో విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆ డాక్యుమెంట్‌లోని అంశాలు, రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో పాటు గత వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసాలను వివరిస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. "చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు చేయని తప్పులు చేశారు. వ్యవస్థలు పూర్తిగా విధ్వంసం అయ్యాయి. అధికార యంత్రాంగం నిర్వీర్యం అయిపోయింది. అప్పులు పరాకాష్ఠకు చేరాయి. నిత్యం తప్పుడు ప్రచారాలు చేసే పరిస్థితికి వచ్చారు. అసత్యాలను పదేపదే చెప్పి ప్రజల్ని మభ్యపెట్టాలని చూశారు. ఇలాంటి విచిత్రమైన పరిస్థితి 45 ఏళ్ల రాజకీయాల్లో ఎప్పుడూ చూడలేదు. కూటమికి స్పష్టమైన మెజార్టీ ఇచ్చి ప్రజలు గెలిచారు. ఇక రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత గెలిచిన అభ్యర్థులపై ఉంది. విజన్ డాక్యుమెంట్లపై కొత్తగా కసరత్తు చేయడంలేదు. దేశంలోనే తొలిసారిగా.. 1999లోనే విజన్-2020 ప్రకటించాం. స్వర్ణాంధ్ర-2047కు సరైన పునాది వేసుకోగలిగితే ఎవరు వచ్చినా ముందుకు వెళ్తారు. మళ్లీ దుర్మార్గుడైన జగన్ వస్తే ఏం జరుగుతుందో చెప్పలేం.

ప్రజలను సమాయత్తం చేయాలి

పెట్టుబడులు పెట్టాలంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో పారిశ్రామిక వేత్తలు చూస్తారు. భద్రత లేకుంటే రారు. వారికి భద్రత ఇచ్చే బాధ్యత నేను తీసుకున్నా. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ రాజకీయ నాయకులెవరైనా ఇష్టానుసారంగా రౌడీ రాజకీయం, నేర రాజకీయం చేస్తామంటే పెట్టుబడిదారులు ఆలోచిస్తారు. శాంతిభద్రతలు అదుపులో లేకుండా, అభద్రతా భావం ఉంటే వారు రారు. ఈ విషయాన్ని పదే పదే ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ఎమ్మెల్యేలు నియోజకవర్గ పరిధిలో విజన్‌ను తయారు చేసుకోవాలి. సమాజంలో సంపద సృష్టి పీ3 వల్ల సాధ్యమైంది. ఇప్పుడు నేను పీ4 అని చెబుతున్నా. ఎవరి వద్ద అయితే సంపద ఉందో అది ప్రజల నుంచి వచ్చింది. కాబట్టి పదిమంది పేదవాళ్లను పైకి తీసుకువచ్చే బాధ్యత సంపన్నులు తీసుకోవాలి. సమాజంలో పెరుగుతున్న ఆర్థిక



అసమానతలను తగ్గించాలంటే వినూత్నంగా ఆలోచించాలి.

17 లక్షల మంది అభిప్రాయాలు సేకరించాం

విజన్ డాక్యుమెంట్ రూపొందించడానికి మండల, మున్సిపల్ స్థాయిలో వర్క్‌షాపులు పెట్టాం. 936 మండలాల్లో, 465 మున్సిపాలిటీల్లో 10,078 గ్రామ పంచాయతీల్లో అభిప్రాయాలు తీసుకున్నాం. 26 జిల్లాల్లో ఎమ్మెల్యేలు సమావేశాలు ఏర్పాటు చేశారు. మొత్తం 17లక్షల మంది స్వర్ణాంధ్రప్రదేశ్-2047 డాక్యుమెంట్‌పై స్పందించారు. అందులో 56శాతం

> **నేను గేర్ మారుస్తా...**
>
> 'డిసెంబర్ 1 నుంచి నేను కూడా గేర్ మార్చాలని అనుకుంటున్నాను. ఆరు నెలలు అయింది. రోడ్ మ్యాప్ ఇచ్చాను. పాలసీలు ఇచ్చాను. విజన్ ఇచ్చాను. ఇప్పుడు జవాబుదారీ తనం తీసుకువచ్చి ప్రజాచైతన్యం తీసుకువచ్చేలా పాలన సాగిస్తాం. నేను రాష్ట్రం గురించి ఆలోచిస్తాను. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గ బాధ్యత తీసుకోవాలి. ఒకవైపు రూ.9.784 లక్షల కోట్లు అప్పులు కట్టాలి. సంపద సృష్టించాలి. ఆదాయం పెంచాలి. సూపర్-6, ఎన్నికల హామీలు నెరవేర్చాలి. విజన్ డాక్యుమెంట్‌లో కొత్త వర్షన్స్ వస్తాయి. ఇది విజన్ 4.0 వర్షన్ 1 మాత్రమే. ఐదేళ్లలో ఐదు వర్షన్స్ తీసుకొస్తాం. ఏటా ప్రజలకు విజన్ ద్వారా ఏం సాధించాం. ఏం సాధించలేదు. ఎందుకు చేయలేకపోయామన్న విషయాన్ని వివరిస్తాం. ఐదోసారి సీఎం అయితే విజన్ 5.0 కూడా తీసుకువస్తాం. నేను తొమ్మిదోసారి ఎమ్మెల్యే అయ్యాను. పదోసారి కూడా అవుతాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

> రాజకీయం చేసేది ప్రజలకు కోసం తప్ప స్వార్థం కోసం కాదు. ఎంతో మంది త్యాగాలు చేస్తే స్వాతంత్ర్యం వచ్చింది. వాటి ఫలితాలను వృథా చేయకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది. విజన్-2047కు ఒక పవిత్రత ఉంది. స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి వందేళ్లు పూర్తవుతాయి. శతాబ్దకాలంలో ఏం చేశామో గర్వంగా చెప్పుకోవాల్సిన అవసరం మనపై ఉంది. - సీఎం చంద్రబాబు

మంది మహిళలు ఉన్నారు. 28శాతం యువత, 17శాతం రైతులు, 5 శాతం సీనియర్ సిటిజన్స్ స్పందించి వారి సలహాలు, సూచనలు అందించారు. మహిళలు ఎక్కువ మంది భాగస్వామ్యం కావడం నాకు ఆనందం కలిగింది. దేశంలో చాలా విజన్ డాక్యుమెంట్లు తయారు చేశారు కానీ 17లక్షల మంది అభిప్రాయాలు ఇవ్వడం మన రాష్ట్రంలోనే జరిగింది. భవిష్యత్తులో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలి. ఎమ్మెల్యేలు కూడా విజన్-2047పై సూచనలు ఇవ్వాలి.

2047 నాటికి తలసరి ఆదాయం రూ. 42,000

రాష్ట్రంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 3,200 నుంచి రూ. 42,000 వేలకు తీసుకువెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భవిష్యత్‌లో టూరిజంలో చాలా ఉద్యోగాలు వస్తాయి. టూరిజం నుంచి ఇప్పుడు 4 శాతం ఉన్న జీఎస్‌డీపీ 2047కి 20 శాతానికి పెంచాలని ఆలోచిస్తున్నాం. భవిష్యత్ మార్పే పాలసీలు తీసుకురావడంతో పాటు వాటిని అమలు చేసే నాయకత్వం కావాలి.

30 నెలల్లో అమరావతి.. 2027 నాటికి పోలవరం

అమరావతిని 30 నెలల్లో ఒక కొలిక్కి తీసుకువస్తాం. రూ. 50వేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నాం. ఆరు నెలల్లో ఎమ్మెల్యేలకు క్వార్టర్స్‌ను ఇచ్చేస్తాం. పోలవరాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఉత్తరాంధ్ర, రాయలసీమలకు నీరు ఇస్తాం. మార్చి 2026కి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తాం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం.

పత్తి తేమ శాతంలో సడలింపులివ్వాలి

గుంటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లకు సంబంధించి తేమ శాతంలో సడలింపు ఇవ్వాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మార్కెటింగ్ అధికారులు సమస్యని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు లేఖ రాయించారు.

బొత్స-పవన్ ఆత్మీయ ఆలింగనం



శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. పీఏసీ ఎన్నికల్లో పవన్ ఓటు వేసి బయటకు వస్తుండగా బొత్స ఎదురుపడ్డారు. పవన్‌ను చూసి ఆగి పలకరించారు. దగ్గరకు రాగానే ఆలింగనం చేసుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. అనంతరం పవన్ వెళ్లిపోయారు. ఈ సంఘటన జరిగినప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ పక్కనే ఉన్నారు. కానీ ఆయన పవన్ వంక చూడకుండా మరోవైపు వెళ్లిపోయారు.

'ఉపాధి'లో అవకతవకలపై
విచారణ చేస్తాం

- కొత్తగా పని కోరుకునేవారికి 15 రోజుల్లోపు జాబ్ కార్డులు: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసినట్లుగానే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూడా భ్రష్టు పట్టించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఇటీవల సమీక్షలు నిర్వహించినప్పుడు ఈ పథకం అమలులో అనేక అవకతవకలు బయటకు వచ్చాయని, వాటిపై లోతుగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, శ్రీరాం రాజగోపాల్, ప్రత్తిపాటి పుల్లారావు, కె.మురళీమోహన్, పల్లె సిందూరరెడ్డి అడిగిన ప్రశ్నలకు పవన్ సమాధానమిచ్చారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. కొత్తగా పేర్లు నమోదు చేసుకున్నవారికి 15 రోజుల్లోపు జాబ్ కార్డులు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు చేసి 7 కోట్ల పని దినాలు కల్పించామని తెలిపారు. 'పల్లె పండుగ' కార్యక్రమంలో 3 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 20 వేల మినీ గోకులం షెడ్లు, అవసరమైనచోట్ల వాటర్ హార్వెస్టింగ్ పనులు చేపట్టామని, వచ్చే సంక్రాంతిలోపు ఈ పనులన్నీ పూర్తి చేయాలనే బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రతి పంచాయతీలో సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులు ఏర్పాటు చేశామని, జాబ్‌కార్డుల జారీలో అవకతవకలను అరికడతామన్నారు. 100 రోజులు పని కల్పించలేకపోతే పరిహారం చెల్లిస్తామన్నారు. తీరప్రాంత కోత నియంత్రణకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని చెప్పారు.

ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల సమస్యకు శాశ్వత పరిష్కారం: సత్యకుమార్

ఉద్దానంలో అనేక మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటం, అనేకమంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కల్గిస్తోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చెప్పారు. త్వరలోనే ఉద్దానంలో పర్యటించి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తానని తెలిపారు. ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటరులో వైద్యులను నియమించి వారికి ఇన్సెంటివ్స్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. కిడ్నీ రోగులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.10వేల నుంచి రూ.15 వేలకు పెంచాలనే ప్రతిపాదనను ఆర్థిక శాఖ దృష్టికి తీసుకువెళతామన్నారు. తిరువూరు నియోజకవర్గంలోనూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారని, అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, టీటీడీలో భక్తులకు కేటాయించే గదులకు డిపాజిట్ వాపసు ఇవ్వడం లేదని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమాధానమిస్తూ నిర్దిష్టమైన ఫిర్యాదు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

> **పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామికాభివృద్ధి కలిసి సాగాలి**
>
> - మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూస్తాం: పవన్ కల్యాణ్
>
> 'పర్యావరణాన్ని పరిరక్షించుకొంటూనే పారిశ్రామిక అభివృద్ధి సాధించాలి. ఈ క్రమంలో మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బందులు లేకుండా చూస్తాం' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మత్స్యకార, ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. 'తీరం వెంబడి ఉన్న పరిశ్రమలు వ్యర్థాలను శుద్ధి చేసి, నిర్దేశిత ప్రాంతంలోనే వాటిని వదిలేలా చూస్తాం. తద్వారా మత్స్య సంపదకు నష్టం కలగకుండా చర్యలు చేపడతాం' అని చెప్పారు. కాగా, 25 నుంచి జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై జనసేన ఎంపీలకు పవన్ సూచనలు చేశారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీలతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, సి.ఆదినారాయణరెడ్డితో వేర్వేరుగా సమావేశమయ్యారు. కాగా, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, దౌర్జన్యంగా భూ దురాక్రమణలపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, బాధితులు, సంబంధిత శాఖల నుంచి ఇలాంటి ఫిర్యాదులు అందినపుడు వెంటనే స్పందించాలని పోలీస్ శాఖకు పవన్ కల్యాణ్ సూచించారు.

లోకాయుక్త స్ఫూర్తిని కొనసాగిస్తాం

- మండలిలో సవరణ బిల్లును ప్రవేశపెట్టిన లోకేశ్

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత లేకపోయినా లోకాయుక్త స్ఫూర్తిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. శుక్రవారం మండలిలో లోకాయుక్త సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాసనసభలో ప్రతిపక్షనేత లేని నేపథ్యంలో లోకాయుక్త మెంబర్స్ సెలెక్షన్ కమిటీ గురించి ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సవరణ బిల్లు ప్రవేశపెట్టామన్నారు. గతంలో ముఖ్యమంత్రి చైర్మన్‌గా, స్పీకర్, హోంమంత్రి లేదా ఏదైనా శాఖ మంత్రి, ప్రతిపక్షనేత, కౌన్సిల్ చైర్మన్ సభ్యులుగా ఉండేవారని, ప్రస్తుతం ప్రతిపక్షనేత లేకపోవడంతో మిగిలిన నలుగురు సభ్యులతో లోకాయుక్త కమిటీ ఉంటుందన్నారు. చైర్మన్ నియామకానికి సంబంధించి ఈ బిల్లు ప్రవేశపెట్టామన్నారు. పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతిపక్షనేత లేని కారణంగా ఆయనను మినహాయిస్తూ లోకాయుక్త కమిటీలోకి ప్రతిపక్ష సభ్యుడిని తీసుకోవాలని సూచించారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ సవరణ బిల్లులో ప్రతిపక్షనేత లేని సమయంలో అని మాత్రమే ఉందన్నారు. తాము తీసేయలేదన్నారు.

మంత్రి సవిత వ్యాఖ్యలపై గందరగోళం

రాష్ట్రంలో వెనుకబడిన బలహీన వర్గాల సంక్షేమంపై చర్చ సందర్భంగా శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో గందరగోళం తలెత్తింది. గత ప్రభుత్వంలో బలహీన వర్గాలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విమర్శించారు. గత సీఎం జగన్ కాపు ద్రోహిగా, బ్రాహ్మణ ద్రోహిగా మిగిలారన్నారు. గతప్రభుత్వంలో స్వయం ఉపాధి లేక కొంతమంది యువకులు గంజాయి, మందుకు అలవాటుపడ్డారన్నారు. దీనిపై వైసీపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మంత్రి మహిళలను అవమానించారని ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, మహిళలకు క్షమాపణ చెప్పాలని, మంత్రి డౌన్ డౌన్ అంటూ చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. దీనికి ప్రతిగా టీడీపీ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి వైసీపీ సభ్యులు బీసీ మంత్రిని అవమానిస్తున్నారని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గందరగోళం నెలకొనడంతో చైర్మన్ సభను వాయిదా వేశారు. తిరిగి సభను 11.48 గంటకు ప్రారంభించారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ మంత్రి సమాధానం చెప్పకుండా డీ టీటీలు అని, గంజాయి అని మాట్లాడడం సరికాదని, ఆ మాటలను రికార్డుల నుంచి తొలగించాలని అన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ తన మాటలు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంత్రి మాటల్లో అన్‌పార్లమెంటరీ పదాలు ఉంటే రికార్డుల నుంచి తొలగించాలని చైర్మన్ ఆదేశించారు.

2027 నాటికి పోలవరం పూర్తి చేస్తాం: నిమ్మల

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానంగా చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోని 159 పాఠశాలల్లో 1,659 మంది అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. ఎస్సీ, బీసీ గురుకులాల్లోని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వేతనాలు పెంచే ప్రతిపాదనలు ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం కొనసాగుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. రాయలసీమ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ పెడుతున్నామన్నారు.

భోగాపురం ఎయిర్ పోర్టుకు అల్లూరి పేరు

విజయనగరంజిల్లాలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని శుక్రవారం శాసనమండలి తీర్మానం చేసింది.

పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వలేదని వైసీపీ వాకౌట్

మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్షానికి ఇవ్వడం సంప్రదాయం వస్తున్నదని చెప్పారు. ఆ సంప్రదాయాన్ని పాటించనందుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ పీఏసీ ఎన్నికల పోలింగ్ జరిగిందని, మీ నాయకుడు ఓటు వేయడానికే రాలేదని, వెళ్లి మీ నాయకుడ్నే అడగాలన్నారు.

21 బిల్లులకు ఆమోదం: శాసనమండలి సమావేశాలు 9 రోజులు జరిగాయని, 30 గంటల 30 నిమిషాలపాటు సభ జరిగిందని చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తెలిపారు. 21 బిల్లులకు సభ ఆమోదం తెలిపిందన్నారు. శాసనమండలిని నిరవధిక వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

స్వర్ణాంధ్ర సాధనకు
దశ సూత్రాలు

- పేదరిక నిర్మూలనే ఎజెండాగా విజన్-2047 ఆవిష్కరణ
- 'డిస్కవర్ ఆంధ్రప్రదేశ్' బ్రాండ్ అభివృద్ధిపై దృష్టి
- పారిశ్రామిక పార్కులతో భారీగా ఉపాధి కల్పన
- 2 మెగా పోర్టులు, 3 అంతర్జాతీయ విమానాశ్రయాలు
- తక్కువ ధరకే సౌర, పవన విద్యుత్తు.. కృత్రిమ మేధ కేంద్రంగా ఆంధ్ర

అమరావతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సహజ వనరులను వినియోగించుకుంటూ, రాష్ట్ర స్థితిగతులు పూర్తిగా మార్చేలా స్వర్ణాంధ్రప్రదేశ్-2047 పేరుతో 10 సూత్రాల ప్రణాళికను టీడీపీ కూటమి ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం, ప్రతి ప్రాంతానికీ ప్రయోజనం కలిగేలా.. సహజ వనరులను అభివృద్ధికి ఉపయోగించుకునేలా ఈ దశ సూత్రాలను రూపొందించారు. సీఎం చంద్రబాబు శుక్రవారం అసెంబ్లీలో ఆవిష్కరించిన విజన్-2047లో.. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన ప్రధాన ఎజెండాగా ఉన్నాయి. నైపుణ్యం గల మానవ వనరుల అభివృద్ధి, ప్రపంచస్థాయి ఉత్తమ రవాణా సదుపాయాలు, డీప్ టెక్ పరిజ్ఞానానికి పెద్ద పీట వేశారు. దశ సూత్రాలివీ..

1. పేదరిక నిర్మూలన..

ప్రతి కుటుంబానికీ సొంత ఇంటి స్థలం, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సాగునీరు, పైపుల ద్వారా నీటి సరఫరా, 24 గంటలూ కరెంటు, సురక్షిత ఇంధనం, డ్రైనేజీ సౌకర్యం, సోలార్ రూఫ్‌టాప్, డిజిటల్ కనెక్టివిటీ. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామికవేత్తకు ప్రోత్సాహకం. ప్రభుత్వ ఆరోగ్యం, విద్యా, నైపుణ్య పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ సామాజిక భద్రత కల్పన. తక్కువ ధరకే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడం.. సమగ్ర బీమా కల్పనతో పాటు, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతిపాదించిన పీ-4 విధానంలో ప్రజలను భాగస్వాములను చేయడం, తెలుగు ఎన్నారైల సహకారంతో పేదరికం నిర్మూలనకు కృషి.

2. ఉపాధి కల్పన..

ప్రపంచ స్థాయి పారిశ్రామిక పార్కులు, టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఉద్యోగాలు అందుబాటులోకి తెచ్చి గ్రామాలు, టౌన్లను ఆర్థికంగా బలోపేతం చేయడం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు.. మహిళా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, మెరుగైన, ప్రపంచస్థాయి ఉత్పత్తుల తయారీకి కావసిన సౌకర్యాలు కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాల సృష్టి. పది లక్షల వర్క్‌స్టేషన్ల సృష్టి. గ్రామాల్లో, పట్టణాల్లో అనుకూలంగా ఉండే ఒక చిన్న ఇంట్లో నలుగురైదుగురు పని చేసుకునే విధంగా ఏర్పాట్లు. ఇంట్లో పని చేయడం ఇబ్బందిగా ఉన్నవారికి వర్క్‌స్టేషన్‌లో పని చేసుకునే అవకాశం.

3. నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి..

అన్ని ప్రాంతాల్లోని విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణ కోసం రిమోట్ కేంద్రాల ఏర్పాటు.. ఆరో తరగతి నుంచే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయడం, 100 శాతం డిజిటల్ అక్షరాస్యత సాధన, విద్యాలయాల్లో నైపుణ్యాల నాణ్యత కోసం స్కిల్ ఆడిటింగ్ సెల్ ఏర్పాటు. 5వ తరగతి చదివేవాళ్లకు 15 ఏళ్ల తర్వాత ఎలాంటి విజ్ఞానం అవసరమో అలాంటి సబ్జెక్టు తీసుకురావడం.. ఆరోగ్యానికి కూడా టెక్నాలజీ వినియోగం.

4. నీటి సంరక్షణ..

ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా.. పరిశ్రమలు సహా అన్ని రంగాల్లోనూ సమర్థ నీటి నిర్వహణ.. వ్యవసాయం, ఇతర రంగాలకు మెరుగైన నీటి సరఫరా కోసం నదుల అనుసంధానం.. రాష్ట్రంలో సాగుకు అనువుగా ఉన్న ప్రతి ఎకరాకు నీరివ్వడం.. డ్రిప్ ఇరిగేషన్ లాంటి ఉపయోగపడే విధానాలు అమల్లోకి తేవడం, వర్షపు నీటిని వినియోగించుకోవడం లాంటి విధానాల ద్వారా నీటి సంరక్షణ. గోదావరి జలాలు గోదావరి నుంచి బనకచర్ల వరకూ.. అటు ఎడమ వైపు వంశధార వరకూ నీళ్లు తీసుకెళ్తే దక్షిణ భారతంలో ఆంధ్ర నంబర్ వన్ అవడంతో పాటు వేరే రాష్ట్రాలకు కూడా నీరివ్వొచ్చు.

5. రైతు-వ్యవసాయ టెక్నాలజీ

ప్రపంచ స్థాయిలో ఉత్తమ విధానాలు, ప్రమాణాల అమలుతో రైతుల ఆదాయం పెంపు.. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, నిల్వ, ఎగుమతుల కోసం ఉత్తమ విధానాలు అవలంబించడం.. భూసారం పెంచడానికి, వ్యవసాయ ఖర్చు తగ్గించడం కోసం ఏపీ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) విస్తరణ.. ఉద్యానవన, ఆక్వాకల్చర్ క్లస్టర్లకు ప్రోత్సాహం. కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లు, రోబోటిక్స్, శాటిలైట్ టెక్నాలజీ ద్వారా క్రిమికీటకాలను గుర్తించి నియంత్రించడం.. సాగు వసతుల పెంపు.. భూసారం పర్యవేక్షణ.. పంట ఆరోగ్యం, ఉత్పాదకత ఎప్పటికప్పుడు అంచనా.. గ్లోబల్ మార్కెట్లలో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను ఏపీలోనే తయారుచేయడం.. ఆక్వాకల్చర్, హార్టీకల్చర్, కాఫీ, మసాలా దినుసులు, నూనె గింజలకు ప్రత్యేకమైన హబ్‌ల ఏర్పాటు..

6. ప్రపంచస్థాయి ఉత్తమ రవాణా సదుపాయాలు

రాష్ట్ర, జాతీయ హైవేల కనెక్టివిటీ ద్వారా రవాణా సౌకర్యాల మెరుగుదల.. రాష్ట్రవ్యాప్తంగా హైస్పీడ్ రైల్ ట్రాకుల ఏర్పాటు.. రెండు మెగా పోర్టుల నిర్మాణం, మూడు అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాల ఏర్పాటు.. సరుకు రవాణాకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలతో రెండు కోస్టల్ ఎకనమిక్ జోన్ల ఏర్పాటు.. విశాఖ, మచిలీపట్నం, అనంతపురం, ఓర్వకల్లులో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు.. 4జీ, 5జీ, 6జీ స్థాయి సామర్థ్యం గల టెలికాం సేవలు అందుబాటులోకి తేవడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపరచడం.

7. తక్కువ ధరలకే విద్యుత్..

సౌర, పవన, పంప్డ్ విద్యుత్‌ను రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరలకే అందుబాటులోకి తేవడం.. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ల ఏర్పాటు.. 2047 నాటికి కర్బన ఉద్గారాలను జీరో చేసి, స్థిరమైన వృద్ధి సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం.. పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ యోజనలతో ప్రతి ఇంటినీ గ్రీన్ హౌస్‌గా మార్చడం.

8. అత్యుత్తమ ఉత్పత్తుల తయారీ

ఇన్నొవేషన్ జిల్లాలను అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు, యూనివర్సిటీలు, కార్పొరేషన్లకు అనుసంధానించడం, ఇన్నొవేషన్‌కు అనుగుణంగా ఇంక్యుబేషన్ పార్కులు, పరిశోధన కేంద్రాల ఏర్పాటు.. 'డిస్కవర్ ఆంధ్రప్రదేశ్'ను గ్లోబల్ బ్రాండ్‌గా అభివృద్ధి చేయడం, ఆక్వాకల్చర్ ఉత్పత్తుల ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు.

9. స్వచ్ఛాంధ్ర..

స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన పరిసరాలు అందరికీ అందుబాటులోకి తేవడం.. టెక్నాలజీ ఆధారిత వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు.. ప్రపంచ స్థాయిలో జీవించడానికి అత్యంత అనువైన నగరాల జాబితాలో రాష్ట్రం నుంచి రెండు ప్రాంతాలను చేర్చడం.. గ్రీన్ బాండ్లు, కార్బన్ క్రెడిట్స్ ట్రేడింగ్‌కు ప్రోత్సాహం.

10. డీప్ టెక్..

ప్రపంచస్థాయిలో ఏపీని ఏఐకి హబ్‌గా మార్చడం.. అదే స్థాయిలో టెక్నాలజీ సేవలందించే 4 హబ్‌ల ఏర్పాటు.. దేశ డ్రోన్ రాజధానిగా రాష్ట్రం అభివృద్ధి.. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, జీనోమిక్స్ రంగాల్లో టెక్నాలజీ ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటు.

పర్యాటకుల గమ్యస్థానంగా ఏపీ

- త్వరలో టూరిజం క్యాలెండర్: మంత్రి కందుల దుర్గేష్

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకుల గమ్యస్థానంగా మారుస్తామని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. టూరిజం పాలసీపై శుక్రవారం శాసనసభలో మంత్రి ప్రకటన చేశారు. 2024-29 పాలసీతో దేశంలోని టాప్-10 రాష్ట్రాల్లో ఏపీ ఒకటిగా నిలుస్తుందన్నారు. పర్యాటకం ద్వారా ఉపాధి అవకాశాలు 15 శాతం పెరుగుతాయని వివరించారు. పీపీపీ విధానంలో పెట్టుబడులు ఆహ్వానిస్తున్నామని, ఐదేళ్లలో రూ.25 వేల కోట్లు వస్తాయని అన్నారు. త్వరలో టూరిజం క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. కాగా, ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీని నిర్మించబోతున్నట్లు మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ వల్ల 40వేల మందికి ఉద్యోగాలు, రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. వైసీపీ ప్రభుత్వం క్రీడా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, పైగా ఆడుదాం ఆంధ్రా పేరుతో దోచుకున్నారని క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్క పులివెందులలోనే రూ.20 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడల కోటాను 3 శాతానికి పెంచామని తెలిపారు. క్రీడల్లో పేరు తెచ్చిన వారికి 'స్వర్ణాంధ్ర క్రీడ' బిరుదు ఇస్తామన్నారు.

జగన్‌రెడ్డీ సిగ్గులేదా..!: సోమిరెడ్డి

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాపాలు పండాయి. అంతర్జాతీయ స్థాయిలో ఏపీకి చెడ్డ పేరు తెచ్చిన జగన్‌కు రాజకీయ పార్టీని నడిపే నైతికత లేదు. వైసీపీని వెంటనే రద్దు చేయాలి' అని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'సౌర విద్యుత్ కొనుగోళ్లలో అదానీ సంస్థ నుంచి జగన్ రూ.1,750 కోట్ల ముడుపులు తీసుకున్నారని అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చినా.. ఇంకా సిగ్గులేకుండా ఏ ముఖం పెట్టుకుని వైసీపీని రద్దు చేయకుండా నడుపుతున్నారు? జగన్ అవినీతి అంతర్జాతీయ స్థాయికి చేరినందున సమాజం నుంచి అతన్ని వెలివేయాలి' అని సోమిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ, 'అసెంబ్లీ సమావేశాలకు రాకపోతే జగన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో రూ.100 కోట్ల అవినీతి చేసిన సీఎంలను జైలుకు పంపిన పరిస్థితులున్నాయి. ఏపీలో రూ.లక్షల కోట్లు దోచేసిన జగన్ మాత్రం బయట తిరుగుతున్నాడు' అన్నారు.

ప్రజావినతులపై జవాబుదారీగా ఉండాలి: లోకేశ్

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులకు వినతిపత్రం ఇస్తే.. వారు సమాధానం ఇస్తున్న విధానాన్ని రాష్ట్రంలోనూ అమలు చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో మాట్లాడుతుండగా.. పలువురు ఎమ్మెల్యేలు ఆయన్ని కలిశారు. వారి నియోజకవర్గాల్లో వచ్చిన ఓట్లపై ఎమ్మెల్యేలతో లోకేశ్ చర్చించారు. ప్రజలు ఎక్కువ ఓట్లతో మనల్ని గెలిపించారని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంలో పాఠశాలల పనివేళల పెంపుపై భిన్నాభిప్రాయాలు వస్తున్నాయని ఎమ్మెల్యేలు చెప్పగా, తనకూ ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. పైలట్ ప్రాజెక్ట్‌గా మాత్రమే దీనిని అమలు చేస్తున్నామని చెప్పారు.

అంతర్జాతీయ స్థాయికి జగన్ అవినీతి

- ఆయనతో పోలిస్తే ఎస్కోబార్ బాధపడతాడు: అసెంబ్లీలో ఎమ్మెల్యేలు

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకూ రాష్ట్ర, దేశ సరిహద్దులు దాటని మాజీ సీఎం జగన్ అవినీతి నేడు అంతర్జాతీయ స్థాయికి చేరిందని కూటమి ఎమ్మెల్యేలు విమర్శించారు. జగన్‌కు అదానీ లంచం ఇచ్చారంటూ అమెరికాలో నమోదైన కేసుపై సభలో ఎమ్మెల్యేలు స్పందించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, 'జగన్ రాష్ట్రాన్ని దోచేశారు. ఎక్కడో అమెరికాలో ఆయనపై కేసు నమోదైతే అందరూ నాకు ఫోన్ చేస్తున్నారు. జగన్‌తో మీకు స్నేహం ఉందా? అని అడుగుతున్నారు. జగన్ దురాగతాలపై అందరూ మౌనం వీడాలి. జగన్ అవినీతిపై విచారణకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి' అన్నారు. రూ.లక్ష కోట్లు దోచుకున్న జగన్‌కు రూ.1,750 కోట్లు పెద్ద విషయం కాదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాలేని పిరికి సన్నాసి జగన్ అని మండిపడ్డారు. ఓవైపు దేశంలో సీబీఐ, అమెరికాలో ఎఫ్‌బీఐ అభియోగాలు నమోదు చేసినా ఇంకా నిస్సిగ్గుగా జగన్ మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'గతంలో జగన్‌తో కలిసి పనిచేసినందుకు తలదించుకునే పరిస్థితి వచ్చింది. వైసీపీలో పనిచేసినందుకు తెలుగు జాతికి క్షమాపణలు చెపుతున్నా' అని అన్నారు. జగన్‌తో పోలికపెడితే అంతర్జాతీయ స్మగ్లర్ ప్యాబ్లో ఎస్కోబార్ కూడా బాధపడతాడని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు.



వంటలను పక్షులు, జంతువుల నుంచి కాపాడుకోవడం అన్నదాతకు తలకుమించిన భారమే. ఒక వినూత్న ఆలోచనతో ఆ సమస్యకు చెక్ పెట్టారు ఈ రైతు. బ్యాటరీతో పనిచేసే హ్యాండ్ మైకులు కొన్ని తెచ్చి పంటకు నలువైపులా వాటిని అమర్చారు. అందులో రికార్డు చేసిన వాయిస్‌ను ప్లే చేయడం ద్వారా పక్షులు, ఇతర జంతువులు ఆ పైరు దరి చేరకుండా కాపాడుకుంటున్నారు. ఈ ఒక్కో మైకు ఖరీదు రూ.700. గంటపాటు చార్జింగ్ పెడితే నాలుగు గంటలు పని చేస్తుందని రాజధాని అమరావతిలోని లింగాయపాలెంకు చెందిన రైతు తెలిపారు.

ఆస్తి కోసం తండ్రి కాళ్లు విరగ్గొట్టారు

- కళ్లలో కారం చల్లి కర్రలతో కొడుకుల దాడి
- ఆస్తి పంచడంలేదని, పెళ్లిళ్లు చేయడం లేదని అక్కసు
- కర్నూలు జిల్లా గోనెగండ్లలో దారుణం



కన్నకొడుకుల దాడిలో కాళ్లువిరిగిన తండ్రి మంతరాజు

గోనెగండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లు చేయక పోగా ఆస్తి కూడా పంచి ఇవ్వడంలేదన్న అక్కసుతో ఇద్దరు కుమారులు, చిన్న కుమార్తె కలిసి కన్నతండ్రిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. కళ్లలో కారం చల్లి ఇష్టమొచ్చినట్లు కొట్టి కాళ్లను విరిచేశారు. ఇందుకు భార్య కూడా సహకరించినట్లు తెలుస్తోంది. ఈ అమానవీయ ఘటన కర్నూలు జిల్లా గోనెగండ్లలో శుక్రవారం చోటుచేసుకుంది. గోనెగండ్లకు చెందిన నేసే మంతరాజు (60)కు భార్య ఆదిలక్ష్మితో పాటు కుమారులు నీలకంఠ, జగదీష్, మరో ఇద్దరు కుమార్తెలున్నారు. మంతరాజు ఐదేళ్ల క్రితం పెద్ద కుమార్తెకు పెళ్లి చేశారు. ఇద్దరు కుమారులు, చిన్న కుమార్తెకు పెళ్లిళ్లు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నీలకంఠ, జగదీష్ తండ్రివద్దకు వచ్చి.. 'మాకు పెళ్లి ఎప్పుడు చేస్తావు. ఆస్తి ఎప్పుడు పంచుతావు.' అంటూ తండ్రితో గొడవకు దిగారు. వీరికి భార్య, చిన్న కుమార్తె కూడా వంత పాడారు. ఆస్తి పంచేదిలేదని మంతరాజు అనడంతో వారు ఆగ్రహంతో రెచ్చిపోయారు. తలుపులు వేసి తండ్రి కంట్లో కారం చల్లి కట్టెలతో దాడి చేశారు. రెండు కాళ్లూ విరిగిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. నీలకంఠ, జగదీష్‌లను అదుపులోకి పోలీసులు తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేస్తామని సీఐ గంగాధర్ తెలిపారు.

గల్ఫ్‌కు 'అనంత' అరటి..



అనంతపురం జిల్లాలో పండించిన అరటి దిగుబడులతో 'బనానా రైలు' శుక్రవారం ముంబైకి బయల్దేరింది. తాడిపత్రి నుంచి శుక్రవారం బయల్దేరిన ఈ రైలును వర్చువల్ విధానంలో విజయవాడ నుంచి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ ఏడాది లక్ష టన్నుల అరటి ఉత్పత్తిని విదేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సౌదీ, ఇరాన్, ఇరాక్, ఖతర్, ఈజిప్ట్ వంటి దేశాలకు 15 కంపెనీల ద్వారా అరటి ఎగుమతి అవుతోందని తెలిపారు.

- అమరావతి, తాడిపత్రి

సుకుమా అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్...

10 మంది నక్సల్స్ మృతి

- మృతుల్లో ముగ్గురు మహిళలు

చింతూరు/చర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. సుకుమా జిల్లా బెజ్జి అడవుల్లో కేంద్ర బలగాలు, మావోయిస్టుల మధ్య సుమారు ఐదు గంటల పాటు సాగిన ఎదురు కాల్పుల్లో 10మంది మావోయిస్టులు మరణించారు. మృతుల్లో దక్షిణ బస్తర్ మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడు, మిలటరీ ఇన్‌చార్జి(డీవీసీఎం) మాసాతోపాటు ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. సుకుమా జిల్లా బెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ కలిసి సుమారు 600మంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. కొర్రాజుగూడ, భండరపర గుట్టల్లో శుక్రవారం ఉదయం బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. సుమారు ఐదు గంటల పాటు జరిగిన కాల్పుల్లో పది మంది మావోయిస్టులు మరణించగా చాలామంది పరారయ్యారని పోలీసులు చెబుతున్నారు. పరారైన వారి కోసం గాలిస్తున్నామని బస్తర్ ఐజీ సుందర్ రాజన్ తెలిపారు. మృతుల్లో ఆరుగురి వివరాలు గుర్తించామని మిగిలిన నలుగురు ఎవరనేది తెలియాల్సి ఉందని పేర్కొన్నాయి. మృతుల్లో మాసా(రూ.8లక్షలు), మాద్వి లక్మా (5లక్షలు), మడకం కోసి (2లక్షలు), మడకం జీతూ (2లక్షలు), కోవాసి కోసా(2లక్షలు), హంగి (మాసా భార్య 2లక్షలు)పై మొత్తం రూ.21లక్షల రివార్డు ఉందని తెలిపారు.

మావోయిస్టులకు వరుస దెబ్బలు..

మావోయిస్టు పార్టీ వరుస ఘటనలతో కుదేలైనట్టుగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 11 భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. వీటిలో కాంకేర్ జిల్లాలో 29 మంది, అక్టోబరు 5న అబూజ్‌మడ్ అడవుల్లో 38మంది మావోయిస్టులు మృతిచెందారు. ఇవి కాకుండా మరో 9 ఘటనల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోయిస్టుల ఉనికిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాగా, 2026 మార్చి నాటికి మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా అడవులపై బలగాలు ప్రత్యేక దృష్టి సారించాయి.

సీఎఫ్ఎంఎస్ లోపాలపుట్ట

- భద్రతపై కాగ్ తీవ్ర అభ్యంతరాలు
- మూడేళ్లలో 968 కోట్ల నకిలీ బిల్లుల చెల్లింపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర చెల్లింపుల వ్యవస్థ సీఎఫ్ఎంఎస్ (సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ)పై కాగ్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ వ్యవస్థ భద్రతపై సందేహాలు లేవనెత్తింది. చెల్లింపులు, విత్‌డ్రాలు, ఇతర లావాదేవీలు ఈ వ్యవస్థ ద్వారా సురక్షితం కాదంటూ... ఈ వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెట్టేలా పలు సంఘటనలను ఉదహరించింది. రాష్ట్రానికి చెందిన అన్ని రాబడులు, చెల్లింపులు సీఎఫ్ఎంఎస్ ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వ అకౌంట్లను ఆడిట్ చేయడానికి కాగ్ ఈ వ్యవస్థలోని సమాచారంపై ఆధారపడుతుంది. ఈ వ్యవస్థ ద్వారా జరిగే లావాదేవీల సమగ్రత, విశ్వసనీయత కీలకమని భావించి, వీటిపై కాగ్ అధ్యయనం చేసి నివ్వెరపోయే వాస్తవాలను బయటపెట్టింది. సీఎఫ్ఎంఎస్‌ను నిర్వహించే ఏపీసీఎఫ్ఎస్ఎస్ ఇచ్చిన సమాచారం, డాక్యుమెంట్లు, ఈ వ్యవస్థను ఉపయోగిస్తున్న కొన్ని శాఖల లావాదేవీలను పరిశీలించి నివేదిక రూపొందించింది. సీఎఫ్ఎంఎస్ ఎంతవరకు భద్రం? ఈ వ్యవస్థను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఏంటన్న ప్రశ్నలకు రాష్ట్ర ఆర్థిక శాఖ కానీ, ఏపీసీఎఫ్ఎస్ఎస్ కానీ సమాచారం అందించలేదని కాగ్ ఆ నివేదికలో పేర్కొంది. నివేదికలోని ముఖ్యాంశాలు...

ఏది అసలో.. ఏది నకిలీయో?

సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా బిల్లుల చెల్లింపులు చేస్తున్నారు. కానీ ఈ వ్యవస్థలో నకిలీ బిల్లులు గుర్తించేందుకు అవకాశం లేదు. ఈ లోపం వల్ల 2018 ఏప్రిల్ నుంచి 2021 సెప్టెంబరు వరకు 1,41,917 నకిలీ బిల్లుల కోసం రూ.968 కోట్లు చెల్లించారు. ఇది ఖజానాకు నష్టం. వీటిని తిరిగి వసూలు చేయడం కోసం ప్రభుత్వానికి కాగ్ సూచనలు చేసింది. ఈ వ్యవస్థలో ఏదైనా ఒక విభాగంలో ఎన్ని చెల్లింపులు చేయాలన్న పరిమితిపై నియంత్రణ లేకపోవడంతో 2018 ఏప్రిల్ నుంచి 2021 సెప్టెంబరు వరకు 193 మంది ఖజానా అధికారులు, డీడీవోల పరిధిలో 2,545 మంది పెన్షనర్లకు సంబంధించి రూ.218.15 కోట్ల డబ్బు అధికంగా డ్రా చేశారు. ఈ లోపాన్ని ఆసరాగా చేసుకుని ఎక్కువ డబ్బు డ్రా చేసిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కాగ్ సూచించింది. బిల్లు లబ్ధిదారుడు, చెల్లించాల్సిన మొత్తాల మధ్య స్పష్టత లేకపోవడంతో రూ.43 లక్షలు దుర్వినియోగమైంది. ఆర్థిక శాఖలో క్యాష్-సెట్ విభాగం ప్రమేయం లేకుండా సీఎఫ్ఎంఎస్ బ్యాక్‌ఎండ్ ద్వారా 1,44,493 పీడీ ఖాతాలు సృష్టించారు. అంతే కాక 2019 మార్చి నుంచి 2021 మార్చి వరకు 3,41,410 కేసుల్లో పీడీ ఖాతాల నుంచి రూ.71,568.44 కోట్లు ల్యాప్స్ అయ్యాయి. ఈ వ్యవహారాన్ని ఆర్థిక శాఖతో సంబంధం లేకుండా సీఎఫ్ఎంఎస్ బ్యాక్ ఎండ్ విభాగం నుంచి చేయడంతో లావాదేవీల నిర్వహణ, బిల్లుల రద్దు ఆర్థిక శాఖ దృష్టికి రాలేదు.

> సీఎఫ్ఎంఎస్ వ్యవస్థలో నకిలీ బిల్లులు గుర్తించేందుకు ఎలాంటి అవకాశం లేదు. ఈ లోపం వల్ల 2018 ఏప్రిల్ నుంచి 2021 సెప్టెంబరు వరకు 1,41,917 నకిలీ బిల్లుల కోసం రూ.968 కోట్లు చెల్లించారు. ఇది ఖజానాకు నష్టం. ఈ వ్యవస్థలో ఒక విభాగంలో ఎన్ని చెల్లింపులు చేయాలన్న పరిమితిపై నియంత్రణ లేదు. దీంతో 2018 ఏప్రిల్ నుంచి 2021 సెప్టెంబరు వరకు 2,545 మంది పెన్షనర్లకు సంబంధించి రూ.218.15 కోట్లు అధికంగా డ్రా చేశారు.
> - కాగ్ నివేదిక

- ట్రెజరీ స్థాయిలో ఆమోదం పొందిన బిల్లుల చెల్లింపుల కోసం ఇ-కుబేర్‌కు పంపకుండా అధికారిక ధ్రువీకరణ పేరుతో ఆపడాన్ని కాగ్ తప్పుబట్టింది.
- బిల్లుల ఆమోదం లేదా రద్దుకు అధికారులు పేర్కొన్న కారణాలు సరిగ్గా లేవని పేర్కొంది.
- నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ బిల్లులను ఆపి ఉంచడం, ఈ వ్యవస్థలో ఉన్న అతి పెద్ద లోపమని కాగ్ పేర్కొంది.
- లావాదేవీ జరిగినప్పటి నుంచి ఒక్క రోజు వ్యవధిలో ఆర్‌బీఐ నుంచి దీనికి సంబంధించిన నోటిఫికేషన్ రావాలి. కానీ 1,865.73 కోట్ల రాబడులకు సంబంధించిన 11,59,025 చలానాలకు ఆర్‌బీఐ నుంచి 196 రోజుల ఆలస్యంతో వచ్చాయి.
- సీఎఫ్ఎంఎస్‌లోని సీ-పిన్, నగదు డేటాను, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ వద్ద ఉన్న జీఎస్టీ డేటాలోని సీ-పిన్, నగదు డేటాతో పోల్చి చూడగా 73,596 లావాదేవీల్లో సంబంధిత డీడీవోలు సీ-పిన్‌లను తప్పుగా నమోదు చేశారు. ప్రభుత్వం నుంచి తీసుకున్న రూ.264.33 కోట్ల మొత్తాన్ని చెల్లించడంలో ఆ డీడీవోలు విఫలమయ్యారు.
- బడ్జెట్ నిర్వహణలో డెట్, డిపాజిట్, సస్పెన్స్, రెమిటెన్స్‌లకు సంబంధించి డెబిట్ లేదా క్రెడిట్ అంశాలను సీఎఫ్ఎంఎస్‌లో ఉంచలేదు. అందువల్ల సీఎఫ్ఎంఎస్ ద్వారా రూపొందించే పద్దుల్లో నిల్వలు అధికంగా చూపే ఆస్కారం ఉంది.
- సీఎఫ్ఎంఎస్‌లో వివిధ ఖాతాల వర్గీకరణ కాగ్ జారీచేసిన పెద్ద, చిన్న ఖాతాల జాబితాలకు అనుగుణంగా లేదు. దీనివల్ల కంటింజెంట్ బిల్లులు భారీగా పేరుకుపోయాయి. ఈ లెక్క తేలక డీడీవోల వద్ద నిధులు పేరుకుపోతూ ఉంటాయి.
- ప్రభుత్వం డీసీ బిల్లుల సమర్పణకు 90 రోజుల గడువు నిర్దేశించగా 2054 మంది డీడీవోలు 91 రోజుల నుంచి 1306 రోజుల వ్యవధిలో సమర్పించారు. ఈ డీసీ బిల్లుల సంఖ్య రెండు కంటే ఎక్కువ ఉండకూడదు. కానీ 104 మంది డీడీవోల వద్ద 3-35 బిల్లుల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

'పల్లవీ'.. వర్ధిల్లు!

- రోడ్డు ప్రమాదంలో బాలిక బ్రెయిన్‌డెడ్.. తల్లిదండ్రులకు తీవ్రగాయాలు
- పుట్టెడు దుఃఖంలోనూ బిడ్డ అవయవదానానికి అంగీకారం



విజయనగరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అమ్మానాన్నలతో కలిసి దైవదర్శనానికి వెళ్లిన ఆ చిన్నారి.. రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్‌డెడ్‌కు గురైంది. తల్లిదండ్రులు తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. అయితే అవయవదానంతో మరికొందరికి పునర్జన్మనిచ్చింది ఆ చిట్టితల్లి!. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులు తీసుకున్న ఈ నిర్ణయం అందరినీ గుండెలు బరువెక్కేలా చేసింది. వివరాలివీ.. విజయనగరం జిల్లా గంటాడ్య మండలం మురపాక గ్రామానికి చెందిన గండి వెంకటరమణ, దేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వెంకటరమణ తన భార్య, చిన్న కూతురు పల్లవితో కలిసి బుధవారం తాటిపూడి రిజర్వాయర్ అవల ఉన్న ఎగువ కొండపర్తి వెళ్లారు. అక్కడి వైకుంఠగిరి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ద్విచక్రవాహనంపై తిరుగుప్రయాణమయ్యారు. ఎస్‌ఆర్ పురం వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో దంపతుల కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. పల్లవి(13) తలకు బలమైన గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయింది. రెండు రోజులుగా విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. అయితే, బాలిక జీవించే అవకాశం లేదని వైద్యులు ధ్రువీకరించారు. ఒకవైపు కుమార్తె బతకదన్న బాధ, మరోవైపు బలమైన గాయాలతో చికిత్స పొందుతూ పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ దంపతులు.. మానవత్వంతో కుమార్తె అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో శుక్రవారం గ్రీన్‌చానల్ ద్వారా పల్లవి అవయవాలను విశాఖలోని మెడికవర్, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రులకు కిడ్నీలను, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి కళ్లను తరలించారు. చిరంజీవిగా వర్ధిల్లు తల్లీ.. అంటూ ప్రజలు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. పల్లవి స్కూలు టీచర్లూ కన్నీరు మున్నీరయ్యారు.

కదల్లేని స్థితిలో అంత్యక్రియలకు.. తిరిగి ఆస్పత్రికి!

పల్లవి అవయవాలను గ్రీన్‌చానల్ ద్వారా విశాఖకు తరలించిన తర్వాత ఆ చిన్నారి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తరలించారు. అయితే, తీవ్ర గాయాలతో కదల్లేని స్థితిలో ఉన్న పల్లవి తల్లిదండ్రులు సైతం బరువెక్కిన గుండెలతో రోదిస్తుండగా.. వారిని స్ట్రెచర్‌పై అంబులెన్సులో అంత్యక్రియల స్థలికి తరలించారు. అక్కడి కార్యక్రమం పూర్తయ్యాక, తిరిగి దంపతులిద్దరినీ సాయంత్రం ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స కొనసాగిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.